
పశ్చిమ ప్రాంతంలో వైసీపీ నేతలు బరితెగించారు. గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీలోకి ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన వలసలు ఎన్నికల షెడ్యూల్ ప్రకటన అనంతరం భారీగా పెరిగిపోయాయి. తాయిలాలు ఆశచూపినా అవి ఆగకపోవడంతో వైసీపీ అభ్యర్థి పక్షాన పనిచేస్తున్న ముఖ్యనాయకులు బెదిరింపు రాజకీయాలకు తెగబడుతున్నారు. ఇక మార్కాపురంలో తాగునీటి సమస్యతో సతమతమవుతున్న ప్రజలు 'మా ఎమ్మెల్యే ఏరి.. మా సమస్యలు పట్టవా' అంటూ నిలదీస్తున్నారు. దీంతో హడావుడిగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే ప్రలోభ రాజకీయాలకు వైసీపీ తెరతీసింది. ఇదేసమయంలో పార్టీలోని కిందిస్థాయి పదవుల్లో ఉన్న నాయకులను క్రియాశీలకం చేసుకునేందుకు వారి జేబులు నింపే చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో రెండు నియోజకవర్గాల్లో ప్రజలు వైసీపీ నేతల వ్యవహారశైలిని చూసి విస్తుపోతున్నారు.



- గిద్దలూరులో బెదిరింపులు
- మార్కాపురంలో నీళ్ల రాజకీయం
- అధికార పార్టీ నేతల బరితెగింపు వ్యవహారాలు
- కదలని పార్టీ కేడర్.. పలకని ఓటర్లు..
- పాలోమని టీడీపీ కూటమిలోకి వలసలు
- సమస్యలు పట్టవా అంటూ నిలదీస్తున్న ప్రజలు



వైచీప్ ట్రిక్స్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు లోక్‌సభ పరిధిలో బెదిరింపు రాజకీయాలు ప్రారంభమయ్యాయి. గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో ఆ వ్యవహారాలు ఎక్కువయ్యాయి. ప్రధానంగా ఎమ్మెల్యేలను మార్చి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులుగా జగన్ ఆస్థానాల్లో రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. దీనికి తోడు ఎంపీ మాగుంటను తప్పించి తిరుపతి జిల్లా నుంచి దిగుమతి చేసుకున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారు. అయితే జగన్ వ్యూహానికి ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలి అభ్యర్థులు బిత్తరపోయారు. తొలుత ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం కన్నా పార్టీ కేడర్‌ను దారిలోకి తెచ్చుకోవడానికే రకరకాల ప్రలోభాలకు పాల్పడాల్సి వచ్చింది. ఆరంభంలోనే ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి ప్రోత్సాహంతో పార్టీ నేతలకు డబ్బులతో వల విసిరారు. పార్టీ కౌన్సిలర్లకు గిద్దలూరులో రూ.2లక్షలు, మార్కాపురంలో లక్ష ప్రకారం డబ్బులు ఇచ్చారు. మార్కాపురంలో ఒక్కొక్కరికీ మరో రూ.2లక్షలను, గిద్దలూరులో మరో లక్ష ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. కేవలం కౌన్సిలర్లకు డబ్బులు ఇవ్వడంతో ఆ వార్డుల్లోని పార్టీలోని క్రియాశీల రాజకీయ నాయకులు ఎదురుతిరిగారు. దీంతో మార్కాపురంలో కౌన్సిలర్లను పిలిచి ప్రతి వార్డులో ఐదుగురు కార్యకర్తలకు ఒక్కొక్కరికి రూ.10వేల ప్రకారం ఇవ్వమని చెప్పి ఆ మేరకు అందజేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో గ్రామాల నుంచి పోటీపెరగడంతో ప్రస్తుతం వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు కూడా భారీగా ముట్టజెప్పే పనిలో నిమగ్నమయ్యారు.

టీడీపీలో చేరే వారికి బెదిరింపులు

ఇటీవల వైసీపీలోని ఒక బీసీ, ఒక రెడ్డి సామాజికవర్గానికి చెందిన నాయకులు టీడీపీలో చేరబోతున్నట్లు ప్రచారం జరిగింది. అందులో ఒకరితో వైసీపీ అభ్యర్థి సమీప బంధువు సమావేశమై.. 'ఈసారికి పోటీ ఉంటుంది. లారీ వచ్చి ఢీకొంటుంది. కట్ చేస్తే అందులో మీరు ప్రాణాలతో ఉండరు' అంటూ ఒక సినిమా కథ చెప్పి బెదిరించినట్లు తెలిసింది. దీనికి ఆ నాయకుడు కూడా దీటుగానే స్పందించినట్లు తెలిసింది. మనందరి ప్రాణాలు ఎప్పుడైనా పోయావే.. కానీయండి చూద్దామని గట్టిగా సమాధానమిచ్చినట్లు సమాచారం. ఇదేసమయంలో ఆదివారం బేస్తవారపేటలో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన ప్రముఖులంతా టీడీపీలో చేరారు. ఉదయం అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరినా రాత్రి ఎంపీ మాగుంట, అశోక్‌రెడ్డి కలిసి పాల్గొన్న కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో బిత్తరపోయిన వైసీపీ అభ్యర్థి, ముఖ్య నాయకులు హుటాహుటిన బేస్తవారపేట చేరారు. ఆర్యవైశ్యులంటే చులకనభావం కాబోలు పార్టీ మారిన వారిని వెనక్కు రండి అంటూ హుకుం జారీచేసినట్లు తెలిసింది. తదనుగుణంగా పలురకాలుగా బెదిరింపు సంకేతాలు వెళ్లినట్లు సమాచారం. సోమవారం ఉదయాన్నే అభ్యర్థి నాగార్జునరెడ్డి, ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి మరికొందరు ముఖ్య నాయకులు బేస్తవారపేటకు చేరారు. కొంతసేపటికి వారు పార్టీ మారిన బొంతల లక్ష్మణ్ అనే నాయకుడి ఇంటికి వెళ్లారు. ఒక అర్ధగంట తర్వాత ఆయన మెడలో తిరిగి వైసీపీ కండువా వేశారు. అనంతరం ఆయన, ఆయన సతీమణి పార్టీలోనే ఉంటున్నట్లు ప్రకటింపజేసి సోషల్ మీడియాలో సమాచారం ఇచ్చారు. ఈ బెదిరింపు చర్యలను ఈసడించుకున్న మిగిలిన ఆర్యవైశ్య ప్రముఖులు వారి ఇంటికి వెళ్లేసరికి అక్కడ లక్ష్మణ్ దంపతులు కనిపించలేదు. వారిని వైసీపీ నాయకులే ఎవరికీ అందుబాటులో ఉంచకుండా తీసుకెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.

గిద్దలూరులో వలసలను ఆపేందుకు హత్య

గిద్దలూరులో బెదిరింపు రాజకీయాలకు వైసీపీ శ్రీకారం పలికింది. ఈ నియోజకవర్గంలో ఏడాదిన్నర నుంచి టీడీపీలోకి వలసలు పెరిగాయి. టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి పకడ్బందీగా పెంచుకున్న ప్రజాసంబంధాలు అందుకు కారణమయ్యాయి. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని వైసీపీ గిద్దలూరు అభ్యర్థిగా దింపడం, ఆ తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో వలసలు పెరిగిపోయాయి. దీంతో బెదిరింపు రాజకీయాలకు శ్రీకారం పలికారు. ఇటీవల మునయ్య అనే గిరిజన యువ నాయకుడిని వైసీపీకి చెందిన వారు పథకం ప్రకారం హత్యచేసిన విషయం విదితమే. మునయ్య ఏడాదిన్నర క్రితం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ హత్యతో వలసలకు బ్రేక్ పడుతుందనే అధికారపార్టీ నేతల ఆశలు గల్లంతై చేరికలు ఇంకా రెట్టింపయ్యాయి.

నీటి సరఫరాలోనూ రాజకీయం

మార్కాపురంలో నీళ్ల రాజకీయం తారస్థాయికి చేరింది. ఇక్కడ ఎమ్మెల్యేను గిద్దలూరు పంపిన జగన్.. అక్కడి ఎమ్మెల్యే రాంబాబును మార్కాపురం అభ్యర్థిగా రంగంలో దించారు. మార్కాపురం పట్టణానికి మంచినీటి సరఫరా చేసే పైప్‌లైన్ కొద్దిరోజుల క్రితం దెబ్బతింది. దానిపై స్పందించి వెంటనే మరమ్మతులు చేసే వారు కరువయ్యారు. నీటి సమస్య తీవ్రమవడంతో ప్రచారానికి వెళ్లిన వైసీపీ నాయకులకు నిలదీతలు ఎదురయ్యాయి. మా ఎమ్మెల్యే ఎక్కడ అంటూ పట్టణవాసులు ప్రశ్నించారు. సమాధానం చెప్పలేకపోయిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చివరకు ఎంపీ అభ్యర్థి రంగంలోకి వచ్చి ట్యాంకర్ ఏర్పాటు చేశారు. ఉభయకుశలోపరి అన్నట్లుగా కౌన్సిలర్లు, ఇతర ముఖ్యనాయకులను పిలిచి 'మీరే వాహనం పెట్టుకోండి, నేను ఒక్కో ట్రిప్పునకు రూ.450 ఇస్తా, వార్డుకు రోజువారీ 10 ట్రిప్పులు సరఫరా చేయాలి. అందులో వచ్చే ఆదాయంతో మీరు జల్సా చేయండి' అంటూ ఆదేశాలు ఇచ్చారు. ఆ తర్వాత ట్రిప్పునకు రూ.450కాదు, రూ.300 ఇస్తానంటూ మాటమార్చారు. అలాగైతే తమకు నష్టం వస్తుందంటూ కౌన్సిలర్లు, నాయకులు ఎదురుతిరిగారు. మధ్యవర్తుల రాయబారాల అనంతరం ట్రిప్పునకు రూ.400 ప్రకారం చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. ఆవిధంగా నీటి ట్యాంకర్ అద్దె, డ్రైవర్ ఖర్చుతో రూ.300కు తోలేందుకు యజమానులతో మాట్లాడుకున్నారు. అయితే నీటిని మారుమూల రైతుల పొలాల్లో కొనుగోలు చేస్తే ఖర్చవుతుందని మున్సిపాలిటీ బోర్ల నుంచే ఇచ్చేవిధంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ నీరు ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతుందో కానీ ఒక్కో ట్రిప్పునకు రూ.400 ఇస్తే అందులో రూ.100 కౌన్సిలర్లు, స్థానిక నాయకులు జేబులోకి వెళ్తాయి. అయితే రోజుకు ఒక్కొక్కరు 10 ట్రిప్పులు మించి నీటి సరఫరా చేయకూడదంటూ షరతు విధించారు. మంచినీటి సరఫరాకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోకపోగా ఈ నీళ్ల రాజకీయం ఏంటి అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఎస్పీపై వేటు

- కొరడా ఝులిపించిన ఈసీ
- ఉలిక్కిపడ్డ యంత్రాంగం
- చెవిరెడ్డి ఎత్తుగడకు బ్రేక్
- వైసీపీలో అంతర్మథనం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎస్పీ పరమేశ్వరరెడ్డిపై ఎన్నికల కమిషన్ వేటు వేయడంతో అధికార యంత్రాంగం ఉలికిపాటుకు గురైంది. అదే సమయంలో వైసీపీ శ్రేణులు కంగు తిన్నాయి. ప్రధానంగా ఎన్నికల సమయంలో ఉపయోగపడతారని భావించి ఏరికోరి తెచ్చుకున్న ఎస్పీ వెళ్లిపోవడం ఆ పార్టీ నేతలకు మింగుడుపడటం లేదు. మరోవైపు గిరిజన యువకుడు మునయ్య హత్య ఉదంతంపై లోతైన దర్యాప్తు జరిగితే కిందిస్థాయిలో కొందరు పోలీసు అధికారులు బలికావాల్సి వస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎస్పీపై వేటుపడటం టీడీపీ కూటమి శ్రేణులకు మాత్రం మనోధైర్యాన్ని కల్పించిందని చెప్పవచ్చు.



వైసీపీ నేతలకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు

జిల్లా ఎస్పీగా ఫిబ్రవరి 12న పరమేశ్వరరెడ్డి బాధ్యతలు చేపట్టారు. అయితే గతంలోనే రాజకీయంగా కొన్ని వివాదాస్పద అంశాల్లో ఆయన ఇరుక్కున్నారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసుకు సంబంధించి నిందితులను కాపాడారనే విషయమై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఒంగోలు లోక్‌సభకు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా తిరుపతి జిల్లాకు చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రంగంలోకి రావటం ఖాయమైన తర్వాతే పరమేశ్వరరెడ్డిని జిల్లాకు బదిలీ చేశారు. ఏరికోరి చెవిరెడ్డి ఆయన్ను తిరుపతి నుంచి ఇక్కడకు బదిలీ చేయించుకున్నారన్న ప్రచారం జరిగింది. కొన్ని అంశాలలో వివాదరహితంగా ఆయన వ్యవహరించినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా వైసీపీ నేతలకు సహకరిస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. ఆయన పరిధిలోని ఎస్సైల బదిలీల విషయంలో అది తేటతెల్లమైంది. ఆపై కానిస్టేబుళ్ల బదిలీల విషయంలో పూర్తిగా అధికార పార్టీ నేతలు, ప్రధానంగా అభ్యర్థుల సిఫార్సులకు అనుగుణంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. దర్శి నియోజకవర్గంలో కులం ప్రాతిపదికగా వైసీపీ నేతల సిఫార్సులకు అనుగుణంగా సిబ్బంది బదిలీలు జరిగిపోయాయన్న ప్రచారం జరిగింది.

మునయ్య హత్యే ముంచింది

గిద్దలూరు నియోజకవర్గం మహేశ్వరపురంలో గత నెలలో టీడీపీకి చెందిన గిరిజన యువకుని హత్య జరిగింది. పథకం ప్రకారమే వైసీపీ వారు హత్యచేశారు. అదీ ముందుగా ఫోన్‌లో హెచ్చరించి మరీ చేశారు. ఆ తర్వాత నిందితులను అరెస్టు చేయడంలోనూ పోలీసులు మీనమేషాలు లెక్కించారు. వైసీపీ నాయకులను కాపాడేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న టీడీపీ నాయకత్వం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఎస్ఈసీ ఎస్పీ పరమేశ్వరరెడ్డిని పిలిచి ఆయన వివరణ కూడా తీసుకున్నారు. మునయ్య హత్యకు పథకం వేసిన విషయం తెలిసి కూడా కాపాడలేకపోవడం, హత్య అనంతరం మృతుడి భార్యపై ఒత్తిడిచేసి వైసీపీ నేతల పేర్లు చెప్పకుండా చేయడం, చివరకు గ్రామ, మండలస్థాయిలో ఇద్దరు వైసీపీ నాయకుల కుట్రపై వచ్చిన ఫిర్యాదును చెత్తబుట్టలో వేయడంలాంటి అంశాలను ఈసీ క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలుస్తోంది. తదనుగుణంగా రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకున్న కేసు విషయంలో పోలీసు వైఫల్యాన్ని గుర్తించి ఎస్పీని బదిలీచేసి ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు తెలుస్తోంది.

దిగాలుపడ్డ అధికారపార్టీ

ఎస్పీపై వేటుతో యావత్తు యంత్రాంగం ఉలికిపాటుకు గురైంది. ఎస్పీ సహకారంతో టీడీపీ కూటమికి చెందిన పోలింగ్ ఏజెంట్లను కూడా బెదిరించి కట్టడి చేయాలనుకున్న వైసీపీ నేతలు దిగాలుపడ్డారు. ప్రధానంగా టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పినట్లు ఎర్రచందనం స్మగ్లింగ్‌లో ఆరితేరిన చెవిరెడ్డి వ్యూహానికి బ్రేక్ పడిందన్న భావనను టీడీపీ కూటమి నాయకులు బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తదుపరి మరింత విచారణ జరిగే అవకాశాలు లేకపోలేదు. భవిష్యత్తులో టీడీపీ కూటమికి అధికారం వస్తే కచ్చితంగా మునయ్య హత్య ఘటనపై పునర్విచారణ జరిపి పాత్రధారులు, సూత్రధారులతోపాటు వారికి సహకరించిన పోలీసు అధికారులను బాధ్యులను చేసే అవకాశం కూడా ఉండొచ్చు. దీంతో ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం జిల్లాలో రాజకీయంగా సంచలనమైంది.

24నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 2 : రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలకు ప్రభుత్వం ఈనెల 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ప్రకారం ఈనెల 23న పాఠశాలలకు చివరి పనిదినం. జూన్ 11 వరకు వేసవి సెలవులు. జూన్ 12న పునఃప్రారంభమవుతాయి. స్టేట్ సిలబస్ పాఠశాలలకు మాత్రమే ఈ సెలవులు వర్తిస్తాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లతో కార్పొరేటర్ నాగరాజు

వైసీపీ రాజీ డ్రామా

- వలంటీర్లుగా వద్దు.. పార్టీ కార్యకర్తలుగా పనిచేయండి
- 28 మందితో రాజీనామాలు చేయించిన కార్పొరేటర్

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వలంటీర్లు విధుల్లో ఉండటానికి వీల్లేదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వైసీపీ నేతల్లో కలవరం మొదలైంది. డివిజన్లలో పార్టీ ప్రచార కార్యక్రమాలకు కీలకంగా వ్యవహరించే వలంటీర్లు దూరంగా ఉండటం ఇష్టం లేని వైసీపీ నేతలు కొత్త ఎత్తుగడలకు తెరతీశారు. ఇప్పటికే వలంటీర్‌కు వందనం అంటూ భారీగా బహుమతులతోపాటు నగదు కూడా ఇచ్చి తమ చేతిలోనే ఉంచుకున్నారు. అయితే వారి ఎత్తులకు ఈసీ చెక్ పెట్టి వలంటీర్లు ప్రచారంలో కనిపించకూడదని హెచ్చరించడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఈ మేరకు వలంటీర్ ఉద్యోగం మేమే ఇచ్చాం. ఇప్పుడు పోస్టు వద్దు వైసీపీ కార్యకర్తలుగా పనిచేయండని సూచిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వస్తే మిమ్మల్నే మళ్లీ వలంటీర్‌ను చేస్తామని నమ్మబలుకుతున్నారు. దీంతో పలువురు వలంటీర్లు తమ ఉద్యోగాలను వదిలేస్తూ రాజీనామా డ్రామాలకు తెరతీశారు. అయితే నిబంధనల ప్రకారం స్వచ్ఛందంగా వారు పనిచేసే సచివాలయ అడ్మిన్ అధికారికో, వారిపై ఉన్నతాధికారి అయిన కార్పొరేషన్ కమిషనర్‌కో తమ రాజీనామా పత్రాలు అందజేయాలి. కానీ ఆలా చేయడం లేదు. మంగళవారం నగరంలోని 21 డివిజన్ పరిధిలోని 31, 32 సచివాలయాలలో పనిచేసే 28 మంది వలంటీర్లు తమ సేవలకు స్వస్తి చెప్పారు. ఆ డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజు మాత్రం అత్యుత్సాహం చూపి, నిబంధనలను మరిచిపోయారు. ఆయనే అందరినీ ఒకచోట చేర్చి రాజీడ్రామాకు తెరతీశారు. కొందరిపై ఒత్తిడి తీసుకొచ్చి పోస్టు వదిలేయండి.. మా కార్యకర్తలుగా పనిచేయండి అంటూ కొత్త డ్రామాలు మొదలు పెట్టారు. ఈ రెండు నెలలపాటు మీకు అందించే పారితోషికం పార్టీ నుంచి ఇస్తామని చెప్పడం ఇక్కడ విశేషం. కాగా అందరితో తానే రాజీనామా పత్రాలు రాయించి అదేదో ఘనకార్యం చేసినట్లు వాటిని చూపుతూ ఫొటోలు దిగి మీడియాకు ఇచ్చారు.

నీటికోసం రోడ్డెక్కిన ప్రజలు

- సింగరాయకొండలో ఖాళీ బిందెలతో నిరసన
- రెండు వారాలుగా సరఫరా లేకపోవడంపై ఆగ్రహం
- సమస్యను పరిష్కరించకుంటే పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక

సింగరాయకొండ, ఏప్రిల్ 2 : తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ సింగరాయకొండ వాసులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఖాళీ బిందెలతో స్థానిక కందుకూరు రోడ్డులో నిరసన చేపట్టారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే స్వామి సింగరాయకొండకు రామతీర్థం నీటిని తీసుకొచ్చి ప్రజల ఇక్కట్లను తొలగించారని తెలిపారు. వైసీపీ అధికారం లోకి వచ్చిన నాటి నుంచి ఆపార్టీ నాయకుల అసమర్థత కారణంగా గ్రామానికి తాగునీరు సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వైసీపీ నాయకులు, అధికారులు కలిసి రామతీర్థం పథకాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. రెండు రోజుల్లో నీరు ఇవ్వకపోతే పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, ఓలేటి రవిశంకర్‌రెడ్డి, కళ్లగుంట నరసింహ, పూనూరి నరేష్, యస్దాని, బచ్చే, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్, కాసుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

ఇళ్ల వద్దనే పింఛన్లు ఇవ్వాలి

- టీడీపీ, మిత్రపక్షాలు డిమాండ్
- అధికారులకు వినతిపత్రాలు

ఒంగోలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులను సచివాలయాలకు పిలవకుండా ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ, మిత్రపక్షాలు డిమాండ్ చేశాయి. అందుకోసం సచివాలయ సిబ్బందిని ఇళ్లకు పంపించాలని కోరాయి. రాష్ట్రవ్యాప్తంగా గతంలో వలంటీర్లు పింఛన్లు అందజేస్తుండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో వారిని ఆ విధులకు దూరంగా ఉంచాలని ఈసీ ఆదేశించింది. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. 1వతేదీకి బదులు 3వతేదీ నుంచి సచివాలయాల వద్ద లబ్ధిదారులకు పింఛన్లు అందజేసేలా ప్రభుత్వం ఆదేశించింది. అదే సమయంలో పింఛన్ల పంపిణీని టీడీపీ అడ్డుకుంటున్నదని వైసీపీ దుష్ప్రచారం ప్రారంభించింది. ఈ వ్యవహారంపై టీడీపీ మండిపడింది. ఎన్నికల వేళ ఖజానాలో ఉన్న సొమ్మును తమకు అనుకూలురైన కాంట్రాక్టర్లకు ఇచ్చేసిన వైసీపీ ప్రభుత్వం పింఛన్ చెల్లింపులకు డబ్బు లేకుండా చేసి దానిని బయటకు రాకుండా ఉండేలా టీడీపీపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. సచివాలయాల సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఒక రోజులోనే ఇచ్చే అవకాశం ఉన్నా అందుకు విరుద్ధంగా లబ్ధిదారులను సచివాలయాలకు రావాలని, వారంరోజులపాటు పంచుతామని చెప్పి టీడీపీపై విషప్రచారం చేస్తున్నదని పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణం ఇళ్ల వద్దకే సిబ్బంది వెళ్లి పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం టీడీపీ శ్రేణులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా వినతిపత్రాలు అందించిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నిరసన తెలిపారు. ఒంగోలులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్‌లు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలాగే నాగులుప్పలపాడు, సంతనూతలపాడు, టంగుటూరు. జరుగుమల్లి, తాళ్ళూరు. పామూరు, గిద్దలూరు అర్ధవీడు, కంభం, వెలిగండ్ల, ముండ్లమూరు, ఎర్రగొండపాలెం, మార్కాపురం, తర్లుపాడులతోపాటు పలు ఇతర మండలాల్లోనూ టీడీపీ మిత్రపక్షాల నేతలు అక్కడి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

లక్కవరం ఇన్‌చార్జి కార్యదర్శి సస్పెన్షన్

- వివరాలు లోపలి పేజీల్లో..

రూ.లక్ష ఇస్తారా.. కేసు పెట్టమంటారా!

- టీడీపీ సర్పంచ్ తనయులకు టంగుటూరు ఎస్సై హెచ్చరిక
- రూ.70వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం

లోపలి పేజీల్లో..



పట్టుబడిన ఎస్సై నాగేశ్వరరావు

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

సచివాలయాల్లోనే నగదు అందజేత

మంచంలో ఉన్న వారికి, దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధుల వారికి మాత్రమే ఇంటికి పింఛన్లు

ఒంగోలు నగరం, ఏప్రిల్ 2: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీని చేపట్టనుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వలంటీర్లను పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి తప్పించిన ప్రభుత్వం తొలుత సచివాలయాల్లోనే పింఛన్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. అయితే ప్రతిపక్షాల డిమాండ్ మేరకు సోమవారం సచివాలయం సిబ్బందినే ఇంటింటికీ పంపించి పింఛన్లు అందజేయాలని నిర్ణయించింది. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు పింఛన్లను ఇంటి వద్దకే వెళ్లి అందించాలని వినతిపత్రాలు సమర్పించారు. ఇలా చేస్తే ఆ పేరు టీడీపీకి దక్కుతుందనే ఆలోచనతో వైసీపీ ప్రభుత్వం సచివాలయం వద్దనే బుధవారం నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు సచివాలయం వద్దనే సిబ్బంది పంపిణీ చేస్తారు. బుధవారం ఉదయం పింఛన్ సొమ్ము బ్యాంకులో జమ అవుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఈ మొత్తాన్ని ఆయా సచివాలయాల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకు నుంచి డ్రా చేసి బుధవారమే పంపిణీని ప్రారంభించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మధ్యాహ్నంలోగా నగదు డ్రా చేసి మధ్యాహ్నం తరువాతన పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా మంచంలో ఉన్న వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మాత్రమే సచివాలయం సిబ్బంది ఇంటి వద్దకు పోయి పింఛన్లను అందజేయాలని నిర్ణయించింది. సచివాలయంలో ఉన్న ఉద్యోగులు ఒక్కొక్కరు ఒక్కో క్యాబిన్‌ను ఏర్పాటు చేసుకుని సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేయాల్సి ఉంది. పింఛన్ పుస్తకాన్ని ఎట్టి పరిస్థితుల్లోను లబ్ధిదారులు తీసుకురావద్దని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఏఎన్ఎంలకు, ఎనర్జీ అసిస్టెంట్లకు మినహాయింపు

సచివాలయంలో పనిచేసే ఏఎన్ఎంలు, ఎనర్జీ అసిస్టెంట్లను పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి దూరం ఉంచారు. ఏఎన్ఎంలు ప్రతివారంలో బుధ, శనివారం ఈ రెండు రోజులు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంది. పింఛన్ల పంపిణీ బాధ్యతలను ఏఎన్ఎంలకు అప్పగిస్తే టీకాల కార్యక్రమానికి ఇబ్బంది కలుగుతుందని వారిని మినహాయించింది. అదేవిధంగా ఎమర్జెన్సీ సర్వీసులైన విద్యుత్‌శాఖకు సంబంధించిన సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్లను కూడా ఈ బాధ్యతలకు దూరంగా ఉంచింది.

రెండు హేబిటేషన్లు ఉంటే వేర్వేరుగా..

ఒక సచివాలయంలో పరిధిలో దూరందూరంగా రెండు హేబిటేషన్లు ఉంటే ఈ రెండు చోట్ల పింఛన్ల పంపిణీని ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. సచివాలయంలో ఉండే 10మంది సిబ్బంది ఈ రెండు చోట్లా ఒకే సమయంలో పింఛన్లను పంపిణీ చేసే ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. అయితే ఎక్కడ పింఛన్లను పంపిణీ చేసినా ప్రభుత్వ భవనంలోనే పంపిణీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. పింఛన్ల కోసం వచ్చే వారికి తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

స్ట్రాంగ్ రూంల ఏర్పాట్లకు పటిష్ట చర్యలు

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్‌రూముల ఏర్పాటుకు అవసరమైన ముందస్తు చర్యలను పటిష్ఠంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలను ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి స్ట్రాంగు రూములు, కౌంటింగ్ ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాకు సంబంధించిన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ఒకే ఆవరణలో ఉన్నందున ఆయా నియోజకవర్గాల వారీగా ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరు సముదాయాలలో చేస్తున్న ఏర్పాట్లను తనిఖీ చేశారు. పోలింగ్ పూర్తయిన తర్వాత వచ్చే ఈవీఎం ఇతర సామగ్రిని స్వీకరించేందుకు రిసెప్షన్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ అనంతరం వచ్చే ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్ రూములలో భద్రపరుస్తామన్నారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పటిష్ఠంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ స్ట్రాంగు రూముల వద్ద మూడంచల భద్రత విధానం, హైవే, పరిసరాల ప్రాంతాలలో సెక్యూరిటీని పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఆర్వోలు సుబ్బారెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి : ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు కాకుండా నూతన వ్యూహాత్మక పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన స్థానిక డ్వామా కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపాధి కల్పించటంతోపాటు స్థానిక అవసరాలు తీర్చేలా ద్విముఖ వ్యూహంతో చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందన్నారు. అమృత సరోవర్, పొలాల్లో ఇంకుడు గుంతలు, కాలువగట్లపై మొక్కలు నాటడం, హార్టికల్చర్ ప్లాంటేషన్ వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో డ్వామా పీడీ అర్జున్‌రావు, విజిలెన్స్ అధికారి ఝాన్సీ, ఏపీడీ వండర్‌మాన్, సీహెచ్.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) ఏప్రిల్ 2: కొత్తపట్నంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం రాత్రి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచారు. రాష్ట్రాన్ని అథోగతి పాల్జేసిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని కోరారు. ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు గేనం సుబ్బారావు, మండల అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, సింగిరి శ్రీను, పులి శ్రీను, బ్రహ్మారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

● డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి



ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 2 : జిల్లాలో ఎండల తీవ్రత ఉన్నందున ప్రజానీకం వడదెబ్బబారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి సూచించారు. మంగళవారం జిల్లాలోని వైద్యాధికారులతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గత కొద్దిరోజులుగా జిల్లాలో ఎండ తీవ్రత పెరిగినందున తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ బలహీనపడి వడదెబ్బకు గురవుతారన్నారు. చాలా మంది బయట తిరిగితేనే వడదెబ్బ తగులుందని భావిస్తారని, అయితే ఇంట్లో ఉన్నా దీనిబారిన పడే ప్రమాదం ఉందని చెప్పారు. శరీర సాధారణ ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల ఫారెన్ హీట్ ఉంటుందని, అంతకంటే ఎక్కువగా ఉంటే జ్వరం ఉన్నట్లుగా భావించాలన్నారు. అయితే 104 డిగ్రీల ఫారెన్ హీట్‌కు పెరిగితే వడదెబ్బకు గురైనట్లు గుర్తించాలని సూచించారు. 60 ఏళ్ళకు పైబడిన వృద్ధులు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సూచించారు.

వైసీపీ ఓటమే ఆర్యవైశ్యుల లక్ష్యం

ఎమ్మెల్యే బాలినేని బెదిరింపులకు భయపడేది లేదు.. ● ఆర్యవైశ్య సంఘ నాయకులు ● టీడీపీని గెలిపించుకుంటామని స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న నల్లమల్లి బాలు తదితరులు

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 2: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమే లక్ష్యంగా ఆర్యవైశ్యులు పనిచేస్తారని, ఒక్కరోజు వ్యాపారం పక్కనపెట్టి వస్తే వైశ్యుల సత్తా ఏమిటో తెలుస్తుందని ఆర్యవైశ్య సంఘం నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం ఒంగోలు నగరం ఏనుగు చెట్టువద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు నల్లమల్లి బాలు పలువురు టీడీపీ వైశ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. కొంతమంది వైసీపీ ఆర్యవైశ్యులు, కొణిజేటి రోశయ్య ఫ్యాన్స్ పేరుతో వైశ్యులను కించపరిచేవిధంగా కరపత్రాలు ముద్రించడం దుర్మార్గమన్నారు. గతంలో వైసీపీలో తాను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డికి విధేయుడుగా ఉన్నానని తెలిపారు. అయితే తండ్రీ, కొడుకు ఇద్దరూ తనను మోసం చేశారని చెప్పారు. అంతేగాకుండా బెదిరింపులకు పాల్పడితే ఇక్కడెవరూ భయపడరని ఆయన స్పష్టం చేశారు. పల్లపోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌గా వైశ్యులకు చేసింది ఏమీ లేదని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్యవైశ్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని, ఓట్లు వేసి గెలిపించినందుకు తమను ఘోరంగా మోసం చేశారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం వైశ్యులు పనిచేస్తారన్నారు. వైసీపీ ఓటమి లక్ష్యంగా పనిచేసి, దామచర్లను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్యవైశ్య నాయకులు మిరియాల కృష్ణ, తాతా చెంచయ్యగుప్తా, కనమర్లపూడి హరిప్రసాద్, పబ్బిశెట్టి భాస్కర్, వలివేటి పవన్ కుమార్, కొల్లిపల్లి సురేష్, కొంకిమళ్ళ శ్రీనివాసరావు, ఉమా, యశ్వంత్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే ఒంగోలు అభివృద్ధి !

పార్టీ అభ్యర్థి దామచర్ల ● వైసీపీ సైకో పాలకులకు గుణపాఠం చెప్పాలని పిలుపు ● 25వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం



టీడీపీలో చేరిన మడనూరుకు చెందిన వైసీపీ కార్యకర్తలు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 2: ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగిందని, గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో నగరంలో అభివృద్ధి శూన్యమని, త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీ సైకో పాలకులకు గుణపాఠం చెప్పాలని టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మంగళవారం నగరంలోని 25వ డివిజన్ రంగారాయుడు చెరువు సమీపంలోని పలు వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు టీడీపీ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన జనం కోసం జనార్దన్ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌తో కలిసి పర్యటించిన దామచర్ల ప్రజలను కలుసుకుని, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు నగరం మరో ఇరవైఏళ్ళు వెనుకబడిపోయిందన్నారు. కనీస మౌలిక వసతులు కరువయ్యాయని, తాగునీరు కూడా సకాలంలో ఇవ్వలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. రోడ్లు, డ్రైన్‌లు, నగరంలో వీధిలైట్లు తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఏర్పాటు చేశానని తెలిపారు. చెత్తపైన పన్ను వేసిన చెత్త ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు మెగా డీఎస్సీతోపాటు, ప్రతి నెలా ఇంటివద్దకే రూ.4వేల పెన్షన్ అందిస్తామని తెలిపారు. ప్రజలు ఆశీర్వదించి తనను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. అలాగే కొత్తవారు ఉంటే మరో ఆరు వేల ఇళ్ళు ఇవ్వడానికి తాను కృషి చేస్తానని చెప్పారు. నిరుపేదలకు 2 సెంట్లు భూమిని నివాస స్థలం కోసం అందిస్తామన్నారు. ప్రజలు గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిని ఒకసారి పరిశీలించాలని కోరారు. అభివృద్ధే ధ్యేయంగా, ప్రజాసేవ కోసం, రాష్ట్ర సంక్షేమం కోసం టీడీపీని ఆదరించాలని దామచర్ల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన క్లస్టర్ ఇన్‌చార్జి పాలూరి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీను, పులివర్తి అజయ్, నల్లమల్లి బాలు, టీఎస్.బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా స్థానిక మహిళలు దామచర్లకు హారతులతో ఘన స్వాగతం పలికారు.

టీడీపీలోకి వలసల జోరు

రాష్ట్ర భవిష్యత్ టీడీపీతోనే సాధ్యమని ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. నగరంలోని అంబులెన్స్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు మోహన్‌తోపాటు, సంఘ సభ్యులు షేక్ ఖాజావలి, మంత్రి మనోహర్, కిలారి విజయ్, ఆడే శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు టీడీపీలో చేరారు. కొత్తపట్నం మండలం మడనూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పొన్నపూడి అగ్గయ్య, కోడూరి రామలింగం, కాటం కుమార్, ప్రళయకావేరి బాబు, తులసీంగారి లక్ష్మణ్‌లతోపాటు మరో వందమందికి పైగా వైసీపీ సానుభూతిపరులు స్థానిక టీడీపీ కార్యాలయంలో దామచర్ల జనార్దన్, షేక్ రియాజ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను గెలపించడానికి వస్తున్న అభిమానులు, వైసీపీని వీడి తనకు మద్దతుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

స్వర్ణయుగం తెలుగుదేశంతోనే సాధ్యం

ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ ● సంతనూతలపాడు, రాపర్ల, పల్లామల్లిలో భారీగా టీడీపీలో చేరికలు



రాపర్లలో బీఎన్ సమక్షంలో చేరిన వైసీపీ శ్రేణులు



పల్లామల్లిలో పార్టీలో చేరిన వారితో విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఏప్రిల్ 2: రాష్ట్ర ప్రజలకు స్వర్ణయుగ పాలన అందాలంటే అది టీడీపీతోనే సాధ్యమని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో పేర్నమిట్ట పరిధిలోని 41వ డివిజన్ సరళాదేవినగర్‌కు చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి మంగళవారం విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కె.వెంకటనారాయణ, శ్రీను, ప్రసాద్, గోవిందు, కార్తీక్, రాము, చిరంజీవి. ఆనంద్, యోగయ్య, రమణయ్య, కోటేశ్వరరావు అనే వారందరికీ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం బీఎన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి ప్రత్యక్షంగా నేటికీ కనిపిస్తోందని, తనను మరలా ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాపర్లలో..

నాగులుప్పలపాడు : టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఎస్ఎన్‌పాడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ చెప్పారు. మంగళవారం రాత్రి రాపర్లలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా ఆదరించాలని కోరారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. తొలుత మాచవరం కాలభైరవస్వామి ఆలయంలో బీఎన్ పూజలు చేశారు. కాగా గ్రామంలోని వైసీపీకి చెందిన ఢాకా శ్రీనివాసరెడ్డి, గంగి రమణారెడ్డి, నలమలపు సుధాకర్‌రెడ్డి, కొట్టు రాఘవరెడ్డి,షేక్ ఖాలేషా, పెద్ద నాగూర్, పూల కొండయ్య, ఢాకా సుబ్బరామిరెడ్డి, ఢాకా రామచంద్రారెడ్డి, కొండూరు శ్రీనివాసరెడి, ఢాకా సురేంద్రరెడ్డి తో పాటు మరో 30 కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి బీఎన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, మెట్టు సుబ్బయ్యనాయుడు, బెల్లం సురేంద్ర, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన బీఎన్..

కొత్తకోట గ్రామానికి చెందిన నలమాతు నాగరత్నమ్మ అనారోగ్యంతో మరణించడగా టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తన సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు పాల్గొన్నారు.

పల్లామల్లిలో 25కుటుంబాలు

చీమకుర్తి : పల్లామల్లి గ్రామంలో మంగళవారం వైసీపీ వీడి తెలుగుదేశం పార్టీలోకి 25కుటుంబాలు చేరాయి. స్థానిక బీసీకాలనీలో జరిగిన సభలో వీరందరికి టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, వేల్పుల శ్రీనివాసరావు, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, కరిచేటి వెంకటేశ్వర్లు, అన్నమనేని రాఘవయ్య, పారా కృష్ణ, గుమ్మడి గోవిందయ్య, పుట్టా బ్రహ్మయ్య, తేళ్ల వెంకటేశ్వర్లు, బొమ్మల అంకయ్య, మెడబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెన్షన్లు ఇవ్వలేక టీడీపీపై నిందలా..?

● ఇంటి వద్దనే ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల డిమాండ్



ఒంగోలులో మీడియాతో మాట్లాడుతున్న దామచర్ల, రియాజ్

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 2: రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి, నిధులు లేవని చెప్పలేని వైసీపీ ప్రభుత్వం ఒకటో తారీఖున పెన్షన్లు ఇవ్వలేక తెలుగుదేశం పార్టీపై నిందలు వేస్తుందని టీడీపీ కూటమి విమర్శించింది. ఈ మేరకు మంగళవారం ఒంగోలులో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అభ్యర్థి దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున లబ్ధిదారులకు అందించే పెన్షన్‌లో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు ఇళ్ళవద్దనే పెన్షన్ అందించాలని కోరారు. కొంతమంది వలంటీర్లు వైసీపీ కార్యకర్తలా వ్యవహరిస్తూ లబ్ధిదారులను బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా కూటమి నేతల విన్నపాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

అనంతరం జరిగిన మీడియా సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి పెన్షన్లు ఇవ్వలేక, ఆ నిందను తెలుగుదేశం పార్టీపై మోపి రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తుందని విమర్శించారు. వలంటీరు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రజల డేటా తమ స్వాధీనంలో ఉంచుకుని బెదిరింపులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పెన్షన్లు ఇంటి వద్దకే అందించాలన్నదే తమ అభిప్రాయమని చెప్పారు. అలాగే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి నెలా రూ.4వేలు ఒకటో తేదీనే ఇంటికి వచ్చి ఇస్తామని తెలిపారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ కొందరు వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లాగా వ్యవహరించడంతోపాటు, ఎన్నికల్లో గెలుపు కోసం చేస్తున్న బెదిరింపులపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. టీడీపీ కూటమి ప్రజల కోసం పనిచేస్తుందని, వైసీపీ ఎత్తుగడలు, దుష్ప్రచారాన్ని నమొద్దని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, బీజేపీ నాయకులు కృష్ణారెడ్డి, యోగయ్య యాదవ్, కార్పొరేటర్ మలగా రమేష్, టీడీపీ నాయకులు కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది పింఛనుదారులకు ఇంటి వద్దనే పింఛన్లు నగదు అందించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్ కోరారు. ఈమేరకు నాగులుప్పలపాడులో ఎంపీడీవో మహాలక్ష్మిని మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉన్నం వెంకట్రావు, మారెళ్ల వెంకట్రావు, కందుకూరి రమణ, తోకల చైతన్య, పోలినేని హనుమంతురావు, కట్టా చిరంజీవి పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: పింఛన్లు ఇంటి వద్దకే సచివాలయ ఉద్యోగుల ద్వారా అందివ్వాలని టీడీపీ నాయకులు చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు, రూరల్ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, అవనిగడ్డ శేషయ్యగొల్లపూడి శ్రీనివాసరావు, నర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో..

కొత్తపట్నం(ఒంగోలునగరం): పింఛన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దకే తీసుకుపోయి అందజేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం కొత్తపట్నం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, నాయకులు బలగాని వెంకటేశ్వర్లు, పురిణి యానాదిరెడ్డి, సింగిరి శ్రీను, కాలేషావలి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నేడు విద్యార్థులకు ప్రేరణ పోటీలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 2: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల్లో 9,11 తరగతులు చదువుతున్న విద్యార్థులకు బుధవారం ప్రేరణ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు పోటీలు నిర్వహించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డి.సుభద్ర మంగళవారం ఆదేశించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, పాటల పోటీలు నిర్వహించి ఫలితాలను గూగుల్ ఫాంలో నింపాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విజేతలను ఎంపిక చేసి సంబంధిత ఎంఈవోలకు వివరాలను అందజేయాలన్నారు. ప్రేరణ జిల్లా స్థాయి పోటీలు ఈనెల 6న ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో హెచ్ఎంలు ప్రేరణ ఉత్సవాలను నిర్వహించి ప్రేరణ పోర్టల్‌లో విద్యార్థులను రిజిస్టర్ చేయాలని కోరారు.

వేసవి సెలవులు ఇవ్వని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 2: వేసవి సెలవులు ఇవ్వని ప్రైవేటు జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత నెల 29నుంచి ఇంటర్ కాలేజీలకు ప్రభుత్వం సెలవులు ఇచ్చినా ఒంగోలులోని ప్రైవేటు కాలేజీలు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు రెండో సంవత్సరం తరగతులు ప్రారంభించడం దారుణంగా ఉందన్నారు. తక్షణమే సెలవులు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

సాయిబాబా విద్యార్థుల విజ్ఞానయాత్ర



షార్‌ను సందర్శించిన విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 2: ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలుకు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం విజ్ఞానయాత్రలో భాగంగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)ను సందర్శించారు. రాకెట్ ప్రయోగ వేదిక నిర్వహణ నిపుణులు శ్రీనివాసులు, గైడ్ రామాంజనేయులులు విద్యార్థులకు రాకెట్ ప్రయోగానికి సంబంధించిన వివరాలను వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల అవగాహన పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శన దోహదపడుతుందని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సాయినాధుని శృతి, కరస్పాండెంట్ జీవీ.భాస్కర్, ప్రిన్సిపాల్ ఎం.మహేష్ తెలిపారు.

ఎయిడెడ్ టీచర్ల బకాయిలు విడుదల చేయాలి

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 2 : ఎయిడెడ్ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎయిడెడ్ టీచర్లకు పీఎఫ్ ఖాతాలు లేనందున 2022 నుంచి రావాల్సిన డీఏ, సంపాదిత సెలవుల నగదు బకాయిలు, సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని వారు కోరారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 2 : ఒంగోలు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం ఒంగోలు రానున్నారు. ఆ రోజు ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉదయం 11 గంటలకు టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఒంగోలు నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు మాగుంట హాజరయ్యారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితా

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 2: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పోటీ చేసే అభ్యర్థుల జాబితాను మంగళవారం ప్రకటించారు. జిల్లాలో యర్రగొండపాలెం, సంతనూతలపాడు అసెంబీ అభ్యర్థులను, అదేవిధంగా ఒంగోలు ఎంపీ అభ్యర్థిని ప్రకటించ లేదు. కాగా బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా జేడీ.శీలం, దర్శి నియోజకవర్గ అభ్యర్థిగా పి.కొండారెడ్డి, ఒంగోలుకు బుట్టి రమేష్‌బాబు అలియాస్ బీఆర్‌గౌస్, కొండపికి శ్రీపతి సతీష్, మార్కాపురంనకు ఎస్కే.సైదా, గిద్దలూరుకు పి.రంగస్వామి, కనిగిరికి కదిరి భవానీని ప్రకటిస్తూ మంగళవారం అధిష్ఠానం జాబితా విడుదల చేసింది.

రేషన్ పంపిణీ పరిశీలన



రేషన్ పంపిణీ పరిశీలిస్తున్న తహసీల్దార్

నాగులుప్పలపాడు ఏప్రిల్ 2: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉప్పుగుండూరు గ్రామంలో రేషన్ పంపిణీని తహసీల్దార్ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. వలంటీర్లు రేషన్ పంపిణీలో జోక్యం చేసుకోకూడదని ఆయన సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించరాదని చెప్పారు. అలాగే ఎండీయూ ఆపరేటర్లు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో చంద్ర తదితరులు పాల్గొన్నారు.


వేసవిలో పశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి : జేడీ



అవగాహన కల్పిస్తున్న జేడీ బేబీరాణి

మద్దిపాడు, ఏప్రిల్ 2: వేసవికాలంలో పెంపకందారులు జాతీయ రహదారిపై గొర్రెలు, మేకలు, పశువులు దాటేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి పేర్కొన్నారు. మంగళవారం బూరేపల్లికాలనీలో పశువుల పెంపకందారులకు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాపరులు కర్రకు రేడియం స్టిక్కర్లు పెట్టుకుని వెలుతురు ఉండగానే రోడ్డు దాటించాలన్నారు. పశువులను చల్లని ప్రదేశాలలో ఉంచాలని చెప్పారు. వేసవికాలంలో అనేక వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ రమేష్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుగుణ్యరావు, డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫీజు వాపసు



చెక్కును అందజేస్తున్న రమణి, యాజమాన్యం

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 2: పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్తి ఫీజును వాపసు చేస్తున్నట్లు స్థానిక కర్నూల్ రోడ్డు శ్రీనగర్‌కాలనీ జూపిటర్ హైస్కూల్ కరస్పాండెంట్ ఆలూరు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆలూరు వంశీకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రమణి చేతుల మీదుగా పి.మనోజ్ సాయి, బి.తేజస్వినికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రమణి మాట్లాడుతూ ఈ విధంగా ఫీజు వాపసు చేయటం ద్వారా ఇతర విద్యార్థులలో సైతం ఉత్తమ మార్కులు సాధించాలన్న పట్టుదల పెరుగుతుందన్నారు.

రేషన్ షాపుపై విజిలెన్స్ దాడులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 2 : ఒమ్మెవరంలోని 43 నంబరు రేషన్ షాపుపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అందిన వివరాల మేరకు విజిలెన్స్ డీటీ కృష్ణమోహన్ బియ్యం నిల్వలలో వ్యత్యాసం ఉన్నట్లుగా గుర్తించారు. ఈ మేరకు రేషన్‌షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

పింఛన్లు సకాలంలో ఇవ్వాలి

సంతనూతలపాడు, ఏప్రిల్ 2: పింఛన్లదారులకు ఇంటివద్దనే పెన్షన్ నగదు అందజేయాలని మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకులు తన్నీరు శ్రీను కోరారు. మంగళవారం సంతనూతలపాడులో వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా సరే కొంతమంది వలంటీర్లు వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. ఈక్రమంలోనే ఎన్నికల కమిషన్ వలంటీర్లను తప్పించిందని తెలిపారు. అయితే పింఛనుదారులకు ఇవ్వాల్సిన పెన్షన్ డబ్బులను వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లు, బినామీలకు దోచిపెట్టి ఖజానాను ఖాళీ చేసిందని ఆరోపించారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎన్.మాధవి, కె.ఆంజనేయులు, కె.పద్మ, జనార్ధన్, సుబ్బారావు, శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, బోసు, పి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో మెమోల కలకలం

మూల్యాంకన విధులకు హాజరైన వారికీ అందాయి

సబ్జెక్టు టీచర్లు కాని వారికి మూల్యాంకన ఉత్తర్వులు

అధికారుల తీరుపై భగ్గుమంటున్న టీచర్లు



ఒంగోలు(విద్య), ఏప్రిల్ 2 : స్థానిక డీఆర్‌ఆర్‌ఎం హైస్కూలులో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనానికి హాజరుకాని 284 మంది టీచర్లకు మెమోలు జారీచేయడం జిల్లా విద్యాశాఖలో కలకలం రేపింది. మూల్యాంకన విధులకు మొత్తం 1,200 మంది ఉపాధ్యాయులను నియమించగా వీరిలో కొందరు మూల్యాంకన విధులకు డుమ్మాకొట్టారు. తెలుగు, హిందీ, బయాలజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు సంబంధించి 72మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 12మంది స్పెషల్ అసిస్టెంట్లు మొత్తం 84మంది మాత్రమే నికరంగా అవసరం ఉంది. ఇతర సబ్జెక్టుల్లో అందరూ సరిపోయారు. అయితే మొత్తం అన్ని సబ్జెక్టులకు సంబంధించి మూల్యాంకనానికి హాజరుకాని టీచర్లకు మెమోలు జారీచేయడం ఉపాధ్యాయుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఒక వేళ ఆ నాలుగు సబ్జెక్టులు మినహా ఇతరులు స్పాట్‌కు వచ్చినా వారు అదనమై వెనుతిరగాల్సి వచ్చేది. అవసరమున్న సబ్జెక్టులకు మాత్రమే మెమోలు ఇచ్చి స్పాట్‌కు రప్పించి ఉంటే సరిపోయేది. కానీ అందరికి మెమోలు జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పేపర్లు దిద్దేందుకు తమకు అర్హత లేకపోయినా స్పాట్‌కు రమ్మని ఉత్తర్వులు ఇవ్వడమే కాకుండా, రానందుకు తాఖీదులు ఇవ్వడం ఏమిటని టీచర్లు మండిపడుతున్నారు. సీఈలు, ఏఈలను సంబంధింత ఉప విద్యాధికారులు నియమిస్తుండగా, స్పెషల్ అసిస్టెంట్లను మాత్రం ఎంఈఓలు ఇచ్చిన జాబితాల ప్రకారం ఇచ్చారు. మూల్యాంకన విధులకు హాజరై పేపర్లు దిద్దుతున్న తమకు మెమోలు జారీ చేయడమేమిటని కొందరు టీచర్లు ప్రశ్నిస్తున్నారు మొత్తంగా మెమోలు జారీచేయడంలో అధికారులు వ్యవహరించిన తీరు టీచర్లపై కక్షసాధింపు చర్యగా ఉందని టీచర్లు ఆక్షేపిస్తున్నారు.

- ఒంగోలు, ఎస్‌ఎన్‌పాడు మండలాల్లోని జడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు కొందరు స్పాట్‌కు హాజరైనా గైర్హాజరైనట్లు భావించి వారికి మెమోలు జారీచేశారు

- చీమకుర్తి మండలంలోని ఒక జడ్పీ హైస్కూలు కొత్తగా అప్‌గ్రేడ్ అయింది. అక్కడ ప్రస్తుతం 9వ తరగతి వరకు మాత్రమే ఉంది. అయితే ఆ పాఠశాల టీచర్‌కు కూడా పదవతరగతి పేపర్లు దిద్దేందుకు నియమించారు. వారిలో కొందరు స్పాట్‌కు హాజరైన పేపర్లు దిద్దుతుండగా హాజరు కాని వారికి మెమోలు ఇచ్చారు.

-కొత్తపట్నం మండలంలో ఒక ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఇద్దరు మహిళా టీచర్లకు స్పెషల్ అసిస్టెంట్లుగా డ్యూటీ వేశారు. ఒకరు స్పాట్ హాజరుకాగా ఒకరు పాఠశాల మూతపడకుండా విధులు నిర్వహించారు. అయితే ఆ పాఠశాలలో ఉన్న టీచర్‌కు కూడా మెమో ఇవ్వడం గమనార్హం.

-అధికారుల అనుమతితో అమెరికా వెళ్లిన ఒక టీచర్‌కు కూడా స్పాట్‌కు నియమించారు. హాజరు కానుందుకు ఆయనకు మెమో ఇచ్చారు.

- కొత్తగా అప్‌గ్రేడ్ అయిన ఒక హైస్కూలులో ఈ సంవత్సరమే టెన్త్ వచ్చింది. ఆ పాఠశాలలో పదవ తరగతి బోధిస్తున్న టీచర్‌కు స్పాట్ వేశారు. ఆ టీచరు హాజరు కానుందుకు ఆయనకు మెమో ఇచ్చారు.

- అధికారుల అనుమతితో మూల్యాంకన విధులకు హాజరుకాని వారికి కూడా మెమోలు జారీ చేయడం విడ్డూరంగా ఉంది. అధికారుల అనాలోచితంగా జారీచేసిన మోమోలు టీచర్లకు తీవ్ర మనోవేదనను మిగిల్చాయి.

చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు

ఎస్పీ పరమేశ్వరరెడ్డి



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

సింగరాయకొండ, ఏప్రిల్ 2 : జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పరమేశ్వరరెడ్డి చెప్పారు. స్థానిక జాతీయ రహదారిపై పెరల్స్ డిస్టలరీ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్పీ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా చెక్ చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికి జిల్లాలో రూ.2.35 కోట్ల (నగదు, మద్యం, సామగ్రి) సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎస్పీలు నాగేశ్వరరావు, అశోక్‌బాబు, డీఎస్పీ కిషోర్‌బాబు, సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి.శ్రీరామ్ పాల్గొన్నారు.

కొప్పెరపాడులో బైకు చోరీ

బల్లికురవ, ఏప్రిల్ 2 : ఇంటి ముంగిట ఉంచిన బైకును కొప్పెరపాడులో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అందిన సమాచారం మేరకు.. మండలంలోని కొత్తూరు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ చెన్నూరి మాధవరావు కొప్పెరపాడులో ఉంటున్నారు. సోమవారం సచివాలయానికి వెళ్లి వచ్చిన అయన ఇంటి ముంగిట గ్లామర్ బైకును ఉంచి ఇంట్లో నిద్రించారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి బైకు లేకపోవటంతో బల్లికురవ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పట్టుబడ్డ డబ్బుపై కొనసాగుతున్న విచారణ

చీరాల, ఏప్రిల్ 2 : మండలంలోని కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలోని రాయల్ మైరైన్ ఆక్వా కంపెనీలో ఇటీవల ఎఫ్‌ఎస్‌టీ అధికారులు, పోలీసులు నిర్వహించిన తనిఖీలలో రూ.56 లక్షలు దొరికిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆ డబ్బును సేఫ్ కస్టడీలో ఉంచారు. సదరు డబ్బుకు సంబంధించి కంపెనీ ప్రతినిధులు తమ వద్ద ఉన్న ఆధారాలను చూపారు. ఈ క్రమంలో మంగళవారం ఐటీ నోడల్ ఆఫీసర్ రాజసులోచనకు తమ వద్ద ఉన్న ఆధారాలను చూపి రిలీజింగ్ ఆర్డర్ ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులు కోరారు. అందుకు సంబంధించి బుధవారం ఐటీ అసిస్టెంట్ కమిషనర్‌ను కలవాలని ఆమె సూచించారు. ఏసీ విచారణ, పరిశీలన అనంతరం సదరు నగదుకు సంబంధించి రిలీజింగ్ ఆర్డర్ ఇస్తారని తెలిసింది.

మండల విద్యాశాఖ కార్యాలయానికి కరెంట్ కట్

చీరాలటౌన్, ఏప్రిల్ 2 : చీరాల మండల విద్యాశాఖ కార్యాలయానికి మంగళవారం మునిసిపల్ అధికారులు కరెంట్ కట్ చేయించారు. దీంతో రోజంతా కంప్యూటర్‌లు ఆన్ కాకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. సదరు కార్యాలయం మునిసిపల్ పరిధిలోని 20వ వార్డు సచివాలయంలో ఓ పోర్షన్‌లో ఉంది. ఇక్కడి నుంచి మండలవ్యాప్తంగా 142 పాఠశాలల మధ్యాహ్న భోజనం, విద్యకు సంబంధించి వివిధ సేవలు జరుగుతుంటాయి. ఎటువంటి సమాచారం లేకుండా ఇద్దరు వ్యక్తులు వచ్చి కరెంట్ కటచేసి వెళుతుండగా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం వారిని నిలదీశారు. దీనిపై తమకు ఎటువంటి సంబంధంలేదని, మునిసిపల్ కార్యాలయానికి సంబంధించిన ఓ అధికారి కట్ చేయమన్నారని తెలిపారు. అనంతరం మునిసిపల్ కమిషనర్‌కు ఎంఈవో రాతపూర్వకంగా అర్జీ అందించడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయానికి కరెంట్‌ను పునరుద్ధరించాలని కమిషనర్ ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

అద్దంకి, ఏప్రిల్ 2: బైకుపై వెళుతున్న వృద్ధుడిని వెనుక నుంచి బొలెరో ట్రక్కు ఢీకొనటంతో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఉప్పలపాడుకు చెందిన గుదే వెంకటేశ్వర్లు(58) బైక్‌పై మంగళవారం ఉదయం అద్దంకి వస్తున్నాడు. ఈక్రమంలో కరెంట్ ఆఫీసు సమీపంలో వినుకొండ నుంచి నెల్లూరు వెళుతున్న ట్రక్కు వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వర్లు మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు.

విద్యార్థినిని వేధిస్తున్న యువకులపై కేసు

అద్దంకి పట్టణంలో ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిని ఇద్దరు అన్నదమ్ములు తరచూ వేధిస్తున్నారు. గతంలో పలుసార్లు పెద్ద మనుషులు హెచ్చరించినప్పటికి వేధింపులు ఆపలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

రంగంలోకి ఇండియా కూటమి

8 అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

నేడో, రేపో సీపీఐ, సీపీఎం అభ్యర్థుల ప్రకటన



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆయా పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీకి ఇండియా కూటమి సిద్ధమైంది. ఇప్పటికే ఎన్డీయే కూటమిలో అతి పెద్ద పార్టీ అయిన టీడీపీ తరఫున అభ్యర్థులను ఎంపిక చేసి ప్రకటించారు. ఇంకోవైపు అధికార వైసీపీ కూడా అభ్యర్థులను ప్రకటించింది. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిగా ఏర్పడిన భాగస్వామ్య పార్టీలు కూడా జిల్లాలో పోటీలోకి దిగడం ప్రారంభించాయి. ఇండియా కూటమిలో ప్రధాన భూమిక పోషిస్తున్న కాంగ్రెస్, వామపక్ష పార్టీలైన సీపీఎం, సీపీఐలు జిల్లాలో ఆయా స్థానాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ మంగళవారం విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి 8 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కష్టనష్టాల్లోనూ ఆ పార్టీతోనే నడుస్తున్న కేంద్ర మాజీ మంత్రి, జేడీ శీలాన్ని తిరిగి బాపట్ల లోక్‌సభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. సరికొత్త ప్రకాశం జిల్లాలో మార్కాపురం నుంచి షేక్ సైదా, గిద్దలూరు నుంచి పగడాల పెద్దరంగస్వామి, కొండపి నుంచి శ్రీపతి సతీష్, ఒంగోలు నుంచి గుత్తి రమేష్‌బాబు, దర్శి నుంచి కొండారెడ్డి, కనిగిరి నుంచి కదిరి భవానీలను ఆ పార్టీ రంగంలోకి దింపింది. వీరిలో మార్కాపురం మరోసారి రంగంలోకి దిగుతున్న షేక్ సైదా ఆ పార్టీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా, టీవీ డిబేట్‌లలో పాల్గొంటున్నారు. అంతేగాక వెలిగొండ ప్రాజెక్టుసాధన ఉద్యమంలోనూ, మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసిన ఉద్యమంలోనూ కీలక పాత్రపోషించారు. మిగిలిన వారిలో కొండపి, గిద్దలూరు, దర్శి అభ్యర్థులు గత ఎన్నికల్లోనూ పోటీ చేసిన వారే. సరికొత్త ప్రకాశం జిల్లాలో ఎర్రగొండపాలెం, సంతనూతలపాడు అసెంబ్లీ అభ్యర్థులతోపాటు ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. అద్దంకి, కందుకూరు అభ్యర్థులను కూడా కాంగ్రెస్ ప్రకటించింది. సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఇండియా కూటమిలో భాగస్వామ్యులైన సీపీఐ, సీపీఎంలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులను ప్రకటించలేదని భావిస్తున్నారు. ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా కూడా కమ్యూనిస్టులను రంగంలోకి దింపే ఆలోచనలో లేకపోలేదని అంటున్నారు.

దొంగ ట్రాక్టర్ల విక్రయం.. కొన్న రైతుల్లో భయం

దర్శి ప్రాంతంలో 20కిపైగా అమ్మకం

నమ్మించి మోసం చేస్తున్న మాయగాళ్లు



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్లు

దర్శి, ఏప్రిల్ 2 : రాయలసీమకు చెందిన కొంతమంది మాయగాళ్లు.. రైతులను నమ్మించి మోసం చేస్తునారు. అక్కడ రైతులను మాయ చేసి తెచ్చిన ట్రాక్టర్లను ఇక్కడి రైతులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తక్కువ ధరకు ట్రాక్టర్లు రావడంతో ఎలా వచ్చాయనేది ఆలోచించకుండా కొంతమంది అమాయకంగా దొంగ ట్రాక్టర్లను కొనుగోలు చేసి మోసపోయారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పోలీసులు దర్శి, పొదిలి, దొనకొండ ప్రాంతాలో ముమ్మరంగా గాలించి దొంగతనంగా విక్రయించిన 14 ట్రాక్టర్లను ఇప్పటికే పట్టుకున్నారు. కడప, అనంతపురం జిల్లాలకు చెందిన కొందరు అక్రమార్కులు ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన రైతుల ట్రాక్టర్లను ఫ్యాక్టరీల్లో పనుల కోసం అద్దెకు ఇవ్వాలని నమ్మించి తీసుకుంటున్నారు. వీళ్ల డ్రైవర్లే ట్రాక్టర్లు తోలుకునే విధంగా నెలకు రూ.25వేలు బాడుగ ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అధిక మొత్తంలో బాడుగ లభిస్తుండడంతో యజమానులైన కొంతమంది రైతులు అక్రమార్కులను నమ్మి ట్రాక్టర్లు అప్పగించారు. ఒకటి రెండు నెలలు నమ్మకంగా బాడుగ ఇస్తూ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డారు. వారిని చూసి మరికొంత మంది రైతులు ట్రాక్టర్లు బాడుగకు ఇచ్చారు. ఇదే అదునుగా అక్రమార్కులు కొంతమంది బ్రోకర్ల ద్వారా దర్శి - పొదిలి ప్రాంతాల్లోని రైతులకు ఒక్కో ట్రాక్టర్‌ను రూ.2లక్షల చెప్పున విక్రయించారు. తక్కువ ధరలకు ట్రాక్టర్లు దొరికాయని ఇక్కడ రైతులు సంబరపడుతున్న సమయంలో సత్యసాయి జిల్లాకు చెందిన పోలీసులు వచ్చి తనిఖీలు నిర్వహించారు. అక్కడ రైతులు తమ ట్రాక్టర్లు బాడుగ పేరుతో చెప్పి ఇతర ప్రాంతాల్లో వినియోగించారనే ఫిర్యాదుతో ట్రాక్టర్ల గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అక్కడ విక్రయించిన అక్రమార్కులను వెంటబెట్టుకొని వచ్చి ఇక్కడ ఏఏ ప్రాంతాల్లో ట్రాక్టర్‌లను విక్రయించారో సమాచారం తెలుసుకున్నారు. ఇప్పటి వరకు దర్శి మండలంలో నాలుగు, తాళ్లూరు మండలంలో రెండు, పొదిలి మండలంలో నాలుగు, దొనకొండ మండలంలో రెండు ట్రాక్టర్లు దొరికాయి. ఇంకా వినుకొండ ప్రాంతాల్లో పలు ట్రాక్టర్లను అమ్మినట్లు తెలిసింది. ఈ ముఠా మొత్తం ఎన్ని ట్రాక్టర్లను విక్రయించారో అన్న విషయం తెలుసుకునేందకు అన్ని గ్రామాల్లో పోలీసులు తిరుగుతున్నారు. ట్రాక్టర్ల అక్రమ విక్రయ వ్యవహారం బయటపడటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం ఎవరైనా ట్రాక్టర్లు కొనుగోలు చేయాలంటే ఆ ప్రాంతానికి వెళ్లాలంటే భయపడుతున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మేదరమెట్లలో బైక్ మాయం

మేదరమెట్ల, ఏప్రిల్ 2 : మేదరమెట్లలోని తమ్మవరం రోడ్డులో ఓ దుకాణం ఎదుట నిలిపి ఉంచిన బైక్ మాయమైంది. మంగళవారం గ్రామానికి చెందిన దొడ్డా పూర్ణయ్య తమ్మవరంలో రోడ్డులో ఓ దుకాణం వద్దకు వెళ్లారు. షాపు ఎదుట బైక్ నిలిపి లోపలికి వెళ్లి వచ్చేసరికి బైక్ మాయమైంది. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ పరిశీలించడంతోపాటు ఇతర టెక్నికల్ అంశాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.3.20 లక్షల నగదు పట్టివేత



పట్టుపడిన నగదును లెక్కిస్తున్న పోలీసులు

చినగంజాం, ఏప్రిల్ 2: చినగంజాం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్యగల టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మంగళవారం రూ.3.20లక్షల నగదు పట్టుబడింది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలు నేపథ్యంలో మంగళవారం వేకువజాయున 3గంటల సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చీరాలకు వైపు వెళుతున్న కారును తనిఖీ చేయగా డ్యాష్ బోర్డులో ఉన్న బ్యాగులో రూ.3,20,540 నగదు ఉన్నట్లు గుర్తించారు. కారులో డ్రైవర్ షేక్ బషు, వేటపాలెం మండలంకు చెందిన దామచర్ల రాజేష్‌లు ఉన్నట్లు తెలిపారు. సోమవారం నెల్లూరు, తిరుపతి పట్టణాలలో జీడిపప్పు అమ్ముకుని వస్తున్నామని, ఆ డబ్బు తాము పనిచేస్తున్న కంపెనీ యజమానికి అప్పగించేందుకు తీసుకెళుతున్నట్లు వారు తెలిపారు. నగదుకి సంబంధించి సరియైన పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి, వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీజ్ చేసిన నగదుని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ద్వారా జిల్లా గ్రీవెన్స్‌కి అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్‌లను వెంటనే పంపిణీ చేయాలి



సింగరాయకొండలో ఎంపీడీవోకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు



ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నేతల వినతి

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్ 2 : వృద్ధులు వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు నెలనెలా ఇస్తున్న పింఛన్లు వెంటనే పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈమేరకు జరుగుమల్లి మండల కార్యాలయ సూపరింటెండెంట్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సీఎం జగన్ పింఛన్ డబ్బులను వ్యక్తిగత లబ్ధి చేకూర్చే కాంట్రాక్టర్లకు ఇచ్చి అవ్వాతాతలకు అన్యాయం చేస్తున్నాడని పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు విమర్శించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా వెంటనే పింఛన్ సొమ్ము అందించాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నల్లమోతు వెంకటేశ్వర్లు, తెలుగు రైతు మండల నాయకుడు దగ్గుమాటి సుబ్బారెడ్డి, గుండపనేని వెంకటేశ్వర్లు, నవులూరి పూర్ణశేఖర్ పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ : పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు ఇంటి వద్దనే అందజేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు మంగళవారం ఎంపీడీవో నగేష్‌కుమారికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వలంటీర్ల ద్వారా పింఛన్‌లు పంపిణీ చేయవద్దని ఈసీ ఆదేశించిందని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ దృష్ట్యా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల చేత లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, రవిశంకర్‌రెడ్డి, పునూరి నరేష్, కుంచాల ఏడుకొండలు యనాది పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు : అవ్వాతాతలకు ఇంటి వద్దనే పింఛన్‌లు ఇవ్వాలని టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఎంపీడీవో సుబ్రహ్మణ్యంను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, అబ్బూరి అభిషేక్, భానుచందర్, పిగురాళ్ల సురేష్‌బాబు, కసుకుర్తి భాస్కర్, జక్కుల శ్రీనివాసరావు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రూ.లక్ష ఇస్తారా.. కేసు పెట్టమంటారా!

టీడీపీ సర్పంచ్ తనయులకు ఎస్సై హెచ్చరిక

రూ.70వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

టంగుటూరు, ఏప్రిల్ 2 : అనుమతులు లేకుండా బ్యారన్ నిర్మిస్తున్న వైసీపీకి చెందిన ఓ రైతుపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన టీడీపీకి చెందిన గ్రామ సర్పంచ్ తనయుడిపై ఎస్సై నాగేశ్వరరావు జులుం ప్రదర్శించారు. ఆయన్ను నానా దుర్భాషలాడారు. ఫిర్యాదు కూడా తీసుకోకుండా పంపించారు. అదేసమయంలో నిబంధనలకు విరుద్ధంగా బ్యారన్ నిర్మిస్తున్న రైతు నుంచి సర్పంచ్ కుమారులు బెదిరిస్తున్నారని ఫిర్యాదు తీసుకున్నారు. అనంతరం ఆమె కుమారుడిని స్టేషన్‌కు పిలిపించారు. రూ.లక్ష ఇస్తే కేసు లేకుండా చేస్తానని బేరానికి దిగారు. చివరికి రూ.70వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకీ చిక్కారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కాకుటూరివారిపాలెంలో వైసీపీకి చెందిన ఓ రైతు అనుమతి లేకుండా పొగాకు బ్యారన్లు నిర్మిస్తుండటంపై కొద్దిరోజుల క్రితం అప్పటి పంచాయతీ కార్యదర్శి సాంబయ్య ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. అయితే సర్పంచ్ ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటానని ఎస్‌ఐ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. టీడీపీకి చెందిన సర్పంచ్ వృద్ధురాలు కావడంతో ఆమె తరఫున కుమారుడు వెంకట్రావు స్టేషన్‌కు వెళ్లగా ఆయనపై ఎస్‌ఐ సీరియస్ అయ్యారు. 'నువ్వెవడ్రా.. నువ్వెందుకొచ్చావు' అని దుర్భాషలాడాడు. తాను సర్పంచ్ కుమారుడినని, తన తల్లి ఏడు పదుల వయస్సులో ఉండి రాలేకపోవడంతో ఆమె తరఫున ఫిర్యాదు తెచ్చానని వెంకట్రావు చెప్పాడు. దీంతో ఎస్‌ఐ మరింత రెచ్చిపోయాడు. వెంకట్రావును తీవ్రంగా అవమానించి నేరుగా సర్పంచ్ వచ్చి ఫిర్యాదు ఇస్తేనే తీసుకుంటానని స్పష్టం చేశాడు. దీంతో వెంకట్రావు వెళ్లిపోయారు. ఇంతలో అక్రమంగా బ్యారన్ నిర్మిస్తున్న మార్బూరి వెంకట్రావు తనను సర్పంచ్ తనయులు కొమ్మినేని వెంకట్రావు, శ్రీనివాసరావు బెదిరిస్తున్నారని ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్పంచ్ తనయుడు వెంకట్రావును స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై. 'బ్యారన్లు నిర్మిస్తున్న వెంకట్రావును మీరు బెదిరిస్తున్నట్లు అతని నుంచి ఫిర్యాదు వచ్చింది. దీనిపై కేసు నమోదు చేస్తున్నా' అని స్పష్టం చేశారు. కేసు పెట్టకుండా ఉండేందుకు రూ.లక్ష డిమాండ్ చేశాడు. అందుకు ఆయన అంగీకరించాడు. సర్పంచ్ రెండో కుమారుడైన శ్రీనివాసరావు తొలివిడత గతనెల 29న ఎస్సైకి రూ.30వేలు ఇచ్చారు. ఆ మొత్తాన్ని బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల వద్ద ఉన్న ఓ కేఫ్‌లో ముట్టజెప్పారు. మిగిలిన డబ్బులు త్వరగా ఇవ్వాలని ఎస్‌ఐ హుకుం జారీ చేశారు. దీంతో సర్పంచ్ తనయులు వెంకట్రావు, శ్రీనివాసరావు ఈనెల 1న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు మంగళవారం సర్పంచ్ రెండో కుమారుడు శ్రీనివాసరావు టంగుటూరు వచ్చారు. అనంతరం ఎస్‌ఐకి ఫోన్ చేశారు. డబ్బులు తెచ్చాను, ఎక్కడికి రమ్మంటారని ఆయన్ను అడిగారు. స్థానిక చెల్లమ్మతోటలోని తన నివాసానికి రావాలని ఎస్‌ఐ సూచించారు. దీంతో శ్రీనివాసరావు నేరుగా అక్కడికి వెళ్లారు. ఎస్‌ఐకు రూ.70వేలు ఇవ్వగా ఆ మొత్తాన్ని ఆయన కారులో పెట్టుకున్నాడు. అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆయన తీసుకున్న రూ.70వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు అపర్ణ, శేషు, ఎస్సైలు జేబీఎన్ ప్రసాద్, మస్తాన్‌షరీఫ్ ఉన్నారు.

వైసీపీతో అంటకాగుతున్న ఇన్‌చార్జి కార్యదర్శి సస్పెన్షన్

తాళ్లూరు, ఏప్రిల్ 2 : బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వహిస్తున్న లక్కవరం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ఎస్.పవన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ డీపీవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికార పార్టీ నేతలకు తొత్తుగా వ్యవహరిస్తూ పంచాయతీ సమావేశాలను కొంతకాలంగా నిర్వహించడం లేదని ఉప సర్పంచ్ పెద్దయ్య, హనుమారెడ్డి, వార్డు సభ్యులు అనేకమార్లు స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవోఆర్డీ కేజేఎస్ రాజు విచారించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. పవన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చి నట్లు ఎంపీడీవో కె.యుగకీర్తి తెలిపారు.


టీడీపీలో చేరిన రాజుపాలెంకు చెందిన కార్యకర్తలు

ముత్తుములకే స్థానిక నేతలు జై

● రోజురోజుకూ పెరుగుతున్న చేరికల జోరు ● రెండో రోజూ రాచర్ల మండల ప్రజలు బ్రహ్మారథం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 2 : నియోజకవర్గంలో టీడీపీలోకి రోజురోజుకు చేరికల జోరు పెరుగుతోంది. గెలుపోటములతో సంబంధం లేకుండా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్న టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డికే వివిధ పార్టీలలోని స్థానిక నేతలు సైతం జై కొడుతున్నారు. మంగళవారం కొమరోలు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీ నాయకుడు గోడి ఓబులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వీరికి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తుందని, ఈ విషయాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో మల్లారపు రామస్వామి, వెంకటేశ్వర్లు, నారాయణస్వామి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, నారాయణ, శివ, శ్రీనివాసులు, రామయ్య, ఎం.వెంకటేశ్వర్లు, పి.శాయన్న, దాంతా శ్రీనివాసులు, తదితరులు పార్టీలో చేరారు.

ఫారం నుంచి 20 కుటుంబాలు

రాచర్ల మండలంలోని ఫారంలో జరిగిన కార్యక్రమంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జిల్లెళ్ళ కిరణ్, పూలా శ్రీను, వెంకటసుబ్బయ్య, భాస్కర్, మోహన్, అల్లూరయ్య, చిన్నబాబు, యలగపాటి రమేష్, రాజు, కార్తీక్, డేవిడ్, మీనిగ ఖాజా, రమణ, రోశయ్య, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

బీసీ కుటుంబాల చేరిక

కంభం పట్టణానికి చెందిన 15 బీసీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మహిళ అధ్యక్షురాలు తోట మహాలక్ష్మి ఆధ్వర్యంలో బల్లారపు సుబ్బయ్య, లక్కాకుల తిరుపతయ్య, దేవిరెడ్డి సురేష్, బాలరంగయ్య, శేషారావు, చాబోలు ఆంజనేయులు, ఏరువా వెంకట రమణ, రాధా, పద్మ, రాద్రి, నాగమణి, లక్ష్మీశెట్టి పద్మ, నలబుల లక్ష్మీ తదితరులు టీడీపీలో చేరారు.

అశోక్‌రెడ్డి విజయానికి బీజేపీ కృషి

గిద్దలూరుటౌన్ : రానున్న ఎన్నికలలో ఎన్‌డీఏ అభ్యర్థిగా పోటీచేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి విజయానికి తామంతా కృషి చేస్తామని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ముత్తుముల అశోక్‌రెడ్డికి బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, దూదేకుల బాదుల్లా, కమలపాటి చంద్రమోహన్, వెంకట రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, వీరచక్రం, కొప్పుల నరసింహులు, సూరేపల్లి చెన్నకేశవులు, సాహూరు శివనాగేంద్ర, బిజెపి మహిళ నాయకురాలు షేక్ ముతహర్ తదితరులు కలిసి మద్దతు తెలిపారు.

గిద్దలూరు టౌన్ : టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి మానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో కొత్త వెలుగులు వస్తాయని గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాచర్ల మండలంలో రెండవ రోజు ఆయన విస్తృతంగా పర్యటించారు. రాచర ఫారం, రాచర్ల, పలుగుంటిపల్లి, గౌతవరం, అనంపల్లె, జేపీ.చెరువు, చినగానిపల్లె, అక్కపల్లె, చోళ్లవీడు, అచ్చంపేట, ఆకవీడు, ఆరవీటికోట గ్రామాలలో ఆయన పర్యటించారు. టీడీపీ శ్రేణులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మే 13న జరిగే ఎన్నికల్లో గిద్దలూరు నుంచి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డిని సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు మౌలిక వసతులు కల్పించానని, ప్రత్యేకంగా తాగునీటి సమస్య పరిష్కరించానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాచర్ల మండల అధ్యక్షులు కటికె యోగానంద్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జీవనేశ్వర్‌రెడ్డి, జనసేన జిల్లా కార్యదర్శి నరసింహారావు, టీడీపీ నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, రెడ్డి కాశిరెడ్డి, నంది శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన రాచర్లఫారం కాలనీ నాయకులు

ముత్తుముల పుష్పలీల ప్రచారం

గిద్దలూరు టౌన్ : టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం కోసం ఆయన భార్య ముత్తుముల పుష్పలీల మంగళవారం 9, 19 వార్డులలో ప్రచారం నిర్వహించారు. 9వ వార్డులోని ప్రతి వీధిలోకి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ఓటర్లకు వివరించారు. ముత్తుముల అశోక్‌రెడ్డి విజయం కోసం సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 19వ వార్డు పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట జడ్పీటీసీ మాజీ సభ్యురాలు, బీజేపీ నాయకురాలు పిడతల సరస్వతి, మాజీసర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ పాలుగుళ్ల శ్రీదేవి, టీడీపీ నాయకులు పెద్దభాషా, భూపాల్‌రెడ్డి, తోట కొండల్‌రావు, ఓబయ్య, మండ్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

బీఎల్‌వోలకు స్వీప్‌పై శిక్షణ



మాట్లాడుతున్న తహసీల్దారు రామకృష్ణ

త్రిపురాంతకం, ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వీప్‌పై బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దారు బి.రామకృష్ణ శివప్రసాద్, ఎంపీడీవో ఎం.సాంబశివరావు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. గ్రామాలలో సమావేశాలను ఏర్పా టు చేసి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఓట్ల ప్రాధాన్యతను వివరించాలని, ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలపాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎన్.మురళీమోహన్, ఎంఈవో రాజశేఖరరెడ్డి, వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులు, బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పాపన్న వర్ధంతి


నివాళులు అర్పిస్తున్న గౌడ సంఘం నేతలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 2 : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాప న్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గజ్జల రమణ గౌడ్, రంగస్వామి గౌడ్, శ్రీనివాస గౌడ్, కె.వెంకటేశ్వర్లు గౌడ్ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : సర్దార్ సర్వాయ్ పాపన్న వర్ధంతి కార్యక్రమం మంగళవారం రాత్రి పట్టణంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జమీందారులపై పోరాడిన ధైర్యశాలి అన్నారు. మొగల్‌రాజులకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేశాడన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కంచర్ల కోటయ్యగౌడ్, సంఘం అధ్యక్షులు బత్తిని వెంకటేశ్వర్లు, కార్యదర్శి కంచర్ల వరప్రసాద్‌గౌడ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ అందేలా చూడాలి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 2: లబ్ధిదారులందరికీ పింఛన్ అందేలా చూడాలని ఎంపీడీవో చందన సిబ్బందిని ఆదేశించారు.. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ సహాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో నడవలేని వారికి ఇంటి వద్దే అందజేస్తారన్నారు. సచివాలయాల వద్ద మంచినీటిని ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈసీ మార్గదర్శకాలను అనుసరించాలని ఆదేశించారు. వృద్ధులకు ఇబ్బంది లేకుండా సచివాలయాల్లో అన్ని ఏర్పాటు చేయాలన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 2: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో సచివాలయం-1 పరిధిలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు బాలీశ్వరయ్య, నాగమహేశ్వరి, శంకర్‌రెడ్డి, కవితలు 284 మంది రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం సిఫారసు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆరోగ్యమిత్ర చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు

● సంపు వద్ద వేకువజాము నుంచే ఎదురుచూపులు


మంచినీటి కోసం బబుల్స్‌ను క్యూలో నిలిపి వేచి ఉన్న ప్రజలు

పొదిలి, ఏప్రిల్ 2 : మండలంలో తాగునీటి కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మంగళవారం ఎస్‌ఏపీ సంపు వద్ద పట్టణంతో పాటు చుట్టూ గ్రామాలకు చెందిన పలువురు ప్రజలు ఉదయం 6 గంటల నుంచే క్యూలో నిలబడి ఉన్నారు. సుమారుగా 5 గంటలసేపు క్యూలో నిలబడితే ఒక్కబిందె సాగర్‌నీరు దొరకడం గగనంగా మారిందని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజులుగా సాగర్‌నీరు అందుబాటులో లేకపోవడంతో ఆవురుమంటున్న ప్రజలు మంగళవారం వస్తున్నాయని తెలిసి తెల్లువారుజామునుండే క్యూ కట్టారు. పూర్తిగా వేసవి రాకముందే నీటి సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా సంబంధిత అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సుమారుగా మూడు, నాలుగు నెలలుగా అప్పుడప్పుడు వచ్చే సాగర్‌నీటి కోసం కొళాయి వద్ద ఇలా రేయనకా.., పగలనకా పడిగాపులు కాయాల్సి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. మండలంలో నీటి ఇబ్బందులు ఎంత తీవ్రంగా ఉన్నాయో మంగళవారం సంపు వద్ద ప్రజలను చూస్తే ఇట్టే అర్థమౌతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి సమస్యపై స్పందించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ కార్యక్రమాలు


మాడవీధుల్లో నిర్వహిస్తున్న వేదపఠనం

మార్కాపురం వన్ టౌన్, ఏప్రిల్ 2: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ నాలుగు ప్రాకార గోపురాల శంకుస్థాపన కార్యక్రమాలు మంగళవా రం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు వేద పరాయాణం, నాగశాల ప్రవేశం, కుంభా ఆవహణలు, అగ్ని ప్రతిష్ఠ, శ్రీలక్ష్మీ హోమం, నూతన కలశాలకు, ధ్వజానికి క్షీరాదివాసం నిర్వహించారు. చతుస్థాన అర్చనలు, శ్రీలక్ష్మీ నృసింహ హోమం, కలశాలకు, ధ్వజానికి, ధాన్యాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ట్రస్టు బోర్డు ఛైర్మన్ కేశవరావు, ఈవో శ్రీనివాసరెడ్డిలు పర్యవేక్షించారు.


హోమాల్లో పాల్గొన్న భక్తులు, రుత్వికులు

స్వీట్ షాపులపై దాడులు


తనిఖీ చేస్తున్న అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 2: ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ నరసింహా, మార్కాపురం తూనికల, కొలతల అధికారి రియాజ్‌లు పట్టణంలోని స్వీటుషాపులు, ఐస్ తయారీ కేంద్రాలలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఓపీ మల్లిక్ మాట్లాడుతూ పట్టణంలోని స్వీట్ షాపులు, ఐస్ తయారీ కేంద్రాలపై పలు ఆరోపణలు ఉన్నాయన్నారు. పట్టణంలోని అమ్మా మిల్క్ డైరీ షాపులో తయారీ తేదీ లేకపోవడంతో కేసు బుక్ చేశామని అధికారులు తెలిపారు. సత్యనారాయణ స్వామి గుడి సమీపంలో ఫీ స్వీట్ షాపును తనిఖీ చేయగా లైసెన్స్ లేదని గుర్తించారు. స్వీట్ల శాంపిల్స్ సేకరించారు. పాత బస్టాండ్‌లోని శ్రీనివాస స్వీట్ షాపులో కూడా పరీక్షల కోసం పలు శాంపిల్స్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.లక్ష ఇస్తారా.. కేసు పెట్టమంటారా!

● టీడీపీ సర్పంచ్ తనయులకు ఎస్సై హెచ్చరిక
● రూ.70వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

టంగుటూరు, ఏప్రిల్ 2 : అనుమతులు లేకుండా బ్యారన్ నిర్మిస్తున్న వైసీపీకి చెందిన ఓ రైతుపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన టీడీపీకి చెందిన గ్రామ సర్పంచ్ తనయుడిపై ఎస్సై జులుం ప్రదర్శించారు. ఆయన్ను నానా దుర్భాషలాడారు. ఫిర్యాదు కూడా తీసుకోకుండా పంపించారు. అదేసమయంలో నిబంధనలకు విరుద్ధంగా బ్యారన్ నిర్మిస్తున్న రైతు నుంచి సర్పంచ్ కుమారులు బెదిరిస్తున్నారని ఫిర్యాదు తీసుకున్నారు. అనంతరం ఆమె పెద్ద కుమారుడిని స్టేషన్‌కు పిలిపించారు. రూ.లక్ష ఇస్తే కేసు లేకుండా చేస్తానని బేరానికి దిగారు. చివరికి రూ.70వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కాకుటూరివారిపాలెంలో వైసీపీకి చెందిన ఓ రైతు అనుమతి లేకుండా పొగాకు బ్యారన్లు నిర్మిస్తుండటంపై కొద్దిరోజుల క్రితం అప్పటి పంచాయతీ కార్యదర్శి సాంబయ్య ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. అయితే సర్పంచ్ ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటానని ఎస్ఐ స్పష్టం చేశారు. టీడీపీకి చెందిన సర్పంచ్ వృద్ధురాలు కావడంతో ఆమె తరఫున కుమారుడు వెంకట్రావు స్టేషన్‌కు వెళ్లగా ఆయనపై ఎస్ఐ సీరియస్ అయ్యారు. 'నువ్వెవడ్రా.. నువ్వెందుకొచ్చావు' అని దుర్భాషలాడాడు. తాను సర్పంచ్ కుమారుడినని, తన తల్లి ఏడు పదుల వయస్సులో ఉండి రాలేకపోవడంతో ఆమె తరఫున ఫిర్యాదు తెచ్చానని వెంకట్రావు చెప్పాడు. దీంతో ఎస్ఐ మరింత రెచ్చిపోయాడు. వెంకట్రావును తీవ్రంగా అవమానించి నేరుగా సర్పంచ్ వచ్చి ఫిర్యాదు ఇస్తేనే తీసుకుంటానని స్పష్టం చేశాడు. దీంతో వెంకట్రావు వెళ్లిపోయారు. ఇంతలో అక్రమంగా బ్యారన్ నిర్మిస్తున్న మార్టూరి వెంకట్రావు తనను సర్పంచ్ తనయులు కొమ్మినేని వెంకట్రావు, శ్రీనివాసరావు బెదిరిస్తున్నారని ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్పంచ్ తనయుడు వెంకట్రావును స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై. 'బ్యారన్లు నిర్మిస్తున్న వెంకట్రావును మీరు బెదిరిస్తున్నట్లు అతని నుంచి ఫిర్యాదు వచ్చింది. దీనిపై కేసు నమోదు చేస్తున్నా' అని స్పష్టం చేశారు. కేసు పెట్టకుండా ఉండేందుకు రూ.లక్ష డిమాండ్ చేశాడు. అందుకు ఆయన అంగీకరించాడు. సర్పంచ్ రెండో కుమారుడైన శ్రీనివాసరావు తొలివిడత గతనెల 29న ఎస్సైకి రూ.30వేలు ఇచ్చారు. ఆ మొత్తాన్ని బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల వద్ద ఉన్న ఓ కేఫ్‌లో ముట్టజెప్పారు. మిగిలిన డబ్బులు త్వరగా ఇవ్వాలని ఎస్ఐ హుకుం జారీ చేశారు. దీంతో సర్పంచ్ తనయులు వెంకట్రావు, శ్రీనివాసరావు ఈనెల 1న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు మంగళవారం సర్పంచ్ రెండో కుమారుడు శ్రీనివాసరావు టంగుటూరు వచ్చారు. అనంతరం ఎస్ఐకి ఫోన్ చేశారు. డబ్బులు తెచ్చాను, ఎక్కడికి రమ్మంటారని ఆయన్ను అడిగారు. స్థానిక చెల్లమ్మతోటలోని తన నివాసానికి రావాలని ఎస్ఐ సూచించారు. దీంతో శ్రీనివాసరావు నేరుగా అక్కడికి వెళ్లారు. ఎస్ఐకు రూ.70వేలు ఇవ్వగా ఆ మొత్తాన్ని ఆయన కారులో పెట్టుకున్నాడు. అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆయన తీసుకున్న రూ.70వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు అపర్ణ, శేషు, ఎస్సైలు జేబీఎస్ ప్రసాద్, మస్తాన్‌షరీఫ్ ఉన్నారు.

ఇంటింటికీ మన కందుల కార్యక్రమం ప్రారంభం

పొదిలి, ఏప్రిల్ 2 : ఇంటింటికి మన కందుల కార్యక్రమాన్ని స్థానిక నగరపంచాయతీలోని 16వ వార్డులో కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన, బీజేపీలు బలపరిచిన ఉమ్మడి మార్కాపురం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. గతంలో రెండుపార్యాయాలు ఓటమి పాలైనానని అయినప్పటికీ మీలో ఒకడిగా ఉంటూ ప్రజల కష్టాల్లో పాలుపంచుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. ప్రజల మద్దతు టీడీపీకే ఉంద న్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ప్రారంభిస్తార న్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. కనుక ప్రతి ఒక్కరూ, ఉమ్మడి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిని, మార్కాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయన తనయుడు విగ్నేష్‌రెడ్డి, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంటింటికి మన కందుల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న కందుల వసంతలక్ష్మి

టీడీపీలోకి వైసీపీ నేతలు

మార్కాపురం : మార్కాపురం మాజీ శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి సమక్షంలో పులువురు వైసీపీ నాయకులు మంగళవారం టీడీపీలో చేరారు. పట్టణంలోని 29వ వార్డులో మార్కండేయ స్వామి దేవస్థానం ధర్మకర్త రాచకొండ రాములక్క ఆధ్వర్యంలో 20 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. 30, 31 వార్డుల నుంచి దుర్గా యాత్ ఆధ్వర్యంలో దగ్గుల శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 25 కుటుంబా లు టీడీపీలో చేరాయి. 19 వార్డు నుంచి యల్లకర చిన్న వెంకట రంగయ్య ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో పోల్‌మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, టీడీపీ నాయకులు షేక్ మౌలాలీ, పఠాన్ ఇబ్రహీం, పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళలకు రక్షణ

మార్కాపురం : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడితోనే మహిళలకు రక్షణ సాధ్యమని మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో జగన్‌పాలనలో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్‌ను ఇంటింటికీ ప్రచారం చేశారు. మహిళలకు టీడీపీ ప్రభుత్వం వస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. తెలుగు దేశం, జనసేన, కూటమి అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలకు ఓటువేసి గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్ మర్రి ఝాన్సీ, తెలుగుయువత నాయకులు కందుల రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో టీడీపీ ప్రభంజనం ఖాయం

మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి


మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు, పక్కన మాగుంట రాఘవరెడ్డి

పెద్దదోర్నాల, ఏప్రిల్ 2: రాష్ట్రానికి టీడీపీ ప్రభంజనం వస్తోందని, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోనుందని నాయకులు మాగుంట రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని చిలకచెర్ల, చెర్లోపల్లి గ్రామాల్లో ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా చెంచు గిరిజనులు పెద్దఎత్తున పాల్గొని గూడూరిని స్వాగతించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలు, బాబుష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీపై వివరించారు. సాయంత్రం యడవల్లి గ్రామంలో పర్యటిస్తున్న క్రమంలో ఒంగోలు టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు రాఘవరెడ్డి హాజరయ్యారు. గ్రామ ప్రజలు, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయభేరి మోగించనుందన్నారు. రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కానున్నారని, అదే విధంగా ఈ నియోజకవర్గంలో తొలిసారి టీడీపీ జెండా ఎగురనుందన్నారు. కార్యకర్త లు, నాయకులు ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజుల్లోనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడం, మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించ డంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంద న్నారు బీసీలకు శాస్వత కుల ధృవీకరణ పత్రాలు మంజూరు, బీసీ చట్టం అమలు చేయనున్నట్లు వివరించారు. మాయమాటలు నమ్మొద్దని టీడీపీని ఆదరించాలని, సైకిలుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏర్వ మల్లికార్జున రెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, కె శ్రీనివాసులు, షేక్ ఇస్మాయిల్, షేక్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చంచయ్య, కె రాజేంద్ర,కొప్పుల సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష, మౌలాలి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల: ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా జనసేన, బీజేపీతో టీడీపీ కూటమి ఏర్పాటు చేయనున్నట్లు ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటన అనంతరం టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జగన్ ప్రభుత్వం అధికారం కోల్పోయే సమయంలోనూ పింఛన్లపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటికి వెళ్లి రూ.4 వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇంటి వద్దనే పింఛన్లు అందించాలి

● ఎక్కడికక్కడ అధికారులకు టీడీపీ నాయకుల వినతిపత్రాలు ● బురదజల్ల వద్దని అధికార పక్షానికి హితవు


మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛన్ల లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ శ్రీనివాసన్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని లబ్దిదారుల ఇళ్ల వద్దనే పింఛన్లు అందించాలన్నారు. ఈ అంశంలో టీడీపీపై వైసీపీ బురదజల్లడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ మౌలాలి, కనిగిరి రమణ, ఇబ్రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కంభం : ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి తప్పించి సచివాలయ సిబ్బందితో నేరుగా లబ్ధిదారుల ఇంటికే వచ్చి ఫించన్లు ఇవ్వాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఎంపీడీవో మస్తాన్‌వలికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు నాయకులు పాల్గొన్నారు.

అర్థవీడు మండలంలోని సామాజిక ఫించన్‌దారులకు ఇంటి వద్దకే వెళ్లి ఫించన్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో సాంబశివరావుకు టీడీపీ మండల అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులుయాదవ్, పూర్ణచంద్రరావు, లాకా రమణ, కత్తి రమణ తదితరులు వినతిపత్రం ఇచ్చారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటికే వెళ్లి పింఛన్ ఇవ్వాలన్నారు.

గిద్దలూరు : వేసవి తీవ్రత దృష్ట్యా సచివాలయ సిబ్బందితో ఇళ్ల వద్దనే ఫించన్లు పంపిణీ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు ఒక ప్రకటనలో ఎన్నికల కమీషన్‌కు విజ్ఞప్తి చేశారు. సచివాలయాల వద్దకు వెళ్లి ఫించన్లు తెచ్చుకోవాలంటే ముఖ్యంగా వృద్దులు, దివ్యాంగులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దానికితోడు కొన్ని సచివాలయాలు మేడల మీద ఉండడం వలన అన్ని మెట్లు ఎక్కి ఫించన్లు తీసుకోవడం వృద్దులకు, దివ్యాంగులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. కావున ఇళ్ల వద్దకే వెళ్లి ఫించన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కమిషనర్‌కు పుష్పలీల వినతి

గిద్దలూరు టౌన్ : నగర పంచాయతీ పరిధిలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రతినెలా అందచేసే సామాజిక ఫించన్లను సచివా లయ సిబ్బంది ద్వారా అందజేయాలని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులుకు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి భార్య పుష్పలీల వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు పిడతల సరస్వతి, కౌన్సిలర్ గడ్డం భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, బిల్లా రమేష్, కిశోర్, శ్రీను పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముత్తుముల పుష్పలీల

కొనకనమిట్ల : పింఛన్‌లు వెంటనే పెన్షన్‌దారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడీవో టి.సుగుణమ్మను మంగళవారం కలిసి టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు : వృద్దులకు, వికలాంగులకు అందించే సంక్షేమ పింఛన్లు పంపిణీ కార్యాక్రమాన్ని నేరుగా ఇంటి వద్దకే త్వరగా అందించాలని మండల టీడీపీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో నరసింహరావుకు స్థానిక టీడీపీ నాయకులు పింఛన్లను ఇంటి దగ్గరకు వెళ్లి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ నబీ, నాయకులు గోపాలకృష్ణ యాదవ్, చలాచీమల శ్రీనివాస చౌదరి, కాంట్రాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి, కృష్ణబాబు, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాల ని ఎర్రగొండపాలెం ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్‌కు వినతిప్రతం అందజేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బ య్య, టీడీపీ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, మంత్రునాయక్, వెంగళరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు యల్లయ్య , టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : లబ్ధిదారులకు ఈ నెల పెన్షన్లు వారి ఇంటి వద్దకే వెళ్లి ఇచ్చేవిధంగా ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో చందనకు ఆమె కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రామానుజన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వలంటీర్ల సేవలను అందించేందుకు వీలులేదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేశారని అన్నారు. పెన్షన్ తీసుకునే లబ్దిదారులకు సచివాలయ ఉద్యోగులు వారి ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ నగదును అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు పాల్గొన్నారు.

తర్లుపాడు : వృద్ధులు, వికలాంగుల పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఎంపీడీవో చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వృద్ధులు, వికలాంగుల పింఛన్లను పంపిణీ చేయకుండా టీడీపీ నాయకులపై బుదర చల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వెంటనే వృద్ధులు, వికలాంగుల పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ, ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.గోపినాథ్ చౌదరి, మాజీ సొసైటీ అధ్యక్షులు తిప్పిరెడ్డి వెలుగొండారెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు మేకల వెంకట్, టీడీపీ నాయకులు వెన్నా వెంకటరెడ్డి, జి.సుబ్బయ్య, ఈర్ల శ్రీనివాసులు, ఈర్ల పెద్ద కాశయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేయాలి



కనిగిరిలో వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర, దొనకొండ, తాళ్లూరు, ముండ్లమూరు ఎంపీడీవోలకు వినతిపత్రాలు సమర్పిస్తున్న టీడీపీ నాయకులు

- పింఛన్ సొమ్ము ఎగవేతకు జగన్‌రెడ్డి కుట్ర
- టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం
- అన్ని మండలాల్లో ఎంపీడీవోలకు టీడీపీ నేతల విజ్ఞప్తి

కనిగిరి, ఏప్రిల్ 2 : రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్ ఎగవేతకు పన్నాగం పన్నిన జగన్‌రెడ్డి ఆ నెపాన్ని టీడీపీపై వేయడం దుర్మార్గమని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌లు నిలిపేసేందుకు టీడీపీయే కారణమని వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పింఛన్‌లను సచివాలయ సిబ్బందిచే పంపిణీ చేయాలని కోరుతూ కమిషనర్ రంగారావుకు వినతిపత్రం అందచేశారు. అనంతరం డాక్టర్ ఉగ్ర విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ నేతల నుంచి ప్రజలకు తాయిలాల పేరుతో పంపిణీ చేసేందుకు కోట్లాది రూపాయల పింఛన్ నగదును వారి అనుయాయులకు మళ్లించిన కపటి జగన్‌రెడ్డి అని దుయ్యబట్టారు. స్వార్థరాజకీయ ప్రయోజనాల కోసం జగన్ చేస్తున్న, చేసిన కుట్రలకు అమాయక ప్రజల్ని బలి చేస్తున్న జగన్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. జగన్ మోసపూరిత వైఖరికి పెన్షన్‌దారులు, వలంటీర్లు తీవ్రంగా నష్టపోయారని డాక్టర్ ఉగ్ర అన్నారు. పెన్షన్ దారులపై జగన్‌కు ఏమాత్రం దయా, చిత్తశుద్ధి ఉన్నా వారికి చెందిన ఖజానాలోని నగదును బినామీ కాంట్రాక్టర్‌లకు దోచి పెట్టేవాడు కాదని మండిపడ్డారు. వలంటీర్ల వ్యవస్థను తప్పుడు కార్యక్రమాలకు వినియోగించి ఉద్యోగ వ్యవస్థకే మచ్చ తెచ్చిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను కొనసాగించడంతోపాటు సమాజంలో ఎంతో గౌరవ ప్రదమైన స్థానాన్ని కల్పిస్తామన్నారు. వారితోనే రూ.4వేలు పింఛన్‌ను ఇళ్లకు వచ్చి ఇచ్చేలా చర్యలు తీసుకుంటారన్నారు. పింఛన్ లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేయకుండా సచివాలయ సిబ్బందిని వినియోగించాలని కోరారు. ఓట్ల కోసం వైసీపీ ఎంత నీచ రాజకీయానికైనా దిగజారుతుందని పెన్షన్‌ల పంపిణీని అడ్డుకొని విపక్షాలపై వేస్తున్న నిందలే రుజువు చేస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, వీవీఆర్.మనోహరరావు, తమ్మినేని వెంకటరెడ్డి, షరీఫ్, ఫిరోజ్, తెలుగు మహిళలు షేక్ వాజిదాబేగం, దొరసాని, తులసి, స్వప్న, కే నీరజ, అమ్ములమ్మ, దనలక్ష్మి, వెంకటలక్షమ్మ పాల్గొన్నారు.

దొనకొండ : వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల ఇంటికి వెళ్లి పింఛన్‌లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని టీడీపీ మండలాధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వసంతరావునాయక్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా వృద్ధులను సచివాలయాలకు రప్పించకుండా సిబ్బందితో వారికి పింఛన్‌లు అందించాలని కోరారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వ ర్లు, నాయకులు యగ్గోని యల్లారెడ్డి, యరగొర్ల బసవయ్య, కొమ్మతోటి సుబ్బారావు, కమ్మా వెంక టనారాయణ, షేక్ తోహీద్, పరుచూరి రమేష్, బత్తుల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

తాళ్లూరు : ఖజానా ఖాళీగా ఉన్న విషయాన్ని బయటకు పొక్క కుండా కప్పిపుచ్చేందుకు పింఛన్‌ల పంపిణీపై వైసీపీ నేతలు టీడీపీపై అసత్య ప్రచారం చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బీ.ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్‌బాబులు విమర్శించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేయాలని ఎంపీడీవో కే యుగకీర్తికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు రాచకొండ వెంకట్రావు, ఐ.శ్రీనివాసరెడ్డి, సూరిబాబు, పి.అంజిరెడ్డి, కైపనాగార్జునరెడ్డి, వంగపల్లి నాగేశ్వరరావు, నరిశిరెడ్డి, హనుమ య్య, చాట్ల డానియేల్, నేరెళ్ల కిషోర్‌బాబు, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, శ్రీను పాల్గొన్నారు.

ముండ్లమూరు : ప్రతి నెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇచ్చే పింఛన్‌లను సచివాలయాల సిబ్బందితో పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు మంగళవారం ఎంపీడీవో బీ శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, శంకరాపురం సర్పంచ్ కూరపాటి నారాయణ స్వామి, మాజీ సర్పంచ్‌లు ఇందూరి పిచ్చిరెడ్డి, జిల్లెలమూడి చౌదరి, నిడమానూరి శ్రీనివాసరావు, చావా బ్రహ్మయ్య, చిననారాయణరెడ్డి, కొండలరావు, గంగినేని శేషగిరిరావు, మేదరమెట్ల రాంబాబు, కాటూరి గురవయ్య, మీనగ నందయ్య, జనసేన నేత తోట రామారావు పాల్గొన్నారు.

పీసీపల్లి : ఇళ్లవద్దకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో వెంకటసుబ్బారావును కలిసి వినతిపత్రం అందజేశారు. వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు రావాలంటే ఇబ్బందులు పడతారని అన్నారు. ఎన్నికల కమిషన్ వలంటీర్లను పక్కనపెట్టమని ఆదేశిస్తే ప్రతిపక్షాలపై ఆరోపణలు చేసేందుకే వైసీపీ వృద్ధులు, దివ్యాంగులపై కక్షగట్టి సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేట్టేందుకు ఆదేశాలు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం ఆదేశించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. కార్యక్రమంలో బద్దిపూడి ఎబినేజరు, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వెంకట్, హనుమారెడ్డి, మాల్యాద్రి, జోసెఫ్, పిచ్చిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వీరయ్య, క్రిష్టారెడ్డి ఉన్నారు.

పామూరు : ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదాఉలకు పింఛన్‌లు ఇవ్వాలని కోరుతూ ఎంపీడీవో పుట్టారెడ్డికి టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్, షేక్ ఖాజారహంతుల్లా, హుసేన్‌రావు, సయ్యద్ అమీర్‌బాబు, వై ప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఆర్ రఫి, మాల్యాద్రి, షేక్ గౌస్‌బాషా, పందిటి హరీష్ పాల్గొన్నారు.

వెలిగండ్ల : సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని కోరుతూ మంగళవారం టీడీపీ నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వర్లు, కర్నాటి భాస్కర్ రెడ్డి, భాస్కరొరెడ్డి, వెంకటేశ్వర్లు ఎస్సీసెల్ జిల్లా అధికార ప్రతినిధి సలోమన్‌రాజు, పండు, నాగరాజు పాల్గొన్నారు.



పీసీపల్లి, వెలిగండ్ల ఎంపీడీవోలకు వినతిపత్రాన్ని ఇస్తున్న టీడీపీ నాయకులు



కరపత్రాలను పంచిపెడుతున్న పువ్వాడి

టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి

పామూరు, ఏప్రిల్ 2 : టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పార్టీ మండలాధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. సీఎస్‌పురం రోడ్, ఆరేమరాఠీపాలెంలో బాబుష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మహిళా శక్తి పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. జగన్‌రెడ్డి వచ్చాక అన్ని ధరలు పెరిగి పేద కుటుంబాలపై ఆర్థికభారం పడిందన్నారు. అభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా, డాక్టర్ ఉగ్రను ఎమ్మెల్యేగా గెలిపించాలని పువ్వాడి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఎన్నికల కమిటీ చైర్మన్ మనోహర్, గౌరవాధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, సయ్యద్ అమీర్‌బాబు, పందిటి హరీష్, షేక్ గౌస్‌బాషా, డోలా శేషు, బీ సత్యం, జాజం శ్రీనివాసులు, ధైండే రామాంజనేయులు, ముబినామౌలాలి, మాచర్ల రహిమాన్, పులి నాయబ, గుత్తి మహేష్, జనసేన నాయకులు గుత్తి మహి, తెలుగుమహిళలు ఎం.రమాదేవి, వీ ఈశ్వరమ్మ, షేక్ బీబీ పాల్గొన్నారు.

టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మేడగం



తాళ్లూరు, ఏప్రిల్ 2 : మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మేడగం వెంకటేశ్వరరెడ్డిని ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. వెంకటేశ్వరరెడ్డి టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ తెలుగురైతు ఉపాధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఆయన్ని ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ నియామకపత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా కొండారెడ్డి

దర్శి, ఏప్రిల్ 2 : దర్శి కాంగ్రెస్ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్లూరి కొండారెడ్డిని అధిష్ఠానం ఎంపిక చేసింది. పీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిల విడుదల చేసిన జాబితాలో కొండారెడ్డికి చోటు దక్కింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కొండారెడ్డి దర్శి అసెంబ్లీకి పోటీ చేశారు. అప్పటి నుంచి ఆయన కొనసాగుతూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. దీంతో మళ్లీ ఆయనకు చాన్స్ దక్కింది. ఈ సందర్భంగా అధ్యక్షురాలు షర్మిలకు రాష్ట్ర, జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కొండారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఆకుపాటికి డాక్టరేట్‌పై హర్షం



ఆకుపాటిని సన్మానిస్తున్న డాక్టర్ ఉగ్ర

పామూరు, ఏప్రిల్ 2 : పామూరు పట్టణ 2వ ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్‌కు గౌరవ డాక్టరేట్ రావడంపట్ల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి హర్షం తెలిపారు. ఆకుపాటికి ఇటీవల ప్రతిష్ఠాత్మక ఏషియా ఇంటర్నేషల్ కల్చర్ రీసెర్చి వర్సిటీ నుంచి డాక్టరేట్ వరించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఆకుపాటికి మంగళవారం పద్మావతి అతిథి గృహంలో సూర్యచంద్ర సేవా సంస్థ అధ్యక్షుడు డీవీ మనోహర్ అధ్యక్షతన ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వెంకటేష్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు దక్కిన డాక్టరేట్ అన్నారు. అనంతరం ఆకుపాటిని శాలువాతో ఘనంగా సత్కరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు పువ్వాడి, భైరెడ్డి జయరామిరెడ్డి, డాక్టర్ గద్దె ఏడుకొండలు, షేక్ ఖాజారహంతుల్లా, దరిశి రాము, వార్డు మెంబర్ ఉ ప్పలపాటి హరిబాబు, వెం కటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, ముబినామౌలాలి, నరసింహులు, మాల్యాద్రి, నారాయణ పాల్గొన్నారు.

వైసీపీతో అంటకాగిన ఇన్‌చార్జి కార్యదర్శి సస్పెన్షన్

తాళ్లూరు, ఏప్రిల్ 2 : బాధ్యతా రాహిత్యంగా విధులు నిర్వహిస్తున్న లక్కవరం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ఎన్.పవన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ డీపీవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికార పార్టీ నేతలకు తొత్తుగా వ్యవహరిస్తూ పంచాయతీ సమావేశాలను కొంతకాలంగా నిర్వహించడం లేదని ఉపసర్పంచ్ పెద్దయ్య, హనుమారెడ్డి, వార్డు సభ్యులు అనేకమార్లు స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవోఆర్డీ కేజేఎస్‌రాజు విచారించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. ఎవన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చి నట్లు ఎంపీడీవో కె.యుగకీర్తి తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

మాగుంట, లక్ష్మి విజయానికి కృషి చేయాలి

తాళ్లూరు, ఏప్రిల్ 2 : ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి విజయమే లక్ష్యంగా శ్రేణులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తెలిపారు. తాళ్లూరులోని ఎన్టీఆర్ భవనం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన పరిచయ కార్యక్రమ సమావేశంలో మాట్లాడారు. గత ఐదేళ్లుగా వైసీపీ అరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఆయన చేతగాని పాలనతో అన్ని రంగాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. టీడీపీ అభ్యర్థి భర్త లక్ష్మి డాక్టర్ లలిత్‌సాగర్ మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. తమ కుటుంబాలు సుదీర్ఘకాలంగా టీడీపీ పార్టీని నమ్ముకుని ముందుకు సాగుతుందన్నారు. మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు, గొట్టిపాటి నరసయ్య కీలక పదవుల్లో ఉండి టీడీపీకి అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం తూర్పుగంగవరంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులు మానం రమేష్‌బాబు, శాగంకొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ కా శీంసైదా, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, దర్శి నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ మీరామొహిద్దీన్, టీడీపీ నేతలు ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, తిరుపతిరావు, కె.రామకోటిరెడ్డి, కె.నరసింహారావు, జి.రమణారెడ్డి, సూరిబాబు, రాచకొండవెంకట్రావు, వంగపల్లి నాగేశ్వరరావు, జి.లక్ష్మీనారాయణ, రామలక్ష్మయ్య, అనపర్తి సుబ్బారావు కనిశెట్టి రామలక్ష్మయ్య నరిశిరెడ్డి, నాగార్జునరెడ్డి, కె.రామయ్య, పాలెపోగు రాజు, టి.శివనాగిరెడ్డి, ఎస్.ఆనారాయణరెడ్డి, పోతురాజు, దాసు, హనుమయ్య, నాగయ్య, హనుమారెడ్డి, స్వామిదాసు, మహిళా నేతలు మారాబత్తుల సుజాత, కోట అంకమ్మ, మెలికా అంజమ్మ, శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

పరిచయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

దొనకొండ, ఏప్రిల్ 2 : తెలుగుదేశం పార్టీ దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమితులైన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం మధ్యాహ్నం దర్శిలో నిర్వహించే ఆహ్వాన, పరిచయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం పలువురు నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ అధిష్ఠానం ఇక్కడకు సుదీర్ఘ రాజకీయ కుటుంబానికి చెందిన విద్యావంతురాలిని కేటాయించడం శుభపరిణామమన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో జరిగిన అరాచకాలను ప్రజలకు వివరించి టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేసవి ప్రారంభం నుంచే గ్రామాల్లో ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా వైసీపీ పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. తాగునీటి సమస్యలను తెలుసుకొని టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా సొంత నిధులతో ట్యాంకర్లను ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గుమ్మా గురవమ్మ, టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంక టేశ్వర్లు, టీడీపీ నాయకులు యగ్గోని యల్లారెడ్డి, యరగొర్ల బసవయ్య షేక్ సద్దాం, కొమ్మతోటి సుబ్బారావు, వల్లపునేని కేశవ, షేక్ తోహీద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి లక్ష్మికి అభినందనలు

ముండ్లమూరు, ఏప్రిల్ 2 : దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మంగళవారం నరసరావుపేట వెళ్లి బొకేలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వేంపాడు గ్రామస్థులు తప్పకుండా విజయానికి కృషి చేస్తామని ఆమెతో అన్నారు. కార్యక్రమంలో గంగినేని శేషగిరిరావు, మేదరమెట్ల కొండలరావు, సుబ్బారావు, బోడపాటి పెద వెంకటరావు, సుబ్బయ్య ఉన్నారు.

ముండ్లమూరు : టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని గెలిపించు కోవాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందని మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని పెదరావిపాడు, భీమవరం, బొప్పూడివారిపాలెం గ్రామాల్లో టీడీపీ నాయకులతో సమావేశం అయ్యారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు కుంచపు ఏడుకొండలు, భీమినేని నాసరయ్య, చుంచు వీర నారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాళ్లూరు : రాష్ట్ర తెలుగు యువ కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు ఆధ్వర్యంలో తాళ్లూరు తెలుగు యువత నాయకులు మంగళవారం టీడీపీ అభ్యర్థి లక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. బెల్లకొండవారిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు పుట్టా నరసింహారావు, టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ అన్వర్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి గుర్రం బాలకృష్ణ ఉన్నారు.



లక్ష్మికి అభినందనలు తెలుపుతున్న ముండ్లమూరు నాయకులు

దొంగ ట్రాక్టర్ల విక్రయం.. రైతుల్లో భయం

- దర్శి ప్రాంతంలో 20కిపైగా అమ్మకం
- నమ్మించి మోసం చేస్తున్న మాయగాళ్లు



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్లు

దర్శి, ఏప్రిల్ 2 : రాయలసీమకు చెందిన కొంతమంది మాయగాళ్లు రైతులను నమ్మించి మోసం చేస్తునారు. అక్కడ రైతులను మాయ చేసి తెచ్చిన ట్రాక్టర్లను ఇక్కడి రైతులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తక్కువ ధరకు ట్రాక్టర్లు రావడంతో ఎలా వచ్చాయనేది ఆలోచించకుండా కొంతమంది అమాయకంగా దొంగ ట్రాక్టర్లను కొనుగోలు చేసి మోసపోయారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పోలీసులు దర్శి, పొదిలి, దొనకొండ ప్రాంతాలో ముమ్మరంగా గాలించి దొంగతనంగా విక్రయించిన 14 ట్రాక్టర్లను ఇప్పటికే పట్టుకున్నారు. కడప, అనంతపురం జిల్లాలకు చెందిన కొందరు అక్రమార్కులు ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన రైతుల ట్రాక్టర్లను ఫ్యాక్టరీల్లో పనుల కోసం అద్దెకు ఇవ్వాలని నమ్మించి తీసుకుంటున్నారు. వీళ్ల డ్రైవర్లే ట్రాక్టర్లు తోలుకునే విధంగా నెలకు రూ.25వేలు బాడుగ ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అధిక మొత్తంలో బాడుగ లభిస్తుండడంతో యజమానులైన కొంతమంది రైతులు అక్రమార్కులను నమ్మి ట్రాక్టర్లు అప్పగించారు. ఒకటి రెండు నెలలు నమ్మకంగా బాడుగ ఇస్తూ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డారు. వారిని చూసి మరికొంత మంది రైతులు ట్రాక్టర్లు బాడుగకు ఇచ్చారు. ఇదే అదునుగా అక్రమార్కులు కొంతమంది బ్రోకర్ల ద్వారా దర్శి - పొదిలి ప్రాంతాల్లోని రైతులకు ఒక్కో ట్రాక్టర్‌ను రూ.2లక్షల చెప్పున విక్రయించారు. తక్కువ ధరలకు ట్రాక్టర్లు దొరికాయని ఇక్కడ రైతులు సంబరం పడుతున్న సమయంలో సత్యసాయి జిల్లాకు చెందిన పోలీసులు ఇక్కడకు వచ్చి తనిఖీలు నిర్వహించారు. అక్కడ రైతులు తమ ట్రాక్టర్లు బాడుగ పేరుతో చెప్పి ఇతర ప్రాంతాల్లో వినియోగించారనే ఫిర్యాదుతో ట్రాక్టర్ల గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అక్కడ విక్రయించిన అక్రమార్కులను వెంటబెట్టుకొని వచ్చి ఇక్కడ ఏపీ ప్రాంతాల్లో ట్రాక్టర్‌లను విక్రయించారో సమాచారం తెలుసుకున్నారు. ఇప్పటి వరకు దర్శి మండలంలో నాలుగు, తాళ్లూరు మండలంలో రెండు, పొదిలి మండలంలో నాలుగు, దొనకొండ మండలంలో రెండు ట్రాక్టర్లు దొరికాయి. ఇంకా వినుకొండ ప్రాంతాల్లో పలు ట్రాక్టర్లను అమ్మినట్లు తెలిసింది. ఈ ముఠా మొత్తం ఎన్ని ట్రాక్టర్లను విక్రయించారో అన్న విషయం తెలుసుకునేందుకు అన్ని గ్రామాల్లో పోలీసులు తిరుగుతున్నారు. ట్రాక్టర్ల అక్రమ విక్రయ వ్యవహారం బయటపడటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం ఎవరైనా ట్రాక్టర్లు కొనుగోలు చేయాలంటే ఆ ప్రాంతానికి వెళ్లాలంటే భయపడుతున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భాగవతంతో జ్ఞానం



కురిమేటిని సన్మానిస్తున్న డాక్టర్ గద్దె

పామూరు, ఏప్రిల్ 2 : మానవాళికి జ్ఞానం, వైరాగ్యాన్ని ప్రసాదించేది భాగవతమని ప్రముఖ ప్రవచనకర్త కురిమేటి బాలసుబ్రహ్మణ్యం శాస్త్రి తెలిపారు. సాయిబాబా దేవస్థానంలో జరు గుతున్న శ్రీ భాగవత సప్తాహ సత్సంగ కార్యక్రమం మంగళవారం ముగిసింది. వేదాంతం వృక్షమైతే భాగవతం దాని మధుర ఫలమని పోతన భాగవత పద్యాలు ఆబాలగోపాలమని కురిమేటి వివరించారు. భాగవతం విన్నా, పఠించినా జన్మధన్య మని, పిల్లలకు భాగవత పద్యాలు నేర్పించడం ద్వారా భవిష్యత్‌లో సత్ప్రవర్తనతో ఉంటారని కురిమేటి చెప్పారు. అనంతరం మెడికల్ అధికారి డాక్ట ర్ గద్దె ఏడుకొండలు, కురిమేటిని ఘనంగా సత్కరిం చారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ పబ్బర్తి వెంకటసుబ్బయ్య, పీ వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

రేపు బహిరంగ సభ

దర్శి : టీడీపీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన సాయంత్రం 3 గంటలకు పట్టణంలోని గడియార స్తంభం వద్ద బహిరంగ సభ, అభ్యర్థుల పరిచక కార్యక్రమం జరుగుతుందని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట, దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితోపాటు టీడీపీ అభ్యర్థులు, జిల్లా పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ముఖ్యనాయకులు పాల్గొంటారని టీడీపీ అభ్యర్థి లక్ష్మి భర్త లలిత్‌సాగర్ తెలిపారు.



మహ్మదాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

డాక్టర్ ఉగ్రతోనే అభివృద్ధికి బాటలు

కనిగిరి, హెచ్‌ఎంపాడు మండలాల్లో శ్రేణుల ప్రచారం

కనిగిరి, ఏప్రిల్ 2: కనిగిరి నియోజకవర్గంలో అన్నివిధాలా అభివృద్ధి జరగాలంటే డాక్టర్ ఉగ్రను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని కంఠంవారిపల్లిలో మంగళవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాల వల్లే కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. చంద్రబాబు బీసీవర్గాల ప్రజలకు చేతివృత్తుల ద్వారా చేయూత ఇస్తూనే వారి కుటుంబాల్లోని విద్యావంతులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. కనిగిరిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే ఉగ్ర లక్ష్యమన్నారు. దిగువ, మధ్యతరగి వర్గాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చంద్రబాబు మహిళా శక్తి పథకాలను రూపొందించారన్నారు. వైసీపీ పాలనలో జరిగిన విధ్వంస, వినాశకర పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. అత్యధిక మెజార్టీతో ఉగ్రను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరి ప్రాంతంలో మంచినీటి, ఉపాధి సమస్య శాశ్వతంగా పరిష్కారం కావాలంటే టీడీపీకి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లుయాదవ్, బీసీ నాయకులు పల్లా మాలకొండరావు, ఐఎస్ఆర్, గ్రామపార్టీ నాయకులు, బూత్ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు మండలం మహ్మదాపురం గ్రామంలో సోమవారం సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌సిక్స్ ప్రచారపత్రాలను ప్రజలకు అందించి వాటి ప్రయోజనాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఉగ్రను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గాయం రామిరెడ్డి, ఉడుముల సుబ్బారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, జనసేన నాయకుడు ఆకుపాటి వెంకట్రావ్, టీడీపీ నాయకులు జట్టుబోయిన గంగరాజుయాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో లలిత్‌సాగర్

టీడీపీలోకి 10 కుటుంబాలు చేరిక

కురిచేడు, ఏప్రిల్ 2 : కురిచేడు మండలం నమశ్శివాయపురం గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్‌సాగర్ మంగళవారం కురిచేడు మండలానికి వచ్చారు. ఆయనకు మండల నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. టీడీపీ అభ్యర్థి లక్ష్మి పరిచయ కార్యక్రమానికి అందరూ రావాలని కోరారు. నమశ్శివాయపురానికి చెందిన పామిసెట్టి పెద్ద సుబ్బయ్య, పామిసెట్టి వీరాంజనేయులు, కాట్రాజు ఏడుకొండలు, కాట్రాజు వెంకటేశ్వర్లు, పామిసెట్టి శేషు మరికొంత మంది టీడీపీలో చేరారు. వారికి లలిత్ సాగర్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలసికట్టుగా పనిచేసి టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువకుడు మృతి

ముండ్లమూరు, ఏప్రిల్ 2 : మండలంలోని పోలవరం పంచాయతీ పరిధిలోని సంగం వద్ద అద్దంకి మండలం కుంకుబాబు గ్రామానికి చెందిన చెరుకుపల్లి శ్రీకాంత్ (31) ఒంగోలులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మం గళవారం తెల్లవారు జామున మృతి చెందారు. వివరాల్లోకి వెళితే ఈనెల 22వ తేదీ శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై పోలవరం సమీపంలోని కోళ్లఫాం వైపు వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడి పోయాడు. దీంతో తీవ్ర గాయాలు అవ్వడంతో మొదట ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స ని మిత్తం చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రిలో చే ర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఎన్ వెంకటేశ్వరరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీకాంత్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.







వేటు పడింది..



ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ఐజీ పాలరాజు

ఎన్నికల వేళ వైసీపీకి షాక్

- గుంటూరు ఐజీ, పల్నాడు ఎస్పీ బదిలీ
- కంగుతిన్న పోలీసులు.. యంత్రాంగంలో కలకలం
- అధికార పార్టీతో అంట కాగినందుకు తగిన మూల్యం

పోలీసింగ్ మరిచారు.. విధి నిర్వహణలో పక్షపాతం.. అధికార పార్టీకి అండదండలు.. హింస చెల రేగుతున్నా పట్టించుకోకపోవడం.. ప్రతిపక్ష పార్టీల ఫిర్యాదులపై నిర్లక్ష్యం.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా మారని ధోరణి.. ప్రధానమంత్రి మోదీ పాల్గొనే ప్రజాగళం సభ విఫలయత్నానికి ఎత్తులు.. ఇలా ఎన్నోన్నో రకాలుగా వైసీపీ అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు. అయినా వెరవకుండా ముఖ్యమంత్రి అండదండలు ఉన్నంతవరకు తమను ఎవరూ ఏమీ చేయలేరని, వచ్చే ఎన్నికల్లో అధికార వైసీపీని ఎలాగైనా గట్టెక్కించాలని కాచుకుకూర్చున్న ఐపీఎస్‌లపై ఎన్నికల సంఘం వేటువేసింది. ఎన్నికల సమీపిస్తోన్న వేళ ఇది వైసీపీకి గట్టి షాకే. గుంటూరు రేంజి ఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. వీరి బదిలీతోనైనా పోలీసు అధికారులు వారి పనితీరు మార్చుకుంటారని పలువురు ఎదురు చూస్తున్నారు.

నరసరావుపేట, గుంటూరు, ఏప్రిల్ 2: ఐపీఎస్‌లు పక్షపాతం లేకుండా అందరికీ సమన్యాయం చేయాలి. కాని బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అధికార పార్టీతో అంటకాగుతూ వారు చెప్పిందే వేదమన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. అధికార పార్టీ మత్తులో జోగుతున్నారనేది ప్రత్యక్షంగా దేశ ప్రధానికే రుచి చూపించిన ఐపీఎస్‌లకు కొంచెం ఆలస్యమైనా గట్టి షాకే తగిలింది. ఐజీ, పల్నాడు ఎస్పీలపై వేటు పోలీసు శాఖలో సంచలనం కలిగించగా, ఎన్నికల అధికారుల్లో కలకలం సృష్టించింది. అధికార పార్టీకి అనుకూల వైఖరి అవలంభిస్తున్నట్లు ఆధారాలతో సహా రుజువు కావడంతో గుంటూరు రేంజ్ ఐజీ జీ పాలరాజుతో పాటు రేంజి పరిధిలోని పల్నాడు ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి, ప్రకాశం ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డిలను తక్షణం బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడం అటు రాజకీయ వర్గాలతో పాటు ఇటు పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. గతనెల 17న చిలకలూరిపేట పరిధిలోని బొప్పూడి వద్ద జరిగిన ప్రజాగళం సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరుకాగా దానిని విఫలయత్నం చేసే బాధ్యత పలువురు ఐపీఎస్‌లు భుజాన వేసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వేదిక ముందు డీ జోన్‌లోకి ఎవరినీ అనుమతించకూడదు. అటువంటిది ప్రధాని వేదికపైకి వచ్చిన తర్వాత పెద్ద గుంపు చొచ్చుకు రావడం, వీవీఐపీ జోన్‌లోకి సైతం బాటిళ్ల విసిరారు. మైకుల స్టాండ్ పైకి పెద్ద సంఖ్యలో జనం ఎక్కడం అది కూలిపోతే అత్యంత ప్రమాదకరమని తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లుగా పోలీసులు వ్యవహరించడం తదితరాలు భద్రత వైఫల్యానికి నిదర్శనంగా నిలిచాయి. మరోవైపు ప్రధాని ప్రసంగిస్తున్న సమయంలో అనేకసార్లు మైకు అంతరాయం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం కూడా ఉద్దేశపూర్వకంగా జరిగినట్లుగానే ఇంటిలిజెన్స్ వర్గాలు అంచనాకు వచ్చాయి. ప్రధాని పాల్గొన్న ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యం కేంద్ర హోం శాఖ వర్గాలను సైతం షాక్‌కు గురి చేసింది. ప్రజాగళం షెడ్యూల్ లో భాగంగా ప్రధానికి జ్ఞాపికలు అందజేయాల్సి ఉంది. రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఇవ్వాల్సి ఉండగా ఆయన జ్ఞాపికలతో వస్తుండగా పోలీసు అధికారులు ఆయనను వేదిక ఎక్కకుండా అడ్డుకున్నారు. దీంతో కార్యక్రమం నిర్వహణలో ఒక భాగమైన జ్ఞాపికలు ప్రధానికి, ఇతర ప్రముఖులకు ఇవ్వకుండానే సభ పూర్తి కావడం విస్మయానికి గురి చేసింది.

మరోవైపు ప్రజాగళం సభకు వచ్చే పార్టీ శ్రేణులపై అనుచితంగా వ్యవహరించడం, వేలాదిగా తరలివస్తున్న వాహనాలను ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా క్రమబద్ధీకరించడంలోనూ పోలీసులు పూర్తిగా ఉద్దేశపూర్వకంగా చేతు లెత్తేసినట్లు ఆరోపణలు వచ్చాయి.



దహనమవుతున్న టీడీపీ నేత కారు (ఫైల్)

దీనిపై కేంద్ర నిఘా వర్గాలు అదే రోజు తీవ్రంగా స్పందించి అక్కడ నెలకొన్న పరిస్థితులు, పోలీసుల తీరుపై పక్కా ఆధారాలతో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ప్రమేయం లేకుంటే ఇటువంటి తీవ్ర ఆరోపణలు వచ్చినప్పుడు తక్షణం రాష్ట్ర ప్రభుత్వం వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుని ఉండేది. కానీ వారిపై కనీసం ఈగ కూడా వాలలేదు. వారిని హెచ్చరించిన దాఖలాలు కూడా లేవు. ఇది ఎన్నికల తరుణంలో కేవలం ట్రయల్ మాత్రమేనని ఎన్నికల ప్రక్రియ సమీపించే కొద్దీ తమ ప్రతాపం చూపుతామన్నట్లుగా ఆయా పోలీస్ ఉన్నతాధికారులు వ్యవహరిస్తుండటంతో టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు నేరుగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేశాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలను స్వయంగా పిలిపించుకుని ప్రధాని సభలో భద్రత వైఫల్యంపై వివరణ తీసుకుంది. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక కూడా పంపింది. ఈ ముగ్గురు ఎస్పీలను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగిన గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజుపై కూడా అధికార వైసీపీ ముద్ర ఉండటం వల్లే ఆయన కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఐజీ కూడా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఆ పార్టీ నేతలు ఏది చెబితే అది చేసుకుంటూ పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ప్రజాగళం సభకు జనాన్ని తీసుకువెళ్లారనే కారణంతో గిద్దలూరు మండల పరిధిలో మునయ్య అనే టీడీపీ కార్యకర్తను దారుణంగా హత్య చేయడం, ఆ కేసు విషయంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సరిగా స్పందించలేదనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఒక్క గుంటూరు రేంజ్ లోనే నలుగురు ఐపీఎస్‌లపై వేటుపడింది. అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే వారు ఏ స్థాయి వారు అయినా సరే ఇదే గతి పడుతుందని ఎన్నికల సంఘం ఏకంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

పల్నాడు ఎస్పీపై తొలి నుంచి ఆరోపణలు

పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డిపై తొలి నుంచి పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఆయన అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పెద్దఎత్తున టీడీపీ కార్యకర్తల హత్యలు, హత్యాయత్నాలు, తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులు వంటి వాటిలో ఎస్పీ స్థాయి అధికారి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పినట్లుగానే ఎస్పీ వ్యవహరిస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును నంద్యాలలో అరెస్ట్ చేసి తీసుకు వెళుతున్న తరుణంలో చిలకలూరిపేట వద్ద టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేసిన సందర్భంలో ఎస్పీ దారుణంగా వ్యవహరించిన తీరు సోషల్ మీడియాలో అప్పట్లో వైరల్‌గా మారింది. లాఠీలతో విరుచుకుపడి దొరికిన వారిని దొరికినట్లు బాధి ప డేశారు. ఎన్నికల కోడ్ అమ ల్లోకి వచ్చిన అనంతరం ఇటీవల మాచర్లలో ఇంటి వద్ద ఉన్న టీడీపీ నేత కారు తగలబెట్టిన అంశంలో ఎస్పీ తీరుపై విమర్శలు వచ్చాయి. ఈ సంఘటన నేపథ్యంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని రాష్ట్ర ఎన్నికల కమిషన్ వివరణ కోరింది. ఈ సందర్భంగా సమస్యాత్మకమని తెలిసి శాంతి భద్రతలను నియంత్రించలేదని ఎస్పీని ఎన్నికల కమిషన్ నిలదీసింది. కోడ్ వచ్చాక రాజకీయ హింస జరగడంపై ఎస్పీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. హింసాత్మక ఘటనలు జరగకూడదని ఎస్పీకి స్పష్టంగా చెప్పింది. అయితే ఎన్నికల కమిషన్ వద్ద మార్చి 21న ఎస్పీ హాజరైన మరుసటి రోజు ఇదే నియోజకవర్గంలో జనసేన నేతల పై వైసీపీ శ్రేణులు దాడులు జరిగాయి. గతంలో కూడా మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ వర్గీయులపై దాడుల పరంపర, వైసీపీ అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయాయి. అనేక హింసా త్మక సంఘ టనలు జరుగుతున్నా పోలీసులు అధికార పార్టీకి అండగా ఉన్నారన్న ఆరోపణలు న్నాయి. ఏ సంఘటన జరిగినా రవిశంకర్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరో పణలను విపక్షాల నుంచి ఎదుర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లు, కోడి పందాలు అరికట్ట డంలో కూడా ఆయన విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. క్రికెట్ బెట్టింగ్‌ల విషయంలో బాధితుల కుటుంబ సభ్యులు ఎస్పీకి ఫిర్యాదు ఇచ్చినా స్పందించలేదన్న విమర్శ లున్నాయి. ఎస్పీ పనితీరుపై మొదటి నుం చి విపక్షాలు ఆరోపణలు, విమర్శలు చేస్తూనే ఉన్నా ప్రభుత్వ పెద్దల్లో స్పందన లేదు. చివరకు ఎన్నికల సంఘం జోక్యంతో ఆయనపై బదిలీ వేటు పడింది.



వైసీపీ నేతల దాడితో ధ్వంసమైన జనసేన నేతల వాహనం (ఫైల్)

నేటికి రెండేళ్లు

గ్రూప్-1 ద్వారా డీఎస్పీగా ఎంపికై ఉద్యోగోన్నతి ద్వారా ఎస్పీగా రవి శంకర్‌రెడ్డి పల్నాడుకు వచ్చారు. పల్నాడు జిల్లాకు తొలి ఎస్పీగా రవిశంకర్‌రెడ్డి ఏప్రిల్ 3 2022న బాధ్యతలు స్వీకరించారు. అంటే ఆయన ఎస్పీగా వచ్చి నేటికి(బుధవారం) సరిగ్గా రెండేళ్ల అవుతుంది. రెండేళ్లకు ఒక్క రోజు ముందు ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం చర్యలతో బదిలీ అయ్యారు. రవిశంకర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు ఎస్పీ ఇన్‌చార్జి బాధ్యతలను ఏఎస్పీ రాఘవేంద్రరావుకు అప్పగించారు. ఎస్పీపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడంతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి విధుల్లో ఉంటే ఎన్నికలు సజావుగా జరిగి ఉండేవి కాదని వారు పేర్కొన్నారు.

చంద్రబాబు పర్యటన ఖరారు



6న పెదకూరపాడు, సత్తెనపల్లిలో ప్రజాగళం

నరసరావుపేట, ఏప్రిల్ 2: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పల్నాడు జిల్లా పర్యటన ఖరారైంది. ప్రజాగళం పేరుతో చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ క్రమంలో ఆయన 6న పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు వివరాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మంగళవారం ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పెదకూరపాడు, సాయంత్రం 5 గంటలకు సత్తెనపల్లిలో ప్రజాగళం సభల్లో చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. చంద్రబాబు సభలకు సంబంధించిన ఏర్పాట్లను పెదకూరపాడులో పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్, సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణలు పర్యవేక్షిస్తున్నారు. సభలకు భారీగా జనసమీకరణకు నేతలు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో ఈ రెండు నియోజక వర్గాల్లో చంద్రబాబు పర్యటన, సభలు విజయవంతం అయ్యాయి. అంతకు మించి ఈ సారి ప్రజాగళం సభలను విజయవంతం చేయాలని నేతలు నిర్ణయించారు. తొలుత చంద్రబాబు వినుకొండలో పర్యటిస్తారని పార్టీ కార్యాలయం నుంచి సమాచారం అందింది. అయితే ఆ పర్యటన వాయిదా పడిందని జీవీ ఆంజనేయులు తెలిపారు. త్వరలోనే వినుకొండ పర్యటన తేదీ ఖరారవుతుందని చెప్పారు.

పన్ను వసూలు అంతంతే..!

- చతికిల పడ్డ మునిసిపాల్టీలు
- పురాల్లో పన్ను వసూలు 43.17 శాతమే
- పన్ను వసూలు లక్ష్యం రూ.549.79 కోట్లు
- వసూలు రూ.236.82 కోట్లు
- ఇంకా బకాయిలు రూ.312.97 కోట్లు
- కలసిరాని వడ్డీ రాయితీ
- రాష్ట్రస్థాయిలో అద్దంకి ప్రథమ.. వినుకొండ ద్వితీయ స్థానం

ఆర్థిక సంవత్సరం ముగిసింది. పన్నుల వసూలుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మునిసిపాల్టీలు చతికిలపడ్డాయి. పన్ను చెల్లించేందుకు పురపౌరులు ముందుకు రాలేదు. వడ్డీ మాఫీ అమలు కూడా కలసిరాలేదు. గత ఏడాది కంటే తక్కువగా పన్ను వసూలైంది. గత ఏడాది 54.86 శాతం పన్ను వసూలు కాగా ఈ ఏడాది 43.17 శాతం పన్ను వసూలైంది. ఆస్తి, తాగునీటి పన్ను వసూలు లక్ష్యం రూ.549.79 కోట్లు, కాగా రూ.236.82 కోట్లు పన్ను వసూలైంది. ఇంకా ఆస్తి, తాగునీటి పన్ను బకాయిలు భారీగా పేరుకు పోగా రూ.312.97 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉంది. అద్దంకి, వినుకొండ మునిసిపాల్టీలు పన్ను వసూలులో రాష్ట్రస్థాయిలో మొదటి రెండుస్థానాల్లో నిలిచాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీ చిట్ట చివరన నిలిచింది.

మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా ..

మునిసిపాలిటీ	వసూలు లక్ష్యం (కోట్లలో)	వసూలు (కోట్లలో)	శాతం
పల్నాడు జిల్లా			
• నరసరావుపేట	17.86	10.34	57.90
• చిలకలూరిపేట	17.06	5.81	34.10
• వినుకొండ	5.14	4.38	85.20
• సత్తెనపల్లి	7.71	4.99	64.70
• మాచర్ల	5.98	3.15	52.70
• పిడుగురాళ్ళ	5.72	3.95	69.00
• దాచేపల్లి	2.18	1.96	90.10
• గురజాల	1.56	0.94	60.50
గుంటూరు జిల్లా :			
• గుంటూరు	279.84	110.33	39.40
• తెనాలి	26.85	16.62	61.90
• మంగళగిరి, తాడేపల్లి	37.24	25.75	69.14
• పొన్నూరు	6.12	3.93	64.20
బాపట్ల జిల్లా :			
• రేపల్లె	5.71	4.32	75.50
• బాపట్ల	9.80	5.56	56.70
• చీరాల	12.41	8.98	72.30
• అద్దంకి	4.55	3.68	80.90

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీల్లో రూ.420.01 కోట్లు ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ.214.39 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను రూ.103.38 కోట్లు కాగా రూ.22.97 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను రూ.205.62 కోట్లు, తాగునీటి పన్ను రూ.80.41 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఆస్తి పన్ను 51.04 శాతం, నీటిపన్ను 22.21 శాతం వసూలైంది. పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను 35 శాతం లోపే ఉంది. ఈ జిల్లాకు సంబంధించి మునిసిపాల్టీలలో రూ.63.17 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ.35.27 కోట్లు వసులైంది. 55.8 శాతం ఆస్తి పన్ను వసూలు చేశారు. తాగునీటి పన్ను రూ.19.62 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. నీటి పన్ను రూ.5.19 కోట్లు వసూలు చేయగా వసూలు శాతం 26.45గా ఉంది. విను కొండ ముని సిపాల్టీ 85.20 శాతం ఆస్తి పన్ను వసూ లు చేసి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. వసూలులో ముందు వరుసలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి బకా యిలు భారీగా పేరుకు పోయాయి. వడ్డీ మా ఫీ చేసినా బకాయిదారులు స్పందించలేదు.



గుంటూరు కార్పొరేషన్ సహా జిల్లాలో రూ.350.04 కోట్లు ఆస్తి పన్ను, రూ.156.07 కోట్లు నీటి పన్ను వసూలు లక్ష్యం కాగా ఆస్తి పన్ను రూ.77.68 కోట్లు, నీటి పన్ను రూ.15.63 కోట్లు వసూలు చేశారు. ఆస్తిపన్ను 44.58 శాతం, నీటిపన్ను 20.12 శాతం వసూలైంది. ఈ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం కార్యాలయాలకు సంబంధించి దాదాపు రూ.8 కోట్లు పన్ను బకాయి పేరుకుపోయింది. వీటి నుంచి పన్ను వసూలు కాలేదని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాల యాల పన్ను బకాయి రూ.30 కోట్లకు పైగా ఉండగా నామమాత్రంగానే పన్ను వసూ లైంది. గుంటూరు కార్పొరేషన్ పన్ను వసూలులో తీవ్ర నిర్లక్ష్యం నెలకొంది. 39.40 శాతమే పన్ను వసూలైంది.బాపట్ల జిల్లాలో మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను రూ.32.48 కోట్లు లక్ష్యం కాగా రూ.22.51 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను 6.80 కోట్లకు రూ.2.15 కోట్లు వసూ లైంది. ఆస్తి పన్ను 69.32 శాతం, నీటి పన్ను 31.73 శాతంగా నమోదైంది. బాపట్ల మున్సిపాల్టీ మునిసిపాల్టీలో 56.70 శాతం మాత్రమే పన్ను వసూలు చేశారు. అద్దంకి మునిసిపాల్టీ 80.90 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులకు, పన్ను వసూలుకు పొంతన లేదు. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనలకు సం బంధించిన పన్ను పక్కదారి పడుతోంది. ఉన్న ఆదాయ వనరులను వినియోగించుకోవడంలో మునిసిపల్ అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనల పన్ను ఏటా ఒక్కో మునిసిపాలిటీ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతోంది.

ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ ఆదాయాన్ని మునిసిపాలిటీలు రాబట్టుకోలేక పోతున్నాయి. అభివృద్ధి పనుల నిర్వహణ, కాంట్రాక్ట్ కార్మికుల, ఉద్యోగుల జీతాల చెల్లింపులు పుర పాలక సంఘాల్లో జాప్యం జరుగుతోంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులుబిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో పనులు నిలిచి పోతున్నాయి.

నేడు తెనాలికి జనసేనాని

- పవన్‌కల్యాణ్ పర్యటన విజయవంతం చేద్దాం
- జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులకు మనోహర్ పిలుపు

తెనాలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలిసారి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం తెనాలి రానున్నారు. ఆయన పర్యటన ఏర్పాట్లు ఒక కొలిక్కి వచ్చాయి. ప్రత్యేక హెలికాప్టర్ లో పవన్‌కల్యాణ్ సుల్తానాబాద్ చేరుకుంటారు. అక్కడి నుంచి వారాహి వాహనంలో తెనాలి పట్టణంలో పర్యటించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం మార్కెట్ సెంటర్‌లో జరిగే సభలో పాల్గొంటారు. ఇప్పటికే రూట్‌మ్యాప్‌ను నాయకులు సిద్ధం చేశారు. ఇక వారాహి వాహనం మంగళవారం రాత్రికే తెనాలికి చేరుకుంది. దీనిని చూసేందుకు పవన్ అభిమానులు పెద్దసంఖ్యలో గుమికూడారు. పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చెయ్యాలని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలి రావాలని కోరారు. సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ పనులను మనోహర్ పరిశీలించారు. హెలిప్యాడ్ దగ్గర నుంచి ర్యాలీగా ఎట్లా వెళ్లాలి? రూట్ మ్యాప్, జనం రద్దీ వంటివాటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై కొద్దిసేపు మిగిలిన నాయకులతో సమీక్షించారు. తర్వాత బహిరంగసభ జరగనున్న మార్కెట్ సెంటర్‌ను కూడా పరిశీలించారు. జనానికి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సభ జరగాలని నేతలకు ఆయన సూచించారు. ఎన్నికల నేపథ్యంలో తొలిసారి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పవన్ పర్యటించనుండటంతో గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి కూడా జనం భారీగా రావచ్చనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవన్ పర్యటనే ఒక పండుగలా ఉంటుందని మనోహర్ చెప్పారు. తెనాలి అభివృద్ధికి చేపట్టబోయే కార్యాచరణపైపవన్ నుంచి హామీ ఉంటుందనే ఆశాభావాన్ని పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. మనోహర్‌తోపాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు స్థానిక నాయకులు ఏర్పాట్ల పరిశీలనలో పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మనోహర్, గాదె తదితరులు



తెనాలి చేరుకున్న వారాహి వాహనం

ప్రకాశం జిల్లా ఎస్పీపై వేటు

విధుల నుంచి తప్పించి కొరడా ఝుళిపించిన ఈసీ



పరమేశ్వరరెడ్డి

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 2 : ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపించిది. ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డిపై బదిలీ వేటు వేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులను జారీచేసింది. దీంతో మంగళవారం సాయంత్రం హడావుడిగా బాధ్యతలను ఏఎస్పీ కె.నాగేశ్వరరావుకు అప్పజెప్పి ఎస్పీ రిలీవ్ అయ్యారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి తిరుపతి నుంచి ప్రకాశం జిల్లాకు రావడమే అనేక ఆరోపణలు వచ్చాయి. వైసీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ప్రకటించడంతోనే ఎస్పీగా పనిచేస్తున్న మలికగర్గ్‌ను బదిలీ చేసి తిరుపతి ఎస్పీగా పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డిని ఇక్కడ నియమించారు. ఫిబ్రవరి నెలలో ఈ బదిలీ జరిగింది. దీంతో ఈ బదిలీ వ్యవహారం చర్చనీయాంశమైంది. అయినప్పటికి ప్రభుత్వ ఉత్యర్వుల మేరకు ఫిబ్రవరి 12న పరమేశ్వరరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. అదేసమయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పరమేశ్వరరెడ్డిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే గత నెలలో చిలకలూరిపేట వద్ద జరిగిన ప్రధానమంత్రి సభకు ట్రాఫిక్ ఇన్‌చార్జిగా ఉన్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి విధి నిర్వహణలో వైఫల్యం చెందారని ఫిర్యాదులు వచ్చాయి. ఆ సభకు గ్రామస్థులను తరలించాడని గిద్దలూరు మండలానికి చెందిన గిరిజన యువకుడు మునయ్య ను వైసీపీ వర్గీయులు దారుణంగా గొడ్డలితో నరికిచంపారు. తనను హత్య చేస్తామని వైసీపీ వారి బెదిరింపు ఫోన్ రికార్డింగ్‌ను గతంలో బాధితుడు పోలీసులకు ఇచ్చారు. అయినప్పటికి పోలీసు యంత్రాంగం సకాలంలో స్పందించనందునే ఈ హత్య జరిగిందని బాధిత కుటుంబం ఆరోపించింది. అదేక్రమంలో జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షణలో పోలీసు వైఫల్యంపై ఎన్నికల కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసి నేరుగా తన ముందు హాజరు కావాలని ఎస్పీని ఆదేశించారు. దీంతో హత్యకు గల కారణాలపై ఎస్పీ వివరణ ఇచ్చారు. ఇలా ఎస్పీ వరుస వైఫల్యాలను పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసింది. అంతేకాకుండా కోడ్ ముగిసే వరకు ఎన్నికల విధులకు దూరంగా ఉంచమని ఆదేశాలు ఇచ్చింది..

24నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 2 : రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలకు ప్రభుత్వం ఈనెల 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం ఈనెల 23న పాఠశాలలకు చివరి పనిదినం. జూన్ 11 వరకు పాఠశాలలకు వేసవి సెలవులు. 2024-25 విద్యా సంవత్సరానికి పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభమవుతాయి. స్టేట్ సిలబస్ పాఠశాలలకు మాత్రమే ఈ సెలవులు వర్తిస్తాయని పేర్కొన్నారు.

దొంగ ట్రాక్టర్ల విక్రయం.. కొన్నరైతుల్లో భయం

దర్శి ప్రాంతంలో 20కిపైగా అమ్మకం

నమ్మించి మోసం చేస్తున్న మాయగాళ్లు



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్లు

దర్శి, ఏప్రిల్ 2 : రాయలసీమకు చెందిన కొంతమంది మాయగాళ్లు.. రైతులను నమ్మించి మోసం చేస్తునారు. అక్కడ రైతులను మాయ చేసి తెచ్చిన ట్రాక్టర్లను ఇక్కడి రైతులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తక్కువ ధరకు ట్రాక్టర్లు రావడంతో ఎలా వచ్చాయనేది ఆలోచించకుండా కొంతమంది అమాయకంగా దొంగ ట్రాక్టర్లను కొనుగోలు చేసి మోసపోయారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పోలీసులు దర్శి, పొదిలి, దొనకొండ ప్రాంతాలో ముమ్మరంగా గాలించి దొంగతనంగా విక్రయించిన 14 ట్రాక్టర్లను ఇప్పటికే పట్టుకున్నారు. కడప, అనంతపురం జిల్లాలకు చెందిన కొందరు అక్రమార్కులు ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన రైతుల ట్రాక్టర్లను ఫ్యాక్టరీల్లో పనుల కోసం అద్దెకు ఇవ్వాలని నమ్మించి తీసుకుంటున్నారు. వీళ్ల డ్రైవర్లే ట్రాక్టర్లు తోలుకునే విధంగా నెలకు రూ.25వేలు బాడుగ ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అధిక మొత్తంలో బాడుగ లభిస్తుండడంతో యజమానులైన కొంతమంది రైతులు అక్రమార్కులను నమ్మి ట్రాక్టర్లు అప్పగించారు. ఒకటి రెండు నెలలు నమ్మకంగా బాడుగ ఇస్తూ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డారు. వారిని చూసి మరికొంత మంది రైతులు ట్రాక్టర్లు బాడుగకు ఇచ్చారు. ఇదే అదునుగా అక్రమార్కులు కొంతమంది బ్రోకర్ల ద్వారా దర్శి - పొదిలి ప్రాంతాల్లోని రైతులకు ఒక్కో ట్రాక్టర్‌ను రూ.2లక్షల చెప్పున విక్రయించారు. తక్కువ ధరలకు ట్రాక్టర్లు దొరికాయని ఇక్కడ రైతులు సంబరపడుతున్న సమయంలో సత్యసాయి జిల్లాకు చెందిన పోలీసులు వచ్చి తనిఖీలు నిర్వహించారు. అక్కడ రైతులు తమ ట్రాక్టర్లు బాడుగ పేరుతో చెప్పి ఇతర ప్రాంతాల్లో వినియోగించారనే ఫిర్యాదుతో ట్రాక్టర్ల గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అక్కడ విక్రయించిన అక్రమార్కులను వెంటబెట్టుకొని వచ్చి ఇక్కడ ఏఏ ప్రాంతాల్లో ట్రాక్టర్‌లను విక్రయించారో సమాచారం తెలుసుకున్నారు. ఇప్పటి వరకు దర్శి మండలంలో నాలుగు, తాళ్లూ రు మండలంలో రెండు, పొదిలి మండలంలో నాలుగు, దొనకొండ మండలంలో రెండు ట్రాక్టర్లు దొరికాయి. ఇంకా వినుకొండ ప్రాంతాల్లో పలు ట్రాక్టర్లను అమ్మినట్లు తెలిసింది. ఈ ముఠా మొత్తం ఎన్ని ట్రాక్టర్లను విక్రయించారో అన్న విష యం తెలుసుకునేందకు అన్ని గ్రామాల్లో పోలీసులు తిరుగుతున్నారు. ట్రాక్టర్ల అక్రమ విక్రయ వ్యవహారం బయట పడటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం ఎవరైనా ట్రాక్టర్లు కొనుగోలు చేయాలంటే ఆ ప్రాంతానికి వెళ్లాలంటే భయపడుతున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వై'చీప్' ట్రిక్స్

వైసీపీ కార్యాలయం



గిద్దలూరులో బెదిరింపులు

మార్కాపురంలో నీళ్ల రాజకీయం

వైసీపీ నేతల బరితెగింపు వ్యవహారాలు

కదలని పార్టీ కేడర్.. పలకని ఓటర్లు..

పాలోమని టీడీపీ కూటమిలోకి వలసలు

సమస్యలు పట్టవా అంటూ నిలదీస్తున్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు లోక్‌సభ పరిధిలో బెదిరింపు రాజకీయాలు ప్రారంభమయ్యాయి. గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో ఆ వ్యవహారాలు ఎక్కువయ్యాయి. ప్రధానంగా ఎమ్మెల్యేలను మార్చి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులుగా జగన్ ఆ స్థానాల్లో రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. దీనికి తోడు ఎంపీ మాగుంటను తప్పించి తిరుపతి జిల్లా నుంచి దిగుమతి చేసుకున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారు. అయితే జగన్ వ్యూహంకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలి అభ్యర్థులు బిత్తరపోయారు. తొలుత ఓటర్లను ప్రసన్నం చేసుకోవటం కన్నా పార్టీ కేడర్‌ను దారిలోకి తెచ్చుకోవటానికే రకరకాల ప్రలోభాలకు పాల్పడాల్సి వచ్చింది. ఆరంభంలోనే అదురుపోయిన ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి ఇచ్చిన ఆదేశాలతో పార్టీ నేతలకు డబ్బులతో వల విసిరారు. పార్టీ కౌన్సిలర్లకు గిద్దలూరులో రూ.2లక్షలు, మార్కాపురంలో లక్ష ప్రకారం డబ్బులు ఇచ్చారు. మార్కాపురంలో ఒకొక్కరికీ మరో రూ.2లక్షలను, గిద్దలూరులో మరో లక్ష ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. కేవలం కౌన్సిలర్లకు డబ్బులు ఇవ్వటంతో ఆ వార్డుల్లోని పార్టీలోని క్రియాశీల రాజకీయ నాయకులు ఎదురుతిరిగారు. దీంతో మార్కాపురంలో కౌన్సిలర్లను పిలిచి ప్రతి వార్డులో ఐదుగురు కార్యకర్తలకు ఒకొక్కరికి రూ.10వేలు ప్రకారం ఇవ్వమని చెప్పి ఆ మేరకు డబ్బులు ఇచ్చారు. గిద్దలూరు నియోజకవర్గంలో గ్రామాల నుంచి పోటీపెరగటంతో ప్రస్తుతం వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కూడా భారీగా ముట్టజెప్పేందుకు నిమగ్నమయ్యారు.

గిద్దలూరులో బెదిరింపు రాజకీయాలు

గిద్దలూరులో బెదిరింపు రాజకీయాలకు వైసీపీ శ్రీకారం పలికింది. ఈ నియోజకవర్గంలో ఏడాదిన్నర కాలం నుంచి టీడీపీలోకి వలసలు పెరిగాయి. టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి పకడ్బందీగా పెంచుకున్న ప్రజాసంబంధాలు అందుకు కారణమయ్యాయి. వైసీపీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరు అభ్యర్థిగా దింపటం ఆ తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో వలసల ప్రభావం పెరిగిపోయింది. దీంతో బెదిరింపు రాజకీయాలకు శ్రీకారం పలికారు. ఇటీవల మునయ్య అనే గిరిజన యువ నాయకుడిని వైసీపీకి చెందిన వారు పథకం ప్రకారం హత్యచేసిన విషయం తెలిసిందే. మునయ్య ఏడాదిన్నర క్రితం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ హత్యతో వలసలకు బ్రేక్ పడుతుందనే అధికారపార్టీ నేతల ఆశలు గల్లంతై ఇంకా రెట్టింపయ్యాయి. ఇటీవల వైసీపీలోని ఒక బీసీ వర్గానికి చెందిన నాయకులు ఒక రెడ్డి సామాజికవర్గం నాయకుడు టీడీపీలో చేరబోతున్నట్లుగా ప్రచారం జరిగింది. అందులో ఒకరితో వైసీపీ అభ్యర్థి సమీప బంధువు సమావేశమై.. ఈసారికి పోటీ ఉంటుంది. లారీ వచ్చి ఢీకొంటుంది. కట్ చేస్తే అందులో మీరు ప్రాణాలతో ఉండరంటూ ఒక సినిమా కథ చెప్పి బెదిరించినట్లు తెలిసింది. దీనికి ఆ నాయకుడు కూడా దీటుగానే స్పందిచినట్లు తెలిసింది. మనందరీ ప్రాణాలు ఎప్పుడైనా పోయావే.. కానీయండి చూద్దామని గట్టిగా సమాధానమిచ్చినట్లు సమాచారం. ఇదేసమయంలో ఆదివారం బేస్తవారపేటలో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన ప్రముఖులంతా టీడీపీలో చేరారు. ఉదయం అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరినా రాత్రి ఎంపీ మాగుంట, అశోక్‌రెడ్డి కలిసి పాల్గొన్న కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో బిత్తరపోయిన వైసీపీ అభ్యర్థి, ముఖ్య నాయకులు హుటాహుటిన బీపేట చేరారు. ఆర్యవైశ్యులంటే చులకనభావం కాబోలు పార్టీ మారిన వారిని వెనక్కు రండి అంటూ హుకుం జారీచేసినట్లు తెలిసింది. తదనుగుణంగా పలురకాలుగా బెదిరింపు సంకేతాలు వెళ్లినట్లు సమాచారం. సోమవారం ఉదయాన్నే అభ్యర్థి నాగార్జురెడ్డి ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి మరికొందరు ముఖ్య నాయకులు బీపేటకు చేరారు. కొంతసేపటికి వారు పార్టీ మారిన బొంతల లక్ష్మణ్ అనే నాయకుడి ఇంటికి చేరారు. ఒక అరగంట తర్వాత ఆయన మెడలో తిరిగి వైసీపీ కండువా వేసి ఆయన్ను ఆయన సతీమణి పార్టీలోనే ఉంటున్నట్లు ప్రకటింపజేసి సోషల్ మీడియాలో సమాచారం ఇచ్చారు. ఈ బెదిరింపు చర్యలను ఈసడించుకున్న మిగిలిన ఆర్యవైశ్య ప్రముఖుల వారి ఇంటికి వెళ్లేసరికి అక్కడ లక్ష్మణ్ దంపతులు కనిపించలేదు. వారిని వైసీపీ నాయకులే ఎవరికీ అందుబాటులో ఉంచకుండా తీసుకెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో సోమవారం సాయంత్రానికి లక్ష్మణ్ విషయమై ఆర్యవైశ్యులు వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమ ప్రాంతంలో వైసీపీ నేతలు బరితెగించారు. గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీలోకి ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన వలసలు ఎన్నికల షెడ్యూల్ ప్రకటన అనంతరం భారీగా పెరిగిపోయాయి. తాయిలాలు ఆశచూపినా ఆగని వలసలతో వైసీపీ అభ్యర్థి పక్షాన పనిచేస్తున్న ముఖ్యనాయకులు బెదిరింపు రాజకీయాలకు తెగబడుతున్నారు. మార్కాపురంలో తాగునీటి సమస్యతో సతమతమవుతున్న ప్రజలు 'మా ఎమ్మెల్యే ఏడి.. మా సమస్యలు పట్టవా' అంటూ నిలదీస్తున్నారు. దీంతో హడావుడిగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే ప్రలోభ రాజకీయాలకు వైసీపీ తెరతీసింది. ఇదేసమయంలో పార్టీలోని కిందిస్థాయి పదవుల్లో ఉన్న నాయకులను క్రియాశీలకం చేసుకునేందుకు వారి జేబులు నింపే చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో రెండు నియోజకవర్గాల్లో ప్రజలు వైసీపీ నేతల వ్యవహారశైలిని చూసి విస్తుపోతున్నారు.

నీళ్ల రాజకీయం

మార్కాపురంలో నీళ్ల రాజకీయం తారస్థాయికి చేరింది. ఇక్కడ ఎమ్మెల్యేను గిద్దలూరు పంపిన జగన్ ఎమ్మెల్యే రాంబాబును మార్కాపురం అభ్యర్థిగా రంగంలో దించారు. మార్కాపురం పట్టణానికి మంచినీటి సరఫరా చేసే పైప్‌లైన్ కొద్దిరోజుల క్రితం దెబ్బతింది. దానిపై స్పందించి వెంటనే మరమ్మతులు చేసే వారు కరువయ్యారు. మార్కాపురంలో తీవ్రమైన నీటి సమస్య ఎదురుకావటంతో ప్రచారానికి వెళ్లిన వైసీపీ నాయకులకు నిలదీతలు ఎదురయ్యాయి. మా ఎమ్మెల్యే ఎక్కడ అంటూ పట్టణవాసులు ప్రశ్నించారు. సమాధానం చెప్పలేకపోయిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చివరకు ఎంపీ అభ్యర్థి రంగంలోకి వచ్చి ట్యాంకర్ ఏర్పాటు చేశారు. ఉభయకుశలోపరి అన్నట్లుగా కౌన్సిలర్లు, ఇతర ముఖ్యనాయకులను పిలిచి 'మీరే వాహనం పెట్టుకోండి, నేను ఒకొక్క ట్రిప్పునకు రూ.450 ఇస్తా, వార్డుకు రోజువారీ 10 ట్రిప్పులు సరఫరా చేయాలి. అందులో వచ్చే ఆదాయంతో మీరు జల్సా చేయండి' అంటూ ఆదేశాలు ఇచ్చారు. ఆ తర్వాత ట్రిప్పునకు రూ.450కాదు, రూ.300 ఇస్తానంటూ మాట మార్చారు. అలాగైతే తమకు నష్టం వస్తుందంటూ కౌన్సిలర్లు, నాయకులు ఎదురుతిరిగారు. మధ్యవర్తుల రాయబారాల అనంతరం ట్రిప్పునకు రూ.400 ప్రకారం చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. ఆ విధంగా నీటి ట్యాంకర్ అద్దె, డ్రైవర్ ఖర్చుతో రూ.300కు తోలేందుకు యజమానులతో మాట్లాడుకున్నారు. అయితే నీటిని మారుమూల రైతుల పొలాల్లో కొనుగోలు చేస్తే ఖర్చవుతుందని మున్సిపాలిటీ బోర్ల నుంచే ఇచ్చేవిధంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ నీరు ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతుందో కానీ ఒకొక్క ట్రిప్పునకు రూ.400 ఇస్తే అందులో రూ.100 కౌన్సిలర్లు, స్థానిక నాయకులు జేబులోకి వెళ్తాయి. అయితే రోజుకు ఒకొక్కరు 10 ట్రిప్పులు మించి నీటి సరఫరా చేయకూడదంటూ షరతు విధించారు. మంచినీటి సరఫరాకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోకపోగా ఈ నీళ్ల రాజకీయం ఏంటి అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇళ్ల వద్దనే పింఛన్లు ఇవ్వాలి

టీడీపీ, మిత్రపక్షాల డిమాండ్

అధికారులకు వినతిపత్రాలు అందజేత

ఒంగోలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులను సచివాలయాలకు పిలవకుండా ఇళ్ల వద్దనే వారికి పింఛన్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ, మిత్రపక్షాలు డిమాండ్ చేశాయి. అందుకోసం సచివాలయ సిబ్బందిని ఇళ్లకు పంపించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో వలంటీర్లు పింఛన్లు అందజేస్తుండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో వారిని ఆ విధులకు దూరంగా ఉంచాలని ఈసీ ఆదేశించింది. ప్రత్యామ్నాయ చర్యలకు ప్రభుత్వాన్ని కోరింది. 1వతేదీకి బదులు 3వతేదీ నుంచి సచివాలయాల వద్ద లబ్ధిదారులకు పింఛన్లు అందజేసేలా ప్రభుత్వం ఆదేశించింది. అదే సమయంలో పింఛన్ల పంపిణీని టీడీపీ అడ్డుకుంటున్నదని వైసీపీ విషప్రచారం చేపట్టింది. ఈ వ్యవహారంపై టీడీపీ మండిపడింది. ఎన్నికల వేళ ఖజానాలో ఉన్న సొమ్మును తమకు అనుకూలురైన కాంట్రాక్టర్లకు ఇచ్చేసిన వైసీపీ ప్రభుత్వం పింఛన్ల చెల్లింపులకు డబ్బు లేకుండా చేసి దానిని బయటకు రాకుండా ఉండేలా టీడీపీపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. సచివాలయాల సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఒక రోజులోనే ఇచ్చే అవకాశం ఉన్నా అందుకు విరుద్ధంగా లబ్ధిదారులను సచివాలయాలకు రావాలని, వారంరోజుల పాటు పంచుతామని జెప్పి టీడీపీపై విషప్రచారం చేసే కుట్ర చేస్తున్నదని పార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. తక్షణం ఇళ్ల వద్దకే సిబ్బంది వెళ్లి పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం టీడీపీశ్రేణులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అందులోభాగంగా జిల్లావ్యాప్తంగా వినతిపత్రాలు అందించిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నిరసన తెలిపారు. ఒంగోలులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జీ వైసీ యోగయ్య యాదవ్‌లు కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలాగే నాగులుప్పలపాడు, సంతనూతలపాడు, టంగుటూరు. జరుగుమల్లి, తాళ్ళూరు. పామూరు, గిద్దలూరు అర్ధవీడు, కంభం, వెలిగండ్ల, ముండ్లమూరు, ఎర్రగొండపాలెం, మార్కాపురం, తర్లుపాడులతో పాటు పలు ఇతర మండలాల్లోనూ టిడిపి మిత్రపక్షాల నేతలు అక్కడి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



సింగరాయకొండలో ఎంపీడీవోకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

రూ.లక్ష ఇస్తారా.. కేసు పెట్టమంటారా!

టీడీపీ సర్పంచ్ తనయులకు ఎస్సై హెచ్చరిక

రూ.70వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

టంగుటూరు, ఏప్రిల్ 2 : అనుమతులు లేకుండా బ్యారన్ నిర్మిస్తున్న వైసీపీకి చెందిన ఓ రైతుపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన టీడీపీకి చెందిన గ్రామ సర్పంచ్ తనయుడిపై ఎస్సై నాగేశ్వరరావు జులుం ప్రదర్శించారు. ఆయన్ను దుర్భాషలాడారు. ఫిర్యాదు కూడా తీసుకోకుండా పంపించారు. అదేసమయంలో నిబంధనలకు విరుద్ధంగా బ్యారన్ నిర్మిస్తున్న రైతు నుంచి సర్పంచ్ కుమారులు బెదిరిస్తున్నారని ఫిర్యాదు తీసుకున్నారు. అనంతరం ఆమె పెద్ద కుమారుడిని స్టేషన్‌కు పిలిపించారు. రూ.లక్ష ఇస్తే కేసు లేకుండా చేస్తానని బేరానికి దిగారు. చివరికి రూ.70వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కాకుటూరివారిపాలెంలో వైసీపీకి చెందిన ఓ రైతు అనుమతి లేకుండా పొగాకు బ్యారన్లు నిర్మిస్తుండటంపై కొద్దిరోజుల క్రితం అప్పటి పంచాయతీ కార్యదర్శి సాంబయ్య ఎస్ఐ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. అయితే సర్పంచ్ ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటానని ఎస్ఐ స్పష్టం చేశారు. టీడీపీకి చెందిన సర్పంచ్ వృద్ధురాలు కావడంతో ఆమె తరఫున కుమారుడు వెంకట్రావు స్టేషన్‌కు వెళ్లగా ఆయనపై ఎస్ఐ సీరియస్ అయ్యారు. 'నువ్వెవడ్రా.. నువ్వెందుకొచ్చావు' అని దుర్భాషలాడాడు. తాను సర్పంచ్ కుమారుడినని, తన తల్లి ఏడు పదుల వయస్సులో ఉండి రాలేకపోవడంతో ఆమె తరఫున ఫిర్యాదు తెచ్చానని వెంకట్రావు చెప్పాడు. దీంతో ఎస్ఐ మరింత రెచ్చిపోయాడు. వెంకట్రావును తీవ్రంగా అవమానించి నేరుగా సర్పంచ్ వచ్చి ఫిర్యాదు ఇస్తేనే తీసుకుంటానని స్పష్టం చేశాడు. దీంతో వెంకట్రావు వెళ్లిపోయారు. ఇంతలో అక్రమంగా బ్యారన్ నిర్మిస్తున్న మార్బూరి వెంకట్రావు తనను సర్పంచ్ తనయులు కొమ్మినేని వెంకట్రావు, శ్రీనివాసరావు బెదిరిస్తున్నారని ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్పంచ్ తనయుడు వెంకట్రావును స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై.. 'బ్యారన్లు నిర్మిస్తున్న వెంకట్రావును మీరు బెదిరిస్తున్నట్లు అతని నుంచి ఫిర్యాదు వచ్చింది. దీనిపై కేసు నమోదు చేస్తున్నా' అని స్పష్టం చేశారు. కేసు పెట్టకుండా ఉండేందుకు రూ.లక్ష డిమాండ్ చేశాడు. అందుకు ఆయన అంగీకరించాడు. సర్పంచ్ రెండో కుమారుడైన శ్రీనివాసరావు తొలివిడత గతనెల 29న ఎస్సైకి రూ.30వేలు ఇచ్చారు. ఆ మొత్తాన్ని బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల వద్ద ఉన్న ఓ కేఫ్‌లో ముట్టజెప్పారు. మిగిలిన డబ్బులు త్వరగా ఇవ్వాలని ఎస్ఐ హుకుం జారీ చేశారు. దీంతో సర్పంచ్ తనయులు వెంకట్రావు, శ్రీనివాసరావు ఈనెల 1న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు మంగళవారం సర్పంచ్ రెండో కుమారుడు శ్రీనివాసరావు టంగుటూరు వచ్చారు. అనంతరం ఎస్ఐకి ఫోన్ చేశారు. డబ్బులు తెచ్చాను, ఎక్కడికి రమ్మంటారని ఆయన్ను అడిగారు. స్థానిక చెల్లమ్మతోటలోని తన నివాసానికి రావాలని ఎస్ఐ సూచించారు. దీంతో శ్రీనివాసరావు నేరుగా అక్కడికి వెళ్లారు. ఎస్ఐకు రూ.70వేలు ఇవ్వగా ఆ మొత్తాన్ని ఆయన కారులో పెట్టుకున్నాడు. అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆయన తీసుకున్న రూ.70వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు అపర్ణ, శేషు, ఎస్సైలు జేబీఎన్ ప్రసాద్, మస్తాన్‌షరీఫ్ ఉన్నారు.

వైసీపీ రాజీ.. డ్రామా

వలంటీర్‌గా వద్దు.. వైసీపీ కార్యకర్తగా పనిచేయండి

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వలంటీర్లు విధుల్లో ఉండటానికి వీల్లేదని ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వైసీపీ నేతల్లో కలవరం మొదలైంది. ఈ ఎన్నికల్లో డివిజన్లలో పార్టీ ప్రచార కార్యక్రమాలకు కీలకంగా వ్యవహరించే వలంటీర్లు దూరంగా ఉండటం ఇష్టం లేని వైసీపీ నేతలు కొత్త ఎత్తుగడలకు తెరతీశారు. ఇప్పటికే వలంటీర్‌కు వందనం అంటూ బహుమతులు భారీగా అందజేయడంతోపాటు, నగదు కూడా అందించారు. తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. అయితే వారి ఎత్తులకు ఈసీ చెక్ పెట్టి ప్రచారంలో కనిపించకూడదని హెచ్చరించడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఈ మేరకు వలంటీర్ ఉద్యోగం మేమే ఇచ్చాము. ఇప్పుడు పోస్టు వద్దు వైసీపీ కార్యకర్తలుగా పనిచేయండంటూ ఆదేశాలు జారీచేశారు. పలువురు వలంటీర్లు తమ ఉద్యోగాలను వదిలేస్తూ రాజీనామా డ్రామాలకు తెరతీశారు. నిబంధనల ప్రకారం స్వచ్ఛందంగా వారు పని చేసే సచివాలయ అడ్మిన్ అధికారికో, వారిపై ఉన్నతాధికారి కార్పొరేషన్ కమిషనర్‌కు తమ రాజీనామా పత్రాలు అందజేయాలి. మంగళవారం 21 డివిజన్ పరిధిలోని 31, 32 సచివాలయాలలో పనిచేసే 28 వలంటీర్లు తమ సేవలకు స్వస్తి చెప్పారు. ఆ డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజు మాత్రం అత్యుత్సాహం చూపి, నిబంధనలను మరిచిపోయారు. ఆయనే అందరినీ ఒకచోట చేర్చి రాజీడ్రామాకు తెరతీశారు. కొందరిపై ఒత్తిడి తీసుకొచ్చి పోస్టు వదిలేయండి.. మా కార్యకర్తలుగా పనిచేయండి అంటూ కొత్త డ్రామాలు మొదలు పెట్టారు. ఈ రెండు నెలలపాటు మీకు అందించే పారితోషికం పార్టీ నుంచి అందిస్తామని చెప్పడం ఇక్కడ విశేషం.

విద్యాశాఖలో మెమోల కలకలం

మూల్యాంకన విధులకు హాజరైన వారికీ అందాయి

సబ్జెక్టు టీచర్లు కాని వారికి మూల్యాంకన ఉత్తర్వులు

అధికారుల తీరుపై భగ్గుమంటున్న టీచర్లు



ఒంగోలు(విద్య), ఏప్రిల్ 2 : స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూలులో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి హాజరుకాని 284 మంది టీచర్లకు మెమోలు జారీచేయడం జిల్లా విద్యాశాఖలో కలకలం రేపింది. మూల్యాంకన విధులకు మొత్తం 1,200 మంది ఉపాధ్యాయులను నియమించగా వీరిలో కొందరు మూల్యాంకన విధులకు డుమ్మాకొట్టారు. తెలుగు, హిందీ, బయాలజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు సంబంధించి 72మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 12మంది స్పెషల్ అసిస్టెంట్లు మొత్తం 84మంది మాత్రమే నికరంగా అవసరం ఉంది. ఇతర సబ్జెక్టుల్లో అందరూ సరిపోయారు. అయితే మొత్తం అన్ని సబ్జెక్టులకు సంబంధించి మూల్యాంకనానికి హాజరుకాని టీచర్లకు మెమోలు జారీచేయడం ఉపాధ్యాయుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఒక వేళ ఆ నాలుగు సబ్జెక్టులు మినహా ఇతరులు స్పాట్‌కు వచ్చినా వారు అదనమై వెనుతిరగాల్సి వచ్చేది. అవసరమున్న సబ్జెక్టులకు మాత్రమే మెమోలు ఇచ్చి స్పాట్‌కు రప్పించి ఉంటే సరిపోయేది. కానీ అందరికి మెమోలు జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పేపర్లు దిద్దేందుకు తమకు అర్హత లేకపోయినా స్పాట్‌కు రమ్మని ఉత్తర్వులు ఇవ్వడమే కాకుండా, రానందుకు తాఖీదులు ఇవ్వడం ఏమిటని టీచర్లు మండిపడుతున్నారు. సీఈలు, ఏఈలను సంబంధింత ఉప విద్యాధికారులు నియమిస్తుండగా, స్పెషల్ అసిస్టెంట్లను మాత్రం ఎంఈఓలు ఇచ్చిన జాబితాల ప్రకారం ఇచ్చారు. మూల్యాంకన విధులకు హాజరై పేపర్లు దిద్దుతున్న తమకు మెమోలు జారీ చేయడమేమిటని కొందరు టీచర్లు ప్రశ్నిస్తున్నారు మొత్తంగా మెమోలు జారీచేయడంలో అధికారులు వ్యవహరించిన తీరు టీచర్లపై కక్షసాధింపు చర్యగా ఉందని టీచర్లు ఆక్షేపిస్తున్నారు.

- ఒంగోలు, ఎస్ఎన్‌పాడు మండలాల్లోని జడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు కొందరు స్పాట్‌కు హాజరైనా గైర్హాజరైనట్లు భావించి వారికి మెమోలు జారీచేశారు

- చీమకుర్తి మండలంలోని ఒక జడ్పీ హైస్కూలు కొత్తగా అప్‌గ్రేడ్ అయింది. అక్కడ ప్రస్తుతం 9వ తరగతి వరకు మాత్రమే ఉంది. అయితే ఆ పాఠశాల టీచర్‌కు కూడా పదవతరగతి పేపర్లు దిద్దేందుకు నియమించారు. వారిలో కొందరు స్పాట్‌కు హాజరైన పేపర్లు దిద్దుతుండగా హాజరు కాని వారికి మెమోలు ఇచ్చారు.

-కొత్తపట్నం మండలంలో ఒక ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఇద్దరు మహిళా టీచర్లకు స్పెషల్ అసిస్టెంట్లుగా డ్యూటీ వేశారు. ఒకరు స్పాట్ హాజరుకాగా ఒకరు పాఠశాల మూతపడకుండా విధులు నిర్వహించారు. అయితే ఆ పాఠశాలలో ఉన్న టీచర్‌కు కూడా మెమో ఇవ్వడం గమనార్హం.

-అధికారుల అనుమతితో అమెరికా వెళ్లిన ఒక టీచర్‌కు కూడా స్పాట్‌కు నియమించారు. హాజరు కానుందుకు ఆయనకు మెమో ఇచ్చారు.

- కొత్తగా అప్‌గ్రేడ్ అయిన ఒక హైస్కూలులో ఈ సంవత్సరమే టెన్త్ వచ్చింది. ఆ పాఠశాలలో పదవ తరగతి బోధిస్తున్న టీచర్‌కు స్పాట్ వేశారు. ఆ టీచరు హాజరు కానుందుకు ఆయనకు మెమో ఇచ్చారు.

- అధికారుల అనుమతితో మూల్యాంకన విధులకు హాజరుకాని వారికి కూడా మెమోలు జారీ చేయడం విడ్డూరంగా ఉంది. అధికారుల అనాలోచితంగా జారీచేసిన మోమోలు టీచర్లకు తీవ్ర మనోవేదనను మిగిల్చాయి.

ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలి



కొప్పెరపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

- రాష్ట్రం బాగుపడాలంటే తిరిగి టీడీపీ రావాలి
- అన్నివర్గాల ప్రజలకు వైసీపీపై విసుగుపుట్టింది
- కొప్పెరపాడు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, ఏప్రిల్ 2: గత ఐదేళ్ల కాలంలో అన్నివర్గాల ప్రజలకు వైసీపీ తీవ్రంగా మోసం చేసిందని, రానున్న ఎన్నికలలో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో ఎమ్మెల్యే రవికుమార్ ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఉన్న దేవాలయాలు, చర్చిల లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ కొత్తపరిశ్రమలు రావాలన్నా, రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలన్నా తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అబద్ధపు మాటలతో ప్రజలను మోసంచేసిన జగన్ కొత్త అబద్ధాలను మరలా చెప్పేందుకు బస్సు యాత్రను చేపట్టారని అన్నారు. గత ఎన్నికల అనంతరం మద్య నిషేధం చేయకుండా మరలా ప్రజలను ఓటు అడగను అని చెప్పి, మరలా ఏ మొహం పెట్టుకొని ప్రజలను ఓటు అడుగుతున్నారని అన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికలలో వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

ఎంతో అనుభవశాలి అయిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడుతుందని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ ద్వారా అన్నివర్గాల వారికి ప్రయోజం కలిగేలా ప్రత్యేక మేనిఫెస్టోను టీడీపీ రూపొందించిందని చెప్పారు. వృద్ధులకు టీడీపీ ప్రభుత్వం రెండు వేలు చొప్పున పింఛన్ అందించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం కేవలం ఒక వెయ్యిని నాలుగు సంవత్సరాల్లో పెంచిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వృద్ధులకు, వితంతువులకు నెలకి నాలుగు వేల చొప్పున పింఛన్ అందిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీని చంద్రబాబు నాయుడు మొదటి సంతకం చేస్తానని చెప్పిన విషయం గమనించాలన్నారు. కొప్పెరపాడు గ్రామంలో గతంలో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు ఏర్పాటుచేసిన విషయాన్ని ప్రజలకు ఆయన గుర్తు చేశారు. మైనారిటీలపై దాడులు రోజురోజుకు పెరిగాయన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 78 మందిపై దాడులు జరిగాయన్నారు. టీడీపీ ప్రభుత్వం మైనారిటీలకు రక్షణ కల్పిస్తుందని చెప్పారు.

అనంతరం గ్రామ నేతలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు రానున్న నలభై రోజులు కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రచారానికి ఎమ్మెల్యే రావటంతో గ్రామంలోని ప్రజలు పెద్దఎత్తున అయన వెంట ఇంటింటికి తిరిగారు. పలు వీధులలో అయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో యువనాయకులు గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబి), మండల పార్టీ నేతలు కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, గొట్టిపాటి శంకర్, షేక్ అబ్దుల్లా, నాగినేని సాంబు, మక్కెన శ్యామలరావు, గుంజి జీవరత్నం, వరదరాజులు, షేక్ వలి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన సంతమాగులూరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు

సంతమాగులూరులో వైసీపీకి షాక్

సంతమాగులూరు, ఏప్రిల్ 2: మండల కేంద్రమైన సంతమాగులూరులో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మంగళవారం అడ్డరోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. అట్లా చినవెంకట రెడ్డి ఆధ్వర్యంలో సంతమాగులూరుకు చెందన వైసీపీ నాయకులు మెరుగుపల్లి సత్యాలు, మెరుగుపల్లి రాజశేఖర్, పగిడి పల్లి మస్తాన్, మెరుగుపల్లి రవి, సత్యానందం, పగిడిపల్లి జక్రయ్య తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు.

ఇంటింటికీ పెన్షన్లు పంపిణీ చేయాలి

చినగంజాం, ఏప్రిల్ 2: గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద కాకుండా ఇంటింటికి పెన్షన్లు పంపిణీ చేయాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ పంపిణీలో రాజకీయాలు చేయకుండా వృద్ధులకు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇంటింటి వద్దనే పెన్షన్ అందజేయాలని కోరుతూ స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యూబీ వరప్రసాద్‌కు మంగళవారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఒకటో తేదీన పెన్షన్లు పంపిణీ చేయకుండా ప్రతిపక్షాలపై బురద జల్లే కార్యక్రమం చేస్తుందని, దానికి అధికారులు సహకరిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు శిఖరం కోటయ్య, జనసేన మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: పేదలు, వృద్ధులకు ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయకుండా ఉండటం రాజకీయ కుట్రేనని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం యద్దనపూడి మండలకేంద్రంలో తహసీల్దార్ వై.నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సచివాలయాల్లో తగినంత సిబ్బంది ఉన్నా ప్రభుత్వం కావాలనే పింఛన్ల పంపిణీ లో నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నదని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రావి పాటి సీతయ్య గుదే తారకరామారావు, బోయపాటి సాంబయ్య రంగయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చీరాల: పెన్షన్లు పంపిణీ జాప్యంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. వారికి అండగా టీడీపీ వెన్నంటి ఉంటుందని ఆపార్టీ నాయకులు అన్నారు. పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యానికి ప్రభుత్వమే కారణమని ధ్వజమెత్తారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంజి పురుషోత్తమ్, బొగ్గుల పార్థసారధి, అడ్డగడ రామయ్య, కీర్తి ప్రసాద్, తేలప్రోలు నాగేశ్వరరావు, పావులూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు: ఇళ్ల దగ్గరే పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు మంగళవారం ఎంపీడీవో శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఎప్పటిలాగే లబ్ధిదారులకు ఇంటి దగ్గరే పింఛన్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, బోడావుల శివయ్య, పంగులూరి హనుమయ్య, కరి శ్రీనివాసరావు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.3.20 లక్షల నగదు పట్టివేత



పట్టుబడిన నగదును లెక్కిస్తున్న పోలీసులు

చినగంజాం, ఏప్రిల్ 2: చినగంజాం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్యగల టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మంగళవారం రూ.3.20లక్షల నగదు పట్టుబడింది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలు నేపథ్యంలో మంగళవారం వేకువజామున 3గంటల సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చీరాలకు వైపు వెళుతున్న కారును తనిఖీ చేయగా డ్యాష్ బోర్డులో ఉన్న బ్యాగులో రూ.3,20,540 నగదు ఉన్నట్లు గుర్తించారు. కారులో డ్రైవర్ షేక్ బషు, వేటపాలెం మండలంకు చెందిన దామచర్ల రాజేష్‌లు ఉన్నట్లు తెలిపారు.

సోమవారం నెల్లూరు, తిరుపతి పట్టణాలలో జీడిపప్పు అమ్ముకుని వస్తున్నామని, ఆ డబ్బు తాము పనిచేస్తున్న కంపెనీ యజమానికి అప్పగించేందుకు తీసుకెళుతున్నట్లు వారు తెలిపారు. నగదుకి సంబంధించి సరియైన పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి, వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీజ్ చేసిన నగదుని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ద్వారా జిల్లా గ్రీవెన్స్‌కి అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి కాంగ్రెస్ అభ్యర్థిగా అడుసుమల్లి కిషోర్



అడుసుమల్లి కిషోర్

అద్దంకి, ఏప్రిల్ 2: కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ అభ్యర్థిగా అడుసుమల్లి కిషోర్‌ను అధిష్ఠానం ప్రకటించింది. కిషోర్‌బాబు అద్దంకి మండలంలోని నాగులపాడు కాగా అద్దంకిలో స్థిరపడ్డారు. ఇంటర్మీడియట్ చదివిన కిషోర్ కొంతకాలం పాటు రెస్టారెంట్ నిర్వహించారు. అనంతరం రియల్ ఎస్టేట్ రంగంలో స్థిరపడ్డారు. వినూత్న అలోచనలతో కిషోర్‌బాబు ముందుకూ సాగుతూ గుర్తింపు పొందారు

బాపట్ల పార్లమెంట్‌కు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జేడీ శీలంను ప్రకటించటం పట్ల ఆపార్టీ అద్దంకి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అద్దంకి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశమయిన నేతలు ప్రజా సేవలో ఉండే జేడీ శీలంను అధిష్ఠానం అభ్యర్థిగా ప్రకటించటం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో నియెజకవర్గ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్‌బాబు, కోరే సురేంద్రనాథ్, వై.నాగయ్య, శ్రీనివాసరావు, పీవీ సురేష్‌బాబు, కబలా సుబ్రమణ్యం, దొడ్డా రోజారాణి, షేక్ సజీనా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- పింఛన్లపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- వైసీపీ నేతలు పార్టీలో చేరిక



మార్టూరు: ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన వింజనంపాడు వైసీపీ నేతలు, కార్యకర్తలు

యద్దనపూడి(మార్టూరు), ఏప్రిల్ 2: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. యద్దనపూడి మండలం వింజనంపాడు, యనమదల గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం మార్టూరు మండలం ఇసుకదర్శిలోగల క్యాంపు కార్యాలయంలో వారికి ఏలూరి పార్టీ కండువాలను మెడలో వేసి స్వాగతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీ పీ అధికారంలోకి రావ డం ఖాయమన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు గ్రామాలలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. యద్దనపూడి మండలంలో టీడీపీకి భారీ మెజారిటీని తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో తప్పుడు ప్రచారాలు, అబద్ధాలనుప్రజలకు చెబుతున్నారన్నారు.



చినగంజాం: కడవకుదురులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

వింజనంపాడు గ్రామం నుంచి కోడూరి నాగరాజు, టి.వెంకటేష్, సాదినేని సుధీర్, గమిడి పూర్ణచంద్రరావు, దివి వీరాంజనేయులు, గొల్ల ఏసు, గొల్ల బాబు, వడల నాగేశ్వరరావు, దివి వెంకట్రావు, మెంతుల నాగరాజు, బెల్లం రాంబాబు, గరికపూడి సురేష్, రాయిని ముధు తదితరులు పార్టీలో చేరారు. యనమదల ఎస్సీ కాలనీకి చెందిన చెన్నయ్య, కనపర్తి ఏసుబాబు, కత్తి చిన్న, కనపర్తి డేవిడ్, రాయి వెంకటేశ్వర్లు, కత్తి ప్రేమ్ సాగర్, రాయి అంజయ్య తదితరులు పార్టీలో చేరారు. బీసీ కాలనీకి చెందిన వల్లెపు శ్రీను, గుంజి పోలు రాజు, గుంజి సుబ్బారావు, గుంజి నాగరాజు, పల్లెపు పోలయ్య, గుంజి శ్రీను, గుంజి దుర్గాప్రసాద్, బండారు నరసింహారావు, పల్లెపు ఏడుకొండలు, తన్నీరు శ్రీను తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుదే తారకరామారావు, రావిపాటి సీతయ్య, నల్లపనేని రంగయ్య చౌదరి, తొండెపు ఆదినారాయణ, రంగారావు, భద్రయ్య, చంద్రశేఖర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఏలూరి

చినగంజాం, ఏప్రిల్ 2: మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్యటించారు. నీలాయిపాలెంలో సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు బాబాయి వెంకటనారాయణ దశదిన కర్మలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్ గ్రామంలో టీడీపీ నాయకులు లంకే పోతురాజు భార్య మహాలక్ష్మీ మృతి చెందగా ఆమె మృతదేహానికి ఏలూరి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోపిరాల గ్రామంలో చినగంజాం గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్యను పరామర్శించారు.

కడవకుదురు గ్రామంలో ఇటీవల మృతి చెందిన తెలుగుయువత మండల మాజీ అధ్యక్షుడు అనంత రాఘవరావు, బొప్పన శ్రీనివాసరావు, సిద్దాబత్తిన వెంకటేష్‌ల చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పొట్టి వెంకటశ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వడ్లమూడి వెంకటసుబ్బారావు, అనారోగ్యంతో ఉన్న పత్తిపాడు సుబ్బారావును పరామర్శించారు. కడవకుదురు గ్రామంలో పర్యటించి యువత, మహిళలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్చూరులో ప్రచారం

పర్చూరు, ఏప్రిల్ 2: పర్చూరులో తెలుగుదేశం, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్నికల ప్రచారం హోరందుకుంది. రోజురోజుకు ప్రజల నుంచి మద్దతు పెరుగుతుండటంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. మంగళవారం స్థానిక రాములవారి వీధి, ముస్లీం బజార్‌తోపాటు, పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు.

కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాం ప్రసాద్, మల్లాది సురేష్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, జనసేన ప్రతినిధులు కారంపూడి సందీప్‌తేజ, తులసి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు అధిక ప్రాధాన్యం: కొండయ్య



నేత ఉపవృత్తుల వారితో కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 2: చేనేతకు అధిక ప్రాధాన్యం ఇస్తామని కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని ఈపురుపాలెం పురుగులుపేట, 40 ఇళ్ల కాలనీలలో మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు తథ్యమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. తొలుత చేనేత అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణకు చర్యలు చేపడతారని తెలిపారు. అందులో భాగంగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం జరుగుతుందని చెప్పారు. సూపర్ సిక్స్, బీసీ డిక్లరేషన్ తదితరాలతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాతాని ఉమామహేశ్వరరావు, గుద్దంటి బ్రంమౌళి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరి శివరామప్రసాద్ నేతృత్వంలో మంగళవారం పార్టీ శ్రేణుల సమావేశమయ్యారు. ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేసి కూటమి అభ్యర్థి కొండయ్యకు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపేందుకు కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- డీఎస్పీ మురళీకృష్ణ



పర్చూరులో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంను ఆర్వో రవీందర్‌తో కలిసి పరిశీలించి చర్చిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

పర్చూరు, ఏప్రిల్ 2: త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించనున్నట్లు బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్చూరు, వేమూరు, బాపట్ల నియోజకవర్గాలకు సంబంధించి అత్యంత సమస్యాత్మక కేంద్రాలను ఇప్పటికే గుర్తించినట్లు చెప్పారు. దీనికి సంబంధించి ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అలజడులు సృష్టించి కేసు నమోదయిన వ్యక్తులపై తహసీల్దార్‌ల ద్వారా ముందస్తు బైండోవర్ చేస్తామన్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు. ఇప్పటికే పారామిలటరీ బలగాలు జిల్లా కేంద్రానికి వచ్చాయన్నారు. ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహిస్తామన్నారు. అనంతరం పర్చూరు భవనం అంజిరెడ్డి, తులాబంధుల అర్జునయ్య జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంని పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ సీతారామయ్య, ఎస్సైలు ఎస్.రమేష్, జీవీ చౌదరి, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం చెప్పాలి

సంతమాగులూరు, ఏప్రిల్ 2: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పాలని టీడీపీ యువనాయకుడు గొట్టిపాటి హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. మంగళవారం సంతమాగులూరు మండలం గురిజేపల్లిలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ మద్దతుగా తనయుడు హర్షవర్ధన్ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితుల ఓట్లతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి వారిపై దమనకాండ. చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఇతర దేశాలలో విద్యను అభ్యసించేందుకు అంబేడ్కర్ విదేశీ విద్య పథకాన్ని అమలుచేసినట్లు చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగనన్న విదేశీ విద్యగా మార్చడం బలహీన వర్గాలపై జగన్ రెడ్డి కపట ప్రేమ కాదా అని ప్రశ్నించారు. దళితుల హక్కుల్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉందన్నారు. అంబేడ్కర్ ఆశయాలను తుంగలో తొక్కుతున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు దళిత సోదరులు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తేలప్రోలు రమేష్, అట్లా పెద వెంకటరెడ్డి, నాగబోతు సుజాత, కోణికి గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

18 మంది వలంటీర్లు రాజీనామా

బల్లికురవ, ఏప్రిల్ 2: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ పరిధిలో రెండు సచివాలయాల ద్వారా పనిచేస్తున్న 18 మంది వార్డు వలంటీర్లు మంగళవారం రాజీనామాలు చేశారు. ఒకేమారు అందరూ కలిసి వలంటీర్ పోస్టులకు రాజీనామాలు చేయటం రాజకీయ ఒత్తిడి వలనే జరిగి ఉంటుందని పలువురు అంటున్నారు. వలంటీర్లు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి తాము విదుల నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. అనంతరం వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డిని కలవటం కూడా వలంటీర్ల రాజీనామాలో రాజకీయ ఒత్తిడి ఉందని మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. గ్రామస్థాయిలో ఉన్న అధికార పార్టీ నేతలు వలంటీర్లపై రాజీనామాలు చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది.

ఇసుకదర్శిలో 15 మంది..

మార్టూరు, ఏప్రిల్ 2: మండలంలోని ఇసుకదర్శి గ్రామంలో 15 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో నితిన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామంలో 18 మంది వలంటీర్లు ఉండగా, 15 మంది రాజీనామా చేశారు. మిగిలిన ముగ్గురు కూడా రేపోమాపో రాజీ నామా చేయనున్నట్లు సమాచారం. దీనిపై వైసీపీ సీనియర్ నాయకుడు సూత్రధారిగా వ్యవహరించినట్లు తెలిసింది.

కొత్తపాలెంలో 11 మంది..

చినగంజాం, ఏప్రిల్ 2: మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని 11 మంది వలంటీర్లు రాజీనామాలు చేసినట్లు ఎంపీడీవో యూబీ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. కొత్తపాలెం గ్రామం లోని 22 మంది వలంటీర్లుగాను 11 మంది వలంటీర్లు రాజీనామాలను చేసి మంగళవారం అందజేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రభుత్వం వలంటీర్లకు అందజేసిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేడు బూదవాడలో గొట్టిపాటి ఎన్నికల ప్రచారం

పంగులూరు, ఏప్రిల్ 2: మండలంలోని బూదవాడ గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నేతలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

కొప్పెరపాడులో బైకు చోరీ

బల్లికురవ, ఏప్రిల్ 2: ఇంటి ముంగిట ఉంచిన బైకును కొప్పెరపాడులో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అందిన సమాచారం మేరకు.. మండలంలోని కొత్తూరు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ చెన్నూరి మాధవరావు కొప్పెరపాడులో ఉంటున్నాడు. సోమవారం సచివాలయానికి వెళ్లివచ్చిన ఆయన ఇంటి ముంగిట ఏపీ 39 ఎన్‌క్యూ 7165 గ్లామర్ బైకును ఉంచి ఇంట్లో నిద్రించారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి బైకు లేకపోవటంతో బల్లికురవ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఐకమత్యంగా ఉందాం

కొత్తపేట(చీరాల), ఏప్రిల్ 2: ఐకమత్యమే సగం బలం.. సమిష్టిగా అడుగులు వేద్దాం.. అధికారాన్ని అందిపుచ్చుకుందామని టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాలులో మంగళవారం యాదవ సామాజికవర్గ ప్రతినిధులతో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బుర్ల వెంకట్రావు, నక్కల రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడ్డ డబ్బుపై కొనసాగుతున్న విచారణ

చీరాల, ఏప్రిల్ 2: మండలంలోని కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలోని రాయల్ మైరైన్ ఆక్వా కంపెనీలో ఇటీవల ఎఫ్ఎస్‌టీ అధికారులు, పోలీసులు నిర్వహించిన తనిఖీలలో రూ.56 లక్షలు దొరికిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆ డబ్బును సేఫ్ కస్టడీలో ఉంచారు. సదరు డబ్బుకు సంబంధించి కంపెనీ ప్రతినిధులు తమ వద్ద ఉన్న ఆధారాలను చూపారు. ఈ క్రమంలో మంగళవారం ఐటీ నోడల్ ఆఫీసర్ రాజసులోచనకు తమ వద్ద ఉన్న ఆధారాలను చూపి రిలీజింగ్ ఆర్డర్ ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులు కోరారు. అందుకు సంబంధించి బుధవారం ఐటీ అసిస్టెంట్ కమిషనర్‌ను కలవాలని ఆమె సూచించారు. ఏసీ విచారణ, పరిశీలన అనంతరం సదరు నగదుకు సంబంధించి రిలీజింగ్ ఆర్డర్ ఇస్తారని తెలిసింది.

మండల విద్యాశాఖ కార్యాలయానికి కరెంట్ కట్

చీరాలటౌన్, ఏప్రిల్ 2: చీరాల మండల విద్యాశాఖ కార్యాలయానికి మంగళవారం మునిసిపల్ అధికారులు కరెంట్ కట్ చేయించారు. దీంతో రోజంతా కంప్యూటర్‌లు ఆన్ కాకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. సదరు కార్యాలయం మునిసిపల్ పరిధిలోని 20వ వార్డు సచివాయలంలో ఓ పోర్షన్‌లో ఉంది. ఇక్కడి నుంచి మండలవ్యాప్తంగా 142 పాఠశాలల మధ్యాహ్న భోజనం, విద్యకు సంబంధించి వివిధ సేవలు జరుగుతుంటాయి. అయితే, ఎటువంటి సమాచారం లేకుండా ఇద్దరు వ్యక్తులు వచ్చి కరెంట్ కటచేసి వెళుతుండగా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం వారిని నిలదీశారు. దీనిపై తమకు ఎటువంటి సంబంధంలేదని, మునిసిపల్ కార్యాలయానికి సంబంధించిన ఓ అధికారి కట్ చేయమన్నారని తెలిపినట్లు ఎంఈవో చెబుతున్నారు. మునిసిపల్ కమిషనర్‌కు ఎంఈవో రాతపూర్వకంగా అర్జీ అందించడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయానికి కరెంట్‌ను పునరుద్ధరించాలని కమిషనర్ ఆదేశించారు.

వంద కుటుంబాలకు రంజాన్ తోఫా

చినగంజాం, ఏప్రిల్ 2: చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మసీదుపేటకు చెందిన సయ్యద్ కాలేషావలి పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని గ్రామంలోని మసీదుపేట, ఇస్లాంపేట బిలాల్‌నగర్‌కు చెందిన వంద కుటుంబాలకు ఒక్కొక్కరికి 11 రకాల వస్తువులతో కూడిన రూ.1700 విలువ కలిగిన రంజాన్ తోఫాను అందజేశారు. దాత తండ్రి గఫార్‌సాహెబ్, తల్లి గుల్జార్‌బేగం, అక్కయ్యలు హసీనాబేగం, అమీరాబేగంలు ముస్లిం కుటుంబా లకు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎండీ హబీబుల్లా, జియావుల్‌హక్, సయ్యద్ నాగుర్‌బాషా, షేక్ జిలాని, నాయబ్‌రసూల్, అన్వర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 2: ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ అన్నారు. అందుకు భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. మంగళవారం వేటపాలెంలో రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో వేటపాలెం ఎస్సై సురేష్, పోలీసులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 2: ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ వైవీ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు విలువను వివరించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ పి.వెంకటరామారావు, గోపిరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, కామేశ్వరి, వీవోఏలు పాల్గొన్నారు.

మేదరమెట్లలో బైక్ మాయం


మేదరమెట్ల, ఏప్రిల్ 2: మేదరమెట్లలోని తమ్మవరం రోడ్డులో ఓ దుకాణం ఎదుట నిలిపి ఉంచిన బైక్ మాయమైంది. మంగళవారం గ్రామానికి చెందిన దొడ్డా పూర్ణయ్య తమ్మవరంలో రోడ్డులో ఓ దుకాణం వద్దకు వెళ్లారు. షాపు ఎదుట బైక్ నిలిపి లోపలికి వెళ్లి వచ్చేసరికి మాయమైంది. ఈవిషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ పరిశీలించడంతోపాటు ఇతర టెక్నికల్ అంశాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

అద్దంకి, ఏప్రిల్ 2: బైకుపై వెళుతున్న వృద్ధుడిని వెనుక నుంచి బొలెరో ట్రక్కు ఢీకొనటంతో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఉప్పలపాడుకు చెందిన గుదే వెంకటేశ్వర్లు(58) బైక్‌పై మంగళవారం ఉదయం అద్దంకి వస్తున్నాడు. ఈక్రమంలో కరెంట్ ఆఫీసు సమీపంలో వినుకొండ నుంచి నెల్లూరు వెళుతున్న ట్రక్కు వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వర్లు మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు.

విద్యార్థినిని వేధిస్తున్న యువకులపై కేసు

అద్దంకి పట్టణంలో ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిని ఇద్దరు అన్నదమ్ములు తరచూ వేధిస్తున్నారు. గతంలో పలుసార్లు పెద్ద మనుషులు హెచ్చరించినప్పటికీ వేధింపులు అపలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.





రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.23

సహరి (గురువారం) : 4.44

ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.0	26.0
కావలి	37.0	27.0
కందుకూరు	37.0	27.0
ఆత్మకూరు	41.0	27.0
ఉదయగిరి	41.0	24.0





ప్రతిపక్షాలే టార్గెట్‌గా కేసులు... జరుగుతున్న అక్రమాలపై ఆధారాలతోసహా ఫిర్యాదు చేసినా లెక్కలేనితనం.. అధికార పార్టీ తరపున సొంత మామ ప్రచారం చేయడం.. అన్నిటికీ మించి సాక్షాత్తు ప్రధాని మోదీ పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యం ఇలా అనేక కారణాలు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి జిల్లాను వీడేలా చేశాయి. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎటువంటి ఎన్నికల విధులు తిరుమలేశ్వరరెడ్డికి అప్పగించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘం తన ఆదేశాల్లో పేర్కొనడం తీవ్రతను తెలియజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు కలెక్టర్లు, ఐదుగురు ఎస్పీలు, ఒక డీఐజీని ఈసీ బదిలీ చేసింది. అందులో జిల్లా ఎస్పీతోపాటు గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు కూడా ఉండటం గమనార్హం. వీరద్దరి బదిలీ జిల్లా పోలీసు శాఖనే కాకుండా అధికార యంత్రాంగం మొత్తం ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. కాగా, ఇన్చార్జి ఎస్పీగా అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య నియమితులయ్యారు.

తిరుమలేశ్వరరెడ్డి పైనే

తొలివేటు!

- జిల్లా ఎస్పీకి స్థానచలనం
- ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు
- కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంతో సంచలనం
- వైసీపీతో అంటకాగుతున్నట్లు అనేక ఆరోపణలు
- ప్రధాని సభలో వైఫల్యమే ప్రధాన కారణం
- ఎస్పీ మామ వైసీపీ నాయకుడు కావడం మరో కారణం
- మూడు రోజుల క్రితం ఈసీకి టీడీపీ ఫిర్యాదు
- అధికార యంత్రాంగంలో కలకలం

నెల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దాదాపు ఏడాది క్రితం తిరుమలే శ్వరరెడ్డి ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. అయితే మొదటి నుంచీ ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్ష నేతలే టార్గెట్‌గా క్షేత్రస్థాయిలో తప్పుడు కేసులు నమోదు చేస్తున్నా ఎస్పీ పట్టించుకోలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తూ వచ్చాయి. ఎస్పీ బదిలీకి ప్రధాన కారణం ప్రధానమంత్రి మోదీ సభలో భద్రత వైఫల్యమేనని ఉన్నత వర్గాలు చెబుతున్నాయి. గత నెల 17వ తేదీన చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎన్నికల ప్రచార సభకు నరేంద్రమోదీ హాజరయ్యారు. ఆ సభలో భద్రత చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. ఏకంగా వీఐపీ గ్యాలరీలోకి వాటర్ బాటిళ్ల విసరడం, గ్యాలరీవైపు జనాలు దూసుకురావడంతో ప్రధానమంత్రి భద్రతా సిబ్బంది వారిని నిలువరించాల్సిన పరిస్థితి దాపురించింది. ఆ వీఐపీ గ్యాలరీకి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించింది తిరుమలేశ్వరరెడ్డి అని చెబుతున్నారు. ప్రధాని సభలో పోలీసు వైఫల్యంపై ఇంటెలిజెన్స్ బ్యూరో కేంద్ర హోం శాఖ, ఎన్నికల కమిషన్‌కు నివేదికను అందజేసింది. అదేవిధంగా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మామ దుగ్గిరెడ్డి గురువారెడ్డి వైసీపీ నాయకుడు కావడం కూడా ఆయన బదిలీకి మరో కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై మూడు రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. తిరుమలేశ్వరరెడ్డి మామ వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, వైసీపీ నాయకులు ఎస్పీ ఇంటికి రాకపోకలు సాగిస్తూ లాబీయింగ్ చేస్తున్నారంటూ ఫిర్యాదులో ఆరోపించారు. అలానే పొదలకూరు మండలంలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా ఎస్పీ పట్టించుకోవడం లేదంటూ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఇటీవల ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులన్నింటిపైన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. వీటన్నింటి నేపథ్యంలో తిరుమ లేశ్వరరెడ్డిపై ఎన్నికల కమిషన్ వేటు వేసినట్లు చెప్పు కుంటున్నారు. మరోవైపు అదనపు ఎస్పీ సీహెచ్.సౌజన్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

త్వరలో మరిన్ని సంచలనాలు ?

ఎస్పీపై వేటుతో ఒక్కసారిగా జిల్లాలో కలకలం రేగగా త్వరలో ఇటువంటి సంచలనాలే మరిన్ని జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో అనేక మంది అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. కొందరు కోడ్ వచ్చినా వైసీపీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ హరినారాయణన్‌ను బదిలీ చేయాలని, ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరుతూ టీడీపీ సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. పొదలకూరు మండలంలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా కలెక్టర్ పట్టించుకోవడం లేదని, మంత్రి కాకాణి గోవర్థన్‌రెడ్డి దోపిడీకు కలెక్టర్ సహకరిస్తున్నారని తన ఫిర్యాదులో ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కలెక్టర్‌ను బదిలీ చేసి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని సోమిరెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. అలానే మంత్రి కాకాణి దగ్గర వ్యక్తిగత సిబ్బందిగా పని చేస్తున్న ఎంపీడీవో సరళపై కూడా చర్యలు తీసుకోవాలంటూ మరో లేఖను ఎన్నికల కమిషన్‌కు రాశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం మూడేళ్లు ఒక జిల్లాలో పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉందని, ఏ సరళ వెంకటాచలం ఎంపీడీవోగా మూడేళ్లు పనిచేసి ఆ తర్వాత ఇప్పుడు మంత్రి వద్ద పనిచేస్తూ ఇంకా జిల్లాలోనే ఉన్నారని పేర్కొన్నారు. ఇక మూడేళ్లు దాటిన, సొంత జిల్లాలో పనిచేస్తున్న డీఆర్డీఏ పీడీ, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా ఆడిట్ అధికారులను బదిలీ చేయాలంటూ టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో రానున్న రోజుల్లో ఈసీ ఎటువంటి చర్యలు తీసుకుంటుందా.. అన్నది ఆసక్తిగా మారింది.

కాంగ్రెస్ అభ్యర్థులు వీరే!

- నెల్లూరు సిటీ, కావలి మినహా మిగిలిన స్థానాలకు ఖరారు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఖరారు అయ్యారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలకుగాను ఆరింటికి అభ్యర్థుల పేర్లను మంగళవారం పీసీసీ చీఫ్ వైఎస్.షర్మిల ప్రకటించారు. నెల్లూరు నగరం, కావలి స్థానాలకు మాత్రం ఎవరినీ నియమించలేదు. అలాగే నెల్లూరు పార్లమెంట్ స్థానాన్ని కూడా పెండింగ్‌లో ఉంచారు.

నెల్లూరు రూరల్ అభ్యర్థిగా షేక్ ఫయాజ్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరు రూరల్ కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ ఫయాజ్ నియమితులయ్యారు. నగరంలోని కోటమిట్ట ప్రాంతానికి చెందిన ఫయాజ్ 25 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో కొనసాగు తున్నారు. సామాన్య కార్యకర్తగా పార్టీలో చేరిన ఫయాజ్ మైనారిటీ నగర అధ్యక్షుడిగా, పీసీసీ డెలి గేట్ మెంబర్‌గా, ప్రస్తుతం నగర నగర అధ్యక్షుడిగా ఉంటున్నారు. ఫయాజ్ సేవలను గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం 2019 ఎన్నికల్లో నెల్లూరు నగరం నుంచి సీటు కేటాయించింది. ప్రస్తుతం నెల్లూరు రూరల్‌కు కేటాయించి బరిలో నిలిపింది. ఈ సందర్భంగా షేక్ ఫయాజ్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ఉన్న తనకు రెండుసార్లు పోటీ చేసే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించిందని అన్నారు.

ఆత్మకూరుకు శ్రీధర్‌రెడ్డి



ఆత్మకూరు : పట్టణానికి చెందిన చేవూరు శ్రీధర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నియమితుల య్యారు. 1985 నుంచి కాంగ్రెస్ అనుబంధమైన ఎన్ఎస్‌యూఐ ఆత్మకూరు అధ్యక్షుడిగా పనిచేశారు. 1987 లో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1991లో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. 1999 నుంచి క్రియాశీలకంగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అనుచరుడిగా ఉంటూ వచ్చిన ఆయన తొలిసారి ఆత్మకూరు సర్పంచ్‌గా పోటీ చేశారు. 2019లో ఎన్నికలలో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తర్వాత 2020 నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శిగా, 2022లో ఏఐసీసీ సభ్యుడిగా నియమితులయ్యారు. శ్రీధర్ కొనసాగుతున్నారు. సేవలను గుర్తించి అధిష్ఠానం ప్రస్తుత ఎన్నికల్లో ఆత్మకూరు నుంచే బరిలో దింపింది.

సర్వేపల్లికి చంద్రశేఖర్



మనుబోలు : ముత్తుకూరు మండలం కప్పల దొరువు గ్రామానికి చెందిన పూల చంద్రశేఖర్ సర్వే పల్లి అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నారు. 33 సంవత్స రాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటున్న ఆయన తిరుపతి జిల్లా గూడూరులో నివాసం ఉంటున్నారు. 2005లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో సర్వేపల్లి నుంచే పోటీ చేశారు. సర్వేపల్లి నుంచే మరోమారు ఆయనకు పార్టీ అధిష్ఠానం అవకాశం ఇచ్చింది.

కోవూరుకు నెత్రంబాక



కోవూరు : నియోజకవర్గ అభ్యర్థిగా పోతిరెడ్డి పాళెంకు చెందిన నెత్రంబాక మోహన్ నియమితులయ్యారు. గ్రామం నుంచి నియోజకవర్గ స్థాయి నాయకుడిగా ఎదిగిన మోహన్ పలు కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పార్టీ పిలుపు మేరకు ఆందోళనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోహన్ పేరు ప్రకటనతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు ఆయన్ను అభినందించారు.

కందుకూరుకు సయ్యద్ గౌస్ మొహిద్దీన్



కందుకూరు : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సయ్యద్ గౌస్ మొహిద్దీన్ నియమితులయ్యారు. కందుకూ రుకు చెందిన గౌస్ 30 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. తొలిసారిగా ప్రస్తుతం బరిలో నిలిచారు. ఈ సందర్భంగా కందుకూరులో ఆయన విలేకరులతో మాట్లా డుతూ నియోజకవర్గ చరిత్రలో ముస్లింలకు టికెట్ కేటాయించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. త్వరలో వినూత్నంగా ప్రచారం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

ఉదయగిరి అభ్యర్థిగా సోము



ఉదయగిరి : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సోము అనిల్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. కలిగిరికి చెందిన ఈయన హైదరాబాదులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. సుమారు ఏడాది క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన అనిల్‌కుమార్‌కు ప్రస్తుత ఎన్నికల్లో టికెట్ దక్కడంతో ఆయన అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పోస్టల్ బ్యాలెట్ కీలకం

- చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం
- ఎన్నికల శిక్షణకు గైర్హాజరైతే చర్యలు
- కలెక్టర్ హరినారాయణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 2 : ఎన్నికల ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్ చాలా కీలకమని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఎన్నికల అధికారులతో మంగళవారం సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు హాజరవుతున్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి ఫారం-12 అందచేసి, సంతకం చేసిన తరువాత తిరిగి ఆర్వోలు సేకరించాలని సూచించారు. మే 4. 5తేదీల్లో పీవోలు, ఏపీవోలు, మే 6, 7 తేదీల్లో ఓపీవోలు, 8, 9 తేదీల్లో అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది, 10న డ్రైవర్లు, ఇతర సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించు కునేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మే 3 నుంచి 10 తేదీ మధ్య రెండు విడతల్లో ఇంటి వద్దనే ఓటింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇందుకు ముందుగా 85 ఏళ్లకుపైబడిన వృద్ధులు, దివ్యాంగులను గుర్తించాలన్నారు. మే 11, 12 తేదీల్లో వెబ్ కాస్టింగ్ ప్రక్రియను సాంకేతికంగా పరీక్షించి సరిచూసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వీటికి గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగా గుర్తించాలన్నారు. ఓటర్లను చైతన్యపరిచే స్వీప్ కార్యాక్రమాలను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- సచివాలయాల్లో నగదు అందజేత
- వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే పెన్షన్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 2 : సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం అవుతుంది. ఈనెల 8వ తేదీ వరకు ఇది కొనసాగుతుంది. ఎన్నికల నియమావళి నేపథ్యంలో వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయించొద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఈ నెల సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది అందరూ ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. సచివాలయాల్లోనే పెన్షన్‌దారులకు నగదు అందజేస్తారు. అయితే, వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేస్తారు. అటువంటి వారి ఇళ్లకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వెళ్లి పింఛను అందజేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 16 రకాల సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తుండగా 3.19 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వారిలో 1,73,064 మంది వృద్ధాప్య, 33,489 మంది దివ్యాంగ, 2,070 మంది వైద్య సంబంధ పింఛన్లు పొందుతున్నారు. వీరందరికీ ఇంటి వద్దనే పింఛను నగదు అందచేస్తారు.

ప్రభుత్వ టీచరుపై కేసు నమోదు

ఉలవపాడు, ఏప్రిల్ 2 : రాజకీయ పార్టీ కార్యక్ర మంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడనే కారణంతో సోమ వారం రాత్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కేసు నమో దైంది. ఎస్సై బాజీరెడ్డి కథనం మేరకు.. కరేడు గ్రామా నికి చెందిన కేశవరపు జాలిరెడ్డి గత నెల మార్చి 29న చాగొల్లులో వైసీపీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నాడని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు అందిం ది. దీనిపై స్పందించిన కందుకూరు సబ్ కలెక్టర్ విద్యా దరి సదరు ఉపాధ్యాయుడిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో విజయను ఆదేశించారు. దీంతో ఎంపీడీవో ఫిర్యాదు మేరకు టీచరు జాలిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వలంటీర్ల మెడపై కత్తి!

- ప్రచారం కోసం బలవంతపు రాజీనామాలు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో సతమతం

నెల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాము తన పిల్లలను తానే తింటుందట. ప్రస్తుతం వలంటర్లు ఎదుర్కొంటున్న ఒత్తిడికి ఈ పోలిక సరిపోతుందని ప్రజలు అనుకొంటున్నారు. సేవ పేరుతో ప్రజల్లో రాజకీయ పట్టు కోసం వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించుకున్న వలంటీర్ల వ్యవస్థను ఇప్పుడు ఆ అవసరాల కోసం ఉద్యోగాలకు రాజీ నామా చేయమంటోంది. 'మిమ్మల్ని నియమించింది మేమే కదా! మా కోసం మీరు రాజీ నామా చేయండి. మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. అప్పుడు మిమ్మల్ని మళ్లీ తీసు కుంటా'మని ఒత్తిడి చేస్తున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల తట్టుకోలేక ఇప్పటికే పలు వురు రాజీనామాలు చేయగా, మిగిలిన వారు రాజీనామా చేస్తే తమ పరిస్థితి ఏమిటో అర్థం కాక లోలోన కుమిలిపోతున్నారు.

● కావలి మున్సిపాలిటీ పరిధిలో 150 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. కావలి రూరల్ మండలంలో 10 మంది, జలదంకి మండలంలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో పెద్ద సంఖ్యలోనే వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలో కూడా ఇదే తరహా రాజీనామాలు చేస్తున్నారు.

● పేదలపైనా ప్రతాపం ?

వలంటీర్లుగా పని చేస్తున్న యువతలో అత్యధికులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. వలంటరీ ఉద్యోగం కోసం వీరిలో కొందరు స్థానిక నాయకుల సహాయ సహకారాలు పొందినవారు ఉంటే అత్యధికులు స్వశక్తితో వలంటీర్లుగా నియమితులైన వారే. అయితే ఉద్యోగంలో చేరిన తరువాత వీరంతా పూర్తిగా స్థానిక వైసీపీ నాయకుల చేతుల కిందకు వెళ్లిపోక తప్పని వాతావరణం సృష్టించారు. స్థానిక నాయకుడు దయా దాక్షిణ్యాల మీదే వీరి ఉద్యోగాలు ఆధారపడేంతగా జిల్లా అధికార వ్యవస్థ దిగజారి పోయిం ది. స్థానిక నాయకుడు ఒక ఫోన్ చేస్తే చాలు నిమిషాల్లో వలంటీరు ఉద్యోగం ఊడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో మొత్తం వలంటీర్లు వైసీపీ నాయకుల చేతుల కిందకు వెళ్లిపో యారు. ఇనాళ్లపాటు వారు చెప్పినట్లే నడుచుకున్నారు. ఆ చనువుతో ఇప్పుడు తమ పరిధి లోని వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి ఉద్యోగాలకు రాజీనామాలు చేయించి ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకొంటున్నారు. అదేదో సినిమా డైలాగ్‌లో చెప్పినట్లు సూరిబావ కళ్లలో ఆనందం చూడటానికి అన్నట్లు వైసీపీ అభ్యర్థుల కళ్లలో సంతోషం చూడటానికి తమ పరిధిలోని వలంటీర్లను ఉద్యోగాలకు రాజీనామాలు చేయించి రాజకీయ కూలీలుగా నాయకుల ముందు నిలబెడుతున్నారు. చిన్న కుటుంబాలకు చెందిన వలం టీర్లు స్థానికంగా బలంగా ఉండే వైసీపీ నాయకుల ఒత్తిడిని తట్టుకోలేక ఉద్యోగాలకు రాజీ నామా చేస్తున్నారు. ఒక నాయకుడ్ని చూసి ఇంకో నాయకుడు తమ పరిధిలోని వలం టీర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. పాపం ఈ ఒత్తిడిని తట్టుకోలేక చిరు ఉద్యోగులు విలవిల్లాడిపోతున్నారు. మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం

- ప్రజా ఆశీర్వాద సభలో వేమిరెడ్డి, కాకర్ల



వేమిరెడ్డి, కాకర్లను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

జలదంకి, ఏప్రిల్ 2: మండల ప్రజలు మమ్మల్ని ఆశీర్వదిస్తే మీ మండలాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బ్రాహ్మణక్రాకలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో వారు మాట్లాడుతూ ప్రజలు తమపై చూపించిన ప్రేమానురాగాలకు ముగ్ధులమయ్యామని, ఇదే అభిమానంతో మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వంటేరు మాట్లాడుతూ వైసీపీ ఎంపీ అభ్య ర్థి విజయసాయిరెడ్డి వేమిరెడ్డి కాలిగోటికి కూడా సరిపోడని, వచ్చే ఎన్నికల్లో ఆయన చిత్తుచిత్తుగా ఓటమి పాలవడం కాయమని జోస్యం చెప్పారు. ఈ సభలో కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, బీజేపీ, జనసేన నాయకులు భరత్‌కుమార్, సురేంద్రరెడ్డి, రామ్‌చైతన్య పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న రోడ్‌షో

మండలంలోని బ్రాహ్మణక్రాకలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. కూటమి పార్టీల శ్రేణులు భారీగా తరలిరావడంతో వాహనాలు బారులుతీరాయి. నెల్లూరు ఎంపీ, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య క్రిష్ణారెడ్డి తదితర నేతలు రోడ్‌షోలో పాల్గొని పార్టీల శ్రేణులను ఉత్సాహపరిచారు. అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్ల గుర్రాలపై స్వారీ చేశారు. అడుగడుగునా మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిల స్వగ్రామమైన బ్రాహ్మణక్రాకలో రోడ్డుషో విజయవంతమైంది.



గుర్రాలపై స్వారీ చేస్తున్న వేమిరెడ్డి, కాకర్ల

కలిసికట్టుగా పని చేస్తేనే విజయం



మాట్లాడుతున్న కాకర్ల సురేష్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన వేమిరెడ్డి , కాకర్ల తదితరులు

- ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్
- చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే భవిష్యత్తు
- నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

వింజమూరు,ఏప్రిల్ 2: తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా పనిచేస్తేనే విజయం సాధ్యం అవుతుందని టీడీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్వీ కల్యాణమండపంలో మంగళవారం కొండాపురం, కలిగిరి, వింజమూరు కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ పాతతరం.. కొత్త నీరు కలిసికట్టుగా పని చేస్తేనే టీడీపీ విజయం సాధిస్తుందన్నారు. అలాగే నాయకులు, కార్యకర్తల సలహాలు, సూచనలతో పార్టీని విజయవంతంగా ముందుకు తీసుకుపోతామని చెప్పారు. అంతకుముందు వేమిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే మనకు భవిష్యత్ ఉంటుందని అన్నారు. విబేధాలను వీడి గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటింకీ తిరిగి ఓటర్లను కలిసి టీడీపీకి ఓటు వేసేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి రంగారావు, జనసేన జోనల్ ఇన్‌చార్జ్ కొంటె వెంకటేశ్వర్లు, మూడు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు ఇవ్వాలి

కావలి, ఏప్రిల్ 2:సచివాలయ సిబ్బంది ద్వారా సామాజిక పింఛన్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందచేయాలని టీడీపీ నేతలు పేర్కొన్నారు. కావలి పట్టణ, రూరల్ నేతలు మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనాధికారి, ఎమ్పీడీవో కార్యాలయంలో ఎమ్పీడీవోను కలిసి వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్, ఆవుల రామకృష్ణ, కండ్లగుంట మధుబాబు నాయుడు, జ్యోతి బాబూరావు, పోతుగంటి క్రీకాంత్, దావులూరి దేవకుమార్, ఉప్పాల వెంకట్రావు పాల్గొన్నారు.

కొండాపురం : సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంగళవారం ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం అందచేశారు. దామా మహేశ్వరరావు, యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, సీహెచ్.వెంకటాద్రి, కుంకు మోహనరావు, రామమోహనరావు, చాగంటి క్రిష్ణ, బద్దిపూడి మాచెర్ల పాల్గొన్నారు.

లింగసముద్రం : లబ్ధిదారులకు ఇంటి వద్దనే త్వరగా పింఛన్ అందజేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నేతలు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ, జనసేన నాయకులు ఏ.చిన కొండయ్య, ఏ.నర్సయ్య, సీహెచ్ బాలకోటయ్య, పీ.బాలకోటయ్య, ఏ.చినసత్యం, జీ.వెంకటేశ్వర్లు, పంగా పోలిరెడ్డి పాల్గొన్నారు.

గుడ్లూరు: సామాజిక పింఛన్‌ను లబ్ధిదారులకు ఇంటివద్దకే సచివాలయ ఉద్యోగలు వెళ్లి అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు స్థానిక మండల కార్యాలయం లో ఎంపీడీవోకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనిగర్ల నాగరాజు. పువ్వాడి వేణుగోపాల్, మేకపోతుల మాలకొండయ్య, చెన్నారెడ్డి మహేష్, దామా వెంకటేశ్వర్లు, చిత్తారి మల్లికార్జున, మద్దసాని కృష్ణ, రమణమ్మ పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: సామాజిక పింఛన్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దనే ఇవ్వాలని కోరుతూ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం ఎంపీడీవో రఫీక్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు వలేటి నరసింహం, చిరంజీవి, మానికొండ కొండయ్య, ఖాజావలి, పార్లపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడకుండా ఇంటి వద్దే సామాజిక పింఛన్లు పంపిణీ చేపట్టాలని టీడీపీ నాయకులు టీడీపీ నాయకులు చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఎంపీడీవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికోడ్ అమల్లోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించిందన్నారు. 1వ తేదీ న లబ్ధిదారు లకు పింఛన్ల నగదు పంపిణీ చేయ కుండా వైసీపీ నాయకులు రాజకీయం చేయ డం సరికా దన్నారు. కార్యక్రమంలో కందుకూరి రత్తయ్య, చల్లా ప్రసాద్, వెంగళరావు, ప్రసాద్, కంభం వెంక టేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



లింగసముద్రం: వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, జనసేన నేతలు



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

24 నుంచి వేసవి సెలవులు

ఉదయగిరి, ఏప్రిల్ 2: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 24నుంచి ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం అవుతాయన్నారు.

ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలి

ఉదయగిరి, ఏప్రిల్ 2: జొన్నపంట సాగు చేసిన రైతులు తమ పేర్లను రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మర్రిపాడు, దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం మండలాల్లో జొన్నల కొనుగోళ్లకు రైతులు తమ పేర్లను ఈ నెల 5వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన మాజీ సర్పంచి వడ్లమాని సుదర్శనాయుడు

సంగం, ఏప్రిల్ 2: మండలంలోని నీలాయపాళెం మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు వడ్లమాని సుదర్శనాయుడు మంగళవారం టీడీపీలో చేరారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు గంగపట్నం శేఖరయ్య, కర్నాటి రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆనం నివాసానికి వెళ్లి టీడీపీ తీర్థపుచ్చుకున్నారు. ఆనం రామనారాయణరెడ్డి సుదర్శన నాయుడికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గిరినాయుడు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వింజమూరు, ఏప్రిల్ 2: మండలంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం మండల విద్యుత్ ఏఈ శ్రీనివాసులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం కేంద్రాల్లో విద్యుత్ సరఫరా జరుగుతుందా లేదా అని పరిశీలించినట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశాలున్నాయని అందుకు సిబ్బందితో కలిసి కేంద్రాలను పరిశీలించామన్నారు. ఆయన లైన్‌మెన్ ఉన్నారు.

సీనియర్ నాయకులతో ఆనం రామనారాయణరెడ్డి భేటీ

చేజర్ల, ఏప్రిల్ 2: టీడీపీ మండల సీనియర్ నాయకులు రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీనరసారెడ్డిలతో మంగళవారం ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామనారాయణరెడ్డిని రావి సోదరులు సన్మానించారు. రానున్న ఎన్నికల్లో మండలంలో పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండల రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ ఈడి గిరినాయుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసులునాయుడు, కొమ్మి తిరపతి నాయుడు, హజరత్తయ్య, రావికృష్ణా రెడ్డి, గోపి పాల్గొన్నారు.



వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

అనంతసాగరం, ఏప్రిల్ 2: ఎండ తీవ్రత పెరగడంతో వడదెబ్బ తీవ్రతపై గ్రామీణ ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా అదనపు వైద్యాధికారి, క్షయ నివారణాధికారి షేక్ ఖాదర్‌వలి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో మంగళవారం నిర్వహించిన ప్రతేక సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వ్యవసాయ, ఉపాధిహామీ, భవన నిర్మాణ కార్మికులను అప్రమత్తం చేసి తగు సూచనలివ్వాలని కోరారు. అలాగే ఆసుపత్రిలో ఇటీవల అందుబాటులోకి తెచ్చిన టీబీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి ఓపీ వివరాలు తెలుసుకొన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: వేసవిదృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని గండిపాళెం ప్రాథమి ఆరోగ్య కేంద్ర వైద్యుడు కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లతో మాట్లాడారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తల్లీబిడ్డ, 104 వైద్యసేలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, అంకమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై అవగాహన



సీతారామపురం: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

సీతారామపురం, ఏప్రిల్ 2: మండలంలోని 9సచివాలయాల పరిధిలోని వృద్దాప్య, వితంతువు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మండల కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఉద యం 7 గంటల నుంచి సాయం త్రం 7గంటల వరకు పింఛన్లు అందజేయాలన్నారు. అందుకు ప్రతి సచివాలయంలో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు 5తేదీ నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ డబ్బులు అందజేయాలన్నారు. సచివాలయాల వద్ద తాగు నీటి సౌకర్యం, ఓఆర్‌స్ పాకెట్లు, ప్రతిఒక్కరు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. గ్రామ వాలంటీర్లు, సర్పంచులు, రాజకీయ నాయకులు ఈ పంపిణీలో పాల్గొనకూడదన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి భార్గవి, ఏవో వెంకటేశ్వర్లు, పంచా యతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయండి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 2: ఈ నెల 6వ తేదీ నుంచి జరగనున్న సమ్మేటివ్-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన శకునాలపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల పఠన, అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీవీ రత్నం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

అలంకారప్రాయంగా నీటితొట్లు

ఆత్మకూరు: నియోజకవర్గంలో రోజురోజుకు ఎండలు పెరడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువులు, కుంటల్లో కూడా చుక్కనీరు లేక ఎడారిని తలపిస్తున్నాయి. ఈ క్రమంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం కొన్ని గ్రామాల్లో నీటి తొట్లెలను నిర్మించింది. అధికారుల వీటి పర్యవేక్షణను పట్టించుకోక పోవడంతో అలంకార ప్రాయంగా ఉన్నాయి. ఆత్మకూరు మండలంలో కనుపూరుపల్లి, చెర్లోయడవల్లిలో నిర్మించిన నీటి తొట్లెలు వినియోగంలో ఉన్నాయి. అనంతసాగరం మండలంలో పశుసంపద ఎక్కువగా ఉంది. అధికార యంత్రాంగం దృష్టి సారించి పశువులకు దాహార్తిని తీర్చే నీటితొట్లెల నిర్మాణాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సంగం మండలంలోని తరుణవాయితో పాటు పలు గ్రామాల్లోని నీటి తొట్లెలు నిరుపయోగంగా ఉన్నా యి. ఏఎస్‌పేట మండలంలో 50కిపైగా నీటితొట్లెలను ఏర్పాటు చేశారు. కాని నీటితొట్లెల్లో నీటిని నింపకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్ని గ్రామాల్లో నీటి తొట్లెలు శిథిలావస్థకు చేరాయి.



అనంతసాగరంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

టీఆర్ఆర్‌లో అసెస్‌మెంట్ యాప్ టెస్టరన్

- ఉన్నత విద్యాశాఖ కమిషనర్ భాస్కర్ సందర్శన



యాప్ టెస్టరన్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్

కందుకూరు, ఏప్రిల్ 2: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ రూపొందించిన అసెస్‌మెంట్ యాప్‌కు సంబంధించి స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కమిషనర్ పోలా భాస్కర్ టెస్టరన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెస్‌మెంట్ యాప్ వల్ల కళాశాలల పనితీరు, విధివిధానాలు ఉన్నతస్థాయిలో సులభంగా తెలిసిపోతుందన్నారు. ఇటీవలే న్యాక్ ఏ ప్లస్ సాధించిన కళాశాలను సందర్శించాలన్న ఆలోచనతో టెస్టరన్‌కు ఈ కళాశాలను ఎంచుకున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాలలో అభివృద్ధి చేసిన హరితవనం, అజోలాపాండ్, వర్మీ కంపోస్టు యూనిట్లను, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ తరపున వేస్ట్ పేపర్లతో కళాత్మకంగా తయారుచేసిన హస్తకళాఖండాలను పరిశీలించిన ఆయన విద్యార్థినీ విద్యార్థులను, ఉమెన్‌సెల్ కో ఆర్డినేటర్ షేక్ షానాజ్‌బేగంను అభినందించారు. కళాశాలలో ఉన్న లేబరేటరీలు, కంప్యూటర్ లేబరేటరీ, ఇతర సదుపాయాలను ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆయనకు వివరించారు. కళాశాలలో తోటలపెంపకానికి వీలుగా అదనపు బోర్‌వెల్, డ్రిప్‌సిస్టమ్, స్ప్రింక్లర్ సిస్టమ్ అందజేసిన పూర్వవిద్యార్థి శంకర్‌ప్రసాద్ చేతులమీదుగా పోలా భాస్కర్ ఆ సిస్టమ్‌ను ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీవో డాక్టరు తులసి, డాక్టరు ఏ.కవిత, జిల్లాలోని ఎస్ఆర్‌సీ, ఒంగోలు పరిధిలోని వివిధ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కంప్యూటర్స్ సైన్స్ విభాగం అధ్యాపకులు, టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీని పరిశీలించిన ఆర్‌వో



ముసునూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఆర్డీవో శీనానాయక్

కావలి, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నగదు, మద్యం అక్రమ రవాణా నిరోధించటంలో భాగంగా ముసునూరు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీని మంగళవారం సాయంత్రం కావలి రిటర్నింగ్ అధికారైన ఆర్డీవో శీనానాయక్ పరిశీలించారు. జనరల్ తనిఖీలలో భాగంగా చేపట్టిన తనిఖీల్లో ఆర్డీవోతో పాటు కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి మధ్యాహ్నం నుంచి సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ

లింగసముద్రం, ఏప్రిల్ 2 : మండలంలోని 13 సచివాలయాల వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపీడీవో య శేషబాబు మంగళవారం చెప్పారు. సచివాలయాలు ఉన్న గ్రామాల్లో లబ్ధిదారులు నేరుగా సచివాలయం వద్దకు వచ్చి పింఛను తీసుకోవచ్చని చెప్పారు. వృద్ధులు, ఆరోగ్యం సరిగా లేని వారు, మంచంలో ఉన్న వారికి సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తారన్నారు. అలాగే సచివాలయం పరిధిలోని దూరంగా ఉన్న గ్రామాల లబ్ధిదారులకు కూడా సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛను అందజేస్తారని చెప్పారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు తీసుకొని రావాలని తెలిపారు.

హరిత విద్యుత్‌పై అవగాహన

కావలి, ఏప్రిల్ 2: జైభారత్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే కావలిలో ప్రతి ఇంటికి ఉచిత హరిత విద్యుత్‌ను అందిస్తామని ప్రముఖ శాస్త్రవేత్త శ్రీనివాస్ భాస్కర్ చాగంటి, జైభారత్ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పసాని నరేంద్రలు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం జైభారత్ అభ్యర్థితో కలిసి హరిత విద్యుత్ తయారు చేసే విధానం, దానిని ఉచితంగా ప్రజలకు ఎలా అందించవచ్చనే దానిపై వివరించారు. నరేంద్ర మాట్లాడుతూ ప్రజాసేవచేయాలనే లక్ష్యంతో జేడీ లక్ష్మీనారాయణ జైభారత్ పార్టీని స్థాపించారన్నారు. ఆయన ఆశయం మేరకు పని చేస్తామన్నారు.

అనారోగ్యంతో ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి మృతి



బ్రహ్మచారి(ఫైల్)

కలిగిరి, ఏప్రిల్ 2: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం బ్రహ్మచారి అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. బ్రహ్మచారి గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్సపొందుతున్నట్లు కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు కార్యాలయ సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

బిట్రగుంట, ఏప్రిల్ 2: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యాలయ ఆవరణంలో కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వేసవి ఎండలు పెరుగుతుండటం వలన అనారోగ్యానికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ నిత్యప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బందితో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచు సుజాతమ్మకు ఎంపీపీ పరామర్శ

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 2: దగదర్తి మండలం మనుబోలుపాడు సర్పంచు కల్వకుర్తి సుజాతమ్మ ఆనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలో చికిత్స పొందుతుండగా ఎంపీపీ తాళ్ళూరి వెంకటకృష్ణప్రసాద్ నాయుడు మంగళవారం పరామర్శించారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

సంగం, ఏప్రిల్ 2: వెంగారెడ్డిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఐసీడీఎస్ పీడీ హేనాసుజన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రికార్డులో నమోదు చేసిన వివరాల మేరకు చిన్నారుల బరువును పరిశీలించారు. ఆమె వెంట సీడీపీవో సునీత, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త సుగుణ, ఆయా లక్ష్మి, తదితరులు ఉన్నారు.

కావలిలో తెలుగుదేశం నాయకుల ప్రచారం



టీడీపీ అభ్యర్థి కావ్యను స్వాగతిస్తున్న ముస్లింలు

కావలి, ఏప్రిల్ 2: కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పట్టణంలోని వెంగళరావునగర్ 19వ వార్డులో వార్డు ఇన్‌చార్జి యేగూరి చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి మన్నవ రవిచంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆ వార్డులో ఉన్న రెండు మసీదులలో ముస్లింలతో కలసి ప్రార్థనలు చేశారు. అనంతరం వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం సాగించారు. ఈ వార్డులో ముస్లింలు ఎక్కువగా ఉన్నందున కమ్యూనిటీ హాల్, ఉర్దూ పాఠశాల, 10 ఎకరాలలో ముస్లిం శ్మశాన వాటిక నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. 10 ఏళ్ల కావలి ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్‌కుమార్ రెడ్డి దొరికిన కాడికి దోచుకోవటం దాచుకోవటం తప్ప ఈ ప్రాంతానికి ఏమి చేశారని ప్రశ్నించారు. దోచుకున్న డబ్బుతో మభ్యపెట్టడానికి మళ్లీ మీ ముందుకు వస్తున్నాడని, ఆయనకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు ఇన్‌చార్జి శానం హరి, పలువురు ముస్లింలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 2: పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని విజయ్‌నగర్ కాలనీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆపార్టీకి రాజీనామా చేసి జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతు తెలుపుతూ ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమంలో వారికి ఇంటూరి నాగేశ్వరరావు జనసేన, టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముప్పవరపు వేణు, గోకరాజు మదన్‌కుమార్, కొణిదల సిద్ధయ్య, శిగా తిరుపాలు, ఆవుల రవికుమార్, చదలవాడ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

దారకానిపాడు ఎస్సీ కాలనీ వాసులు...

గుడ్లూరు : మండలంలోని దారకానిపాడు ఎస్సీ కాలనీకి చెందిన పలువురు కాలనీ వాసులు వైసీపీని వీడి, తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగదేశం నాయకులు కాకుమాని కోటేశ్వరరావు, సోమినేని హరినాథ్, కాకుమాని వెంకటేశ్వర్లు, అల్లం మస్తానయ్య, ఘట్టమనేని మల్లికార్జున, సోమినేని సుధాకర్, గడ్డం అంకయ్య, కుర్రా కోటేశ్వరరావు, తన్నీరు మాల్యాద్రి, తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, తధితరులు పాల్గొన్నారు.

అల్లూరులో టీడీపీ ముమ్మర ప్రచారం



ప్రచారంలో సందీప్‌రెడ్డి, బినీత్‌రెడ్డి, గిరిధర్

అల్లూరు, ఏప్రిల్ 2 : అల్లూరులో మంగళవారం టీడీపీ, బీజేపీ, జనసేన నెల్లూరు ఎంపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడి కుమారుడు వేమిరెడ్డి సందీప్‌రెడ్డి, కావలి కూటమి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులరెడ్డి, కృష్ణ చైతన్య, అరగల రమణయ్య, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఊటు అశోక్‌రెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, పెనుమల్లి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి అల్లూరు పట్టణంలోని తూర్పు వీధి, గోగులపల్లి రోడ్డు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఏలూరు సుధాకర్‌రెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, కారుమంచి కార్తీక్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీవీ కండ్రిగలో ఇంటింటి ప్రచారం



ఎస్‌జీవి కండ్రిగలో ప్రచారం చేస్తున్న నేతలు

బిట్రగుంట, ఏప్రిల్ 2: బోగోలు మండలం ఎస్‌జీవీ కండ్రిగ పంచాయతీలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సోదరుడు దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతు కరపత్రాలు పంపిణీ చేశారు. రాత్రి కప్పరాళ్ల తిప్పలోని టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, తిరుపాల్‌రెడ్డి, హజరత్‌రెడ్డి యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, శీను, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

- దగదర్తి మండలం లింగాలపాడులో టీడీపీ కావలి నియోజకవర్గ నేత మాలేపాటి సుబ్బానాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రగతి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై అసత్య ఆరోపణలు తగదు

ఆత్మకూరు, ఏప్రిల్ 2: పింఛన్ల పంపిణీలో తెలుగుదేశం అడ్డుపడుతుందని వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం తగదని టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకట్వేర్లునాయుడు అన్నారు. ఈ విషయంపై మంగళవారం వారు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వలంటీర్ల సేవలపై ఈసీ విధించిన ఆంక్షలను వైసీపీ తన ఎన్నికల ప్రచారానికి అస్త్రంగా ప్రయోగిస్తుందని ఆరోపించారు. మరోవైపు వటంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించడం వల్ల పింఛనుదారులతో సానుభూతి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఈసీకి ఫిర్యాదులు అందడం, హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో కేంద్ర ఎన్నికల సంఘం పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 2: మండలంలోని 12 సచివాలయాల పరిధిలో 123మంది సిబ్బందితో 4,987 మంది లబ్ధిదారులకు బుధవారం మధ్యాహ్నం నుంచి సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా సచివాలయాల వద్ద టెంట్లు, తాగునీటి ఏర్పాట్లు చేస్తామని, వైద్యఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

అర్హులందరికీ...

వరికుంటపాడు: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని మంగళవారం ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలిపారు. సచివాలయాల్లో 6వ తేదీ వరకు పంపిణీ చేస్తామన్నారు. అందుకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తామన్నారు. దివ్యాంగులు, రోగులకు మాత్రం ఇంటివద్దకే వెళ్లి పంపిణీ చస్తామన్నారు.